
# కథామంజరి

## పది కథల సమాహారం



జన్మదిన ప్రత్యేక సంచిక

జూలై 2024

# కథామంజరి

## పది కథల సమాహారం



కథా మార్గదర్శి

జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకటరావు
ప్రచురణ కర్త

**జన్మదిన ప్రత్యేక సంచిక**

**జూలై 2024**

సంపుటి : 5 ♦ సంచిక : 6



# కథామంజరి
# పాఠకులకు
# మా
# కృతజ్ఞతలు







# బాలకథ

జులై నెల సంచిక నుంచి ప్రతీ నెలా కథామంజరిలో, పిల్లల కథలు రెండు ప్రచురింపబడతాయి!
ఈ కథల విషయమై చిన్న సూచనలు:

- 10-16 సంవత్సరాల మధ్య వయసులో ఉన్న పిల్లలు స్వయంగా ఆలోచించి, వారికున్న ఆలోచనలకి అక్షర రూపం ఇవ్వాలి. కథాంశం ఏదైనా వ్రాయవచ్చు. పిల్లలు ఇష్టపడే కథలు, పిల్లలు అర్థం చేసుకునే స్థాయిలో కథారచన ఉండాలి.
- 400 పదాలకు మించకుండా ఇలా వర్డ్ లో టైపు చేసి పంపాలి!
- కథ ఎలా వ్రాసినా సరే, ప్రచురణకు స్వీకరించే కథలను తగు రీతిలో మార్పులు, చేర్పులు చేసి ప్రచురణ చేయబడతాయి!
- పెద్దవారు కూడా పిల్లల కథలు వ్రాసి పంపవచ్చును. అవి కూడా ప్రచురణకు తీసుకోబడతాయి!
- పెద్దవారు వారి కథలను పిల్లల పేరుతో వ్రాసి పంపడం అనైతికమే కాకుండా, మా ఈ ప్రయత్నాలకు ఆశించిన ఫలితాలు దక్కకుండా చేస్తాయి!
- ప్రచురింపబడే కథలకు తగిన పారితోషికం కూడా ఉంటుంది!
- కథలు పంపవలసిన మా ఇమెయిల్: submit@kathamanjari.in

కథలు వ్రాయగలిగే పిల్లల్ని ప్రోత్సహిస్తూ, వాళ్ళల్లో సృజనాత్మకతకు పదును పెట్టే మా ఈ ప్రయత్నాలలో అందరి సహాయ సహకారాలను అందించ కోరుతున్నాం!

***

**కథామంజరి బృందం**







# మా జట్టు

సంపాదకుడు

**జయంతి ప్రకాశ శర్మ**

ప్రచురణ కర్త

**అవసరాల వెంకటరావు**

సంపాదక సహకారం

**ఎం.ఏ. పద్మనాభరావు**

**కృపాకర్ పోతుల**

**నందూరి సుందరీ నాగమణి**

ప్రచురణా సహకారం

**ఎం.ఎల్. కాంతారావు**

సాంకేతిక సహకారం

**Harbinger Publishing**

బొమ్మలు

**కొయిలాడ రామ్మోహనరావు**

**కొచ్చెర్ల వి.ఆర్.**

**సూరంపూడి చలపతిరావు**



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి 'గళ' సహకారం అందించిన కళాకారులు

శ్రీ/శ్రీమతి/కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వర రావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- భమిడిపాటి శరత్ జ్యోత్స్న గారు
- అవసరాల వెంకటరావు గారు

శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి

# ఇదీ వరస

## శీర్షికలు


| | |
|---|---|
| కథాకీయం | i |
| విశిష్ట అతిథి | iii |
| కథా మార్గదర్శి | v |
| కథా పరిచయం | vii |
| వినదగునెవ్వరు చెప్పిన.. | x |
| కథాపుస్తక పరిచయం | xi |


## కథలు, వ్యాసాలు


| | | |
|---|---|---|
| మండువా లోగిలి | సింహప్రసాద్ | 1 |
| ఒక్కసారి మా ఊరు పోయి రావాలి | డా. ఎం. సుగుణరావు | 8 |
| అష్టాక్షరి! | శ్రీమతి గొర్తి వాణి శ్రీనివాస్ | 15 |
| సీనిగాడి పెళ్లి | రాపాక కామేశ్వరరావు | 22 |
| చెప్పాలని వుంది | ఉయ్యూరు అనసూయ | 29 |
| వరికంకులు | పెమ్మరాజు విజయరామచంద్ర | 36 |
| పూల వ్యాపారం (బాల కథ) | ఎం. డి. అస్మిన్ | 44 |
| అడవిలో తపస్సు (బాల కథ) | వసుంధర | 46 |
| వడ్ల చిలకలు | శ్రీ తల్లావజ్ఝుల పతంజలి శాస్త్రి... | 50 |
| ఒసే తువ్వాలు అందుకో | శ్రీరంగం శ్రీనివాసరావు | 59 |


Cover Page : Sri Tallavajjhula Shivaji

# కథాకీయం

మరో ప్రస్థానం ముగిసింది!

ఈ మాట చదవగానే చాలా కోణాల్లోకి పాఠకుల ఆలోచనలు వెళతాయి. సహజం కూడా! కారణం మన చుట్టూ ఉన్న సమాజం, వాతావరణం, పరిస్థితులు, ఆ ఆలోచనల్లోకి తీసుకుని వెళతాయి. దేశంలో ఐదేళ్ల కోసారి వచ్చే పండగ ముగిసింది. పాలకులకు పాఠాలు నేర్పి, అనుభూతులు, అనుభవాలు మిగిల్చిన పండగ అని అందరు అభివర్ణించారు. అలాగే సాహిత్యరంగంలో అక్షరపోరాటం చేసి, నిజాన్ని నిర్భయంగా చాటి చెపుతూ, పత్రికా రంగంలో ఓ విప్లవాత్మకమైన మార్పులు, చేర్పులు తీసుకొచ్చిన మహనీయులు శ్రీ రామోజీరావుగారు కూడా నిష్క్రమించడంతో నిజంగా మరో ప్రస్థానం ముగిసిందని చెప్పాలి!

ఇక... కథామంజరి నాలుగేళ్ళ ప్రస్థానం ముగిసి, ఐదో ఏట అడుగు పెడుతున్న సందర్భం కూడా ఇది! గడిచిన నాలుగేళ్ళలో తట్టుకునే ఒడిదుడుకులు వచ్చి, కథాయజ్ఞానికి ఆటంకం కలగకుండా, మార్పులు, చేర్పులు చేసుకుంటూ ముందుకు నడుస్తున్నాం. అయితే.. కథల వాసితో పాటు, పాఠకులు కూడా పెరగాలనే మా పట్టుదలకి మీ అందరి సహకారం కావాలి. అంతర్జాలంలో కథలు ఎంతమంది చదువుతున్నారో చెప్పలేం కాని, ఎంతమంది చూస్తారో తెలుస్తుంది. చూసిన వారు, చదివి స్పందించి, పదిమంది చేత చదివించగలిగితే చాలు! వారిలో కొద్దిమందైనా కథల మీద అభిప్రాయాలు తెలియ చేయగలిగితే, కథల వాసి తప్పకుండా పెరుగుతుందనే నమ్మకం ఉంది.

కథామంజరి జన్మదిన వార్షికోత్సవ సందర్భంగా నిర్వహించిన "పల్లెకు పోదాం" కథల పోటీకి రాశిలో కథలు వచ్చినా, వాసిలో కథలు ఆకట్టుకోలేదు. బహుశా శీర్షిక పేరు.. రచయితల మస్తిష్కాలలో ఒకే కోణం ఆవిష్కరణకు దారితీసిందని అనుకోవచ్చు. కథ బావుందేమో గాని హృదయాన్ని తాకలేదు. కథనం, శైలి విషయాల్లో ఎంత బావున్నా.. స్పందన కలిగించలేదు. ఓరకంగా రచయితల స్వేచ్ఛని, ఈ శీర్షిక కట్టి పడేసిందా అనే సంశయం కలిగిందనే చెప్పాలి. కానీ మనకు ఓ మంచి ఉదాహరణగా చెప్పుకోవాలంటే.. "కాదేదీ కవితకనర్హం" అని శ్రీశ్రీగారంటే, "కాదేది కథానర్హం" అని రావిశాస్త్రిగారు ఆణిముత్యాలని అందించారు. నాలికకు ఎముక లేదని అన్నట్టే, మన తెలుగు రచయితల చేయికి కూడా ఎముక లేకుండా, ఎలాంటి కథనైనా అవలీలగా అందిస్తున్నారు. ఆ కోవలోనే, ఏటా ఓ నలభై ఏభై కథల పోటీలు వివిధ పత్రికలు, సంస్థలు నిర్వహిస్తూ, వాటిలో కొన్ని పోటీలకు శీర్షికలు సూచిస్తున్నారు. వాటి మీద కూడా, కలాలు పదును పెట్టి రచనలను సంధిస్తున్నారు. ఆ ఆలోచనతోనే ముందుకు అడుగు వేస్తూ, అందులో ఆణిముత్యాలు.. ఇవాళ కాకపోతే రేపైనా దొరకపోవు అనే నమ్మకంతో మరో అడుగు ముందుకు వేస్తున్నాం!


ఈ జన్మదిన సంచిక నుంచి "బాలకథ" ని ప్రారంభిస్తున్నాం. ప్రతీ నెలా రెండు బాల కథలు ప్రచురిస్తాం. అందులో పిల్లలు వ్రాసే కథలకు ప్రాముఖ్యాన్ని ఇస్తూ, పెద్దలు వ్రాసే పిల్లల కథలను కూడా ప్రచురిస్తాం. ఈ ప్రారంభాన్ని తన కలం మీదుగా శ్రీకారం చుట్టమని కోరిన వెంటనే బాలకథను వ్రాసి పంపిన ప్రముఖ రచయిత, నాటి చందమామ కథల నుంచి నేటికి బాలుడివలే కథలు అందిస్తూ, సుగంధ కథనాలతో చెరగని ముద్ర వేస్తున్న "వసుంధర" గార్లకి ధన్యవాదాలు

తెలుపుకుంటూ, వారి కథతో పాటు మాకు చేరి, స్వీకరించిన కథకుల్లో చిన్నవయసులో ఉన్న ఓ చిరంజీవి కథను కూడా ప్రచురిస్తున్నాం!

కథామంజరి జన్మదిన సంచిక కథల పోటీలో పాల్గొని జయప్రదం చేసిన రచయిత, రచయిత్రిలకు, కథామంజరిని పోషిస్తున్న శ్రేయోభిలాషులకు, అభిమానులకు, పాఠకులకు ధన్యవాదాలు తెలుపుకుంటూ, మరో అడుగుకు ముందుకు వేస్తూ.. సదా మీ ఈ సహకారాన్ని కొనసాగించమని మనవి చేసుకుంటున్నాం!

**సంపాదకుడు**

# విశిష్ట అతిథి



**డా. తల్లావజ్ఝుల పతంజలి శాస్త్రి**

సమాజపరమైన సమస్యల మీద కథలో, కవితలో వ్రాసి, తన బాధ్యత తీరిందని అనుకోకుండా, ఆ సమస్యల మీద ప్రత్యక్షంగా పోరాటాలు చేసే రచయితలను మన తెలుగునాట ఎంతోమందిని చూస్తాం. సిద్ధాంతాలను ఆచారించిన తర్వాతే, సాహిత్య ప్రక్రియల ద్వారా ప్రజల్లోకి ఆ సమస్యలను తీసుకెళ్ళే రచయితలు ఇంకా సమాజంలో మనకు కనబడతారు. నేటి సమాజంలో, ముఖ్యంగా గ్లోబలైజేషన్ తర్వాత, నిర్లక్ష్యానికి గురవుతున్న పర్యావరణాన్ని... అందులోనూ నదీజలాలను, అడవులను రక్షించడానికి నడుం కట్టుకున్న ఉద్యమకారులలో ఎక్కువమంది సాహితీకారులే మనకు కనబడతారు. వారిలో ప్రముఖంగా చెప్పుకోదగ్గ ఉద్యమకారుడు..కథ, నవల, నాటిక రచయిత డా.తల్లావజ్ఝుల పతంజలి శాస్త్రి గారు. తెలుగుసాహిత్యాన్ని ఆధునీకరించిన వారిలో ఒకరైన నాటి సాహితీవేత్త తల్లావజ్ఝుల శివశంకర శాస్త్రిగారు, పతంజలి శాస్త్రిగారికి పితామహుడైతే, మరో సాహితీవేత్త 'బారిష్టరు పార్వతీశం' మొక్కపాటి నరసింహశాస్త్రిగారు, వీరి మాతామహుడు. ఇంత ఘనమైన కుటుంబంలో పుట్టి, పెరిగిన పతంజలి శాస్త్రి గారు, మాతా పితామహుల పేరుని నిలబెట్టడమే కాకుండా, సాహిత్య రంగంలోనే కాకుండా, పర్యావరణ పరిరక్షణ ఉద్యమంలో కృషి చేస్తూ, గుర్తింపు తెచ్చుకున్నారు.

పతంజలి శాస్త్రి గారి రచనలలో ఓ ప్రత్యేకత ఉంది. ఏభై ఏళ్ళ క్రిందట వ్రాసిన కథలలోనైనా, ఈ మధ్య వ్రాసిన కథైనా.. కథలో తళుక్కున మెరిసే మరో కథ ఉంటుంది. కథనంలో ఆ కథను కొద్దిగా కదిపినట్టు కదిపి, పాఠకుల ఆలోచనలకి వదిలేస్తారు. ఎవరికివారు ఆ కథను వారి వారి ఆలోచనలు, అనుభవాలతో మదిలో ముద్రించుకుంటారు. పతంజలి శాస్త్రిగారి కథను మామూలుగా చదవడం పూర్తవుతుంది గాని, ఆ పాఠకుడి మస్తిష్కంలో మళ్ళీ కథ మొదలయి, వెంటాడుతుంది. వీరి కథలు ఎక్కువగా పాఠకుల్ని ఆలోచనల్లోకి నెట్టుతాయి. కొన్ని కథలు మళ్ళీ మళ్ళీ చదివిస్తాయి, శ్రద్ధగా చదివిస్తాయి... పాఠకుడిగా తానొక నిర్ణయానికి రావడానికి! ఆయన కథల మీద విశ్లేషణలు చదువుతున్నప్పుడు.. పాఠకుడు త్వరగా కథలో లీనమయ్యేందుకు అవసరమయిన వాతావరణ వర్ణన, పాత్రలు, సంభాషణలు చాలా సహజంగా ఉంటాయి! పతంజలి శాస్త్రిగారి కథలలో.. మామూలుగా కనబడే కథావస్తువు, శైలి, శిల్పం, కథనం, నిర్మాణం.. లతో పాటు పాఠకుడి విభాగం కూడా ఉంటుందనే' అభిప్రాయం కథా విశ్లేషణలలో కనబడతాయి. వైవిధ్యమైన కథలు వ్రాసిన పతంజలి శాస్త్రిగారు ఇరవై ఆరో ఏట కథలు వ్రాయడం మొదలెట్టారు. ఎవర్నో అనుకరించడం, తెలియని విషయాల మీద మాట్లాడటం గాని, వ్రాయడం గాని చేయని పతంజలి శాస్త్రిగారికి చిన్నతనంలో వారి తాతగారు, ఓసారి "నీ తలలో చాలా ఉన్నాయి, వాటి గురించి నీకు తోచింది, తోచినట్టు వ్రాయి" అంటూ ఓ మాట అన్నారట, అదే బాగా నాటుకుపోయింది. అలా సూటిగా, తన ఆలోచనలకి అనుగుణంగానే రాస్తారు.

# విశిష్ట అతిథి

మే 14, 1945 న పిఠాపురంలో జన్మించిన పతంజలి శాస్త్రి గారి విద్యాభ్యాసం ఒంగోలు, తిరుపతి, పూనేలలో జరిగింది. డక్కన్ కాలేజీ నుండి పురావస్తు శాస్త్రం మీద డాక్టరేట్ అందుకున్నారు. సంస్కృతం, ఆంగ్లభాషలలో మంచి పట్టున్న పతంజలి శాస్త్రిగారు చరిత్ర బోధించే అధ్యాపకులుగా, ప్రిన్సిపాల్‌గా పని చేసి, స్వచ్ఛంద పదవీవిరమణ చేసి, పర్యావరణ పరిరక్షణ బాట పట్టారు. మామ్, మొపాసా, శరత్ సాహిత్యాలంటే చాలా ఇష్టం. సంగీతం అంటే మరీ ఇష్టం. నిరంతరం మెదడులో ఏదో ఒక కథ రూపు దిద్దుకుంటూనే వుంటుంది, కాని కొన్ని మాత్రమే కాగితాల మీదకు వస్తాయి, అలా వచ్చిన వాటిలో కొన్నే వెలుగు చూస్తాయి. మిగతా వాటిని ఆయనే పక్కన పడేస్తారు. ఎందుకో తెలియదుగాని, వ్రాసిన కథలని ఆ ఆరునెలలు దాచుకుని తర్వాత వాటిని చించేసారుట. వందకు పైగా కథలు, మూడు నవలలు, కవితలు, నాటకాలు, పర్యావరణ పరిరక్షణ మీద వ్యాసాలు, సాహితీ వ్యాసాలు.. ముద్రణకు నోచుకుని, వెలుగుల్ని చూసి, పాఠకులకు చేరాయి. ఎన్నెన్నో సాహితీ పురస్కారాలు, సత్కారాలు అందుకున్న పతంజలి శాస్త్రిగారి "రామేశ్వరం కాకులు" కథా సంకలనానికి, 2023 సంవత్సర కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.

పతంజలి శాస్త్రి గారు.. పర్యావరణ పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన వివిధ సంస్థలలో సభ్యుడుగా పనిచేసి, అటు పర్యావరణాన్ని ఇటు నదీజలాల్ని కాపాడే బాటలో తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఈ సమస్యల మీద కూడా పలు పుస్తకాలు వ్రాసిన తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి గారు తెలుగు సాహితీ ప్రపంచంలో ఓ సుస్థిర స్థానం సంపాదించడమే కాకుండా, నేడు ప్రపంచమంతా ఎదుర్కొంటున్న పర్యావరణ సమస్య మీద, ఈ వయసులో కూడా ముందుండి సేవలు అందిస్తున్నారు.

ఉన్నతమైన ఆలోచనలు, ఆదర్శాలు, సిద్ధాంతాలతో పాటు నిలువెత్తు మంచితనం మూర్తీభవించిన శ్రీ తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి గారు, కథామంజరి జన్మదిన ప్రత్యేక సంచికకు విశిష్ట అతిథిగా విచ్చేసి, వారి ఆశీసులు అందచేసినందులకు ధన్యవాదాలు తెలియచేసుకుంటున్నాం.

**కథామంజరి బృందం**

# కథా మార్గదర్శి



## శ్రీ శ్రీరంగం శ్రీనివాసరావు

మరో వందేళ్ళ తర్వాత కూడా 'శ్రీశ్రీ' అంటే ఎవరని అడిగితే, "మహాకవి" లేదా "మహాప్రస్థానం" అనే సమాధానం ఖచ్చితంగా వస్తుంది. సరిగ్గా శతాబ్దం క్రిందట, మన దేశం బ్రిటిషు వారి పాలనలో ఉన్నప్పుడే, మనిషిలో చైతన్యం కలిగించే సాహిత్య ప్రభంజనాలు సృష్టించి, నాటి పరిస్థితులను ఎండకాస్తూ, భవిష్యత్తును కూడా తన కవిత్వంలో చూపెట్టిన మహాకవి, తెలుగువారు సగర్వంగా చెప్పుకోదగ్గ విప్లవ కవి శ్రీశ్రీ. తెలుగుభాష, జాతి ఉన్నంత కాలం నిలిచిపోయేలా, తెలుగు సాహితీ పరిమళాలు అందించిన సాహితీమూర్తి శ్రీశ్రీని తెలుగువారికి పరిచయం చేయవలసిన అవసరం లేదు. 'జగమెరిగిన కవికి, పరిచయం మేలా' అని అనిపించినా, శ్రీరంగం శ్రీనివాసరావుగారిని మరోసారి తలుచుకుని, ఆ సూర్యుడి ముందు మేం కూడా మరోమారు దివిటీ చూపిస్తూ, స్మరించుకునే భాగ్యం ఆయనలో ఉన్న "కథకుడు" కథామంజరికి కలిగించాడు.

1930 దశకంలో శ్రీశ్రీగారు మహాప్రస్థానం కవితలు వ్రాస్తున్నప్పుడు, ఆ రచనలని 'సామాజిక వాస్తవికత' అంటారని, దాని వెనుక 'మార్క్సిజం' అనే ఓ దార్శనికత ఉందని, శ్రీశ్రీగారికి తెలియదు. అప్పటి వరకు చందోబద్ధ సాహిత్యం అందిస్తున్న శ్రీశ్రీగారు 'నేను సైతం' కవితతో గురజాడ అడుగుజాడలలోకి అడుగు పెట్టారు. "రథాలు, పల్లకీలు, గుర్రబ్బళ్ళూ వెళ్ళే దారిని తప్పించి మోటార్లూ, రైలుబళ్ళూ తిరిగే ఆధునిక యుగానికి తెలుగు కవిత్వాన్ని మళ్ళించిన గురజాడ బాటని మరింత వెడల్పు చేశాను." అని ఆయనే అంటారు. తెలుగులో కవిత్వం వ్రాసే ప్రతీ కవి వెనుక శ్రీశ్రీగారుంటారు. అనర్గళంగా మాట్లాడే వక్త మాటల్లో మహాప్రస్థానం దొర్లుతునేవుంది. అలా కొన్ని యుగయుగాలు అజరామరంగా నిలిచిపోయే సాహిత్యాన్ని అందించిన శ్రీశ్రీగారు సినిమా పాటలు, మాటలు, పద్యాలతో పాటు కథలు కూడా వ్రాసారు. శ్రీశ్రీ కలం పుట్టించిన హోరు కవిత, పాటనే కాదు, కథగా, నవలగా, నాటకంగా, రేడియో నాటికగా కూడా రూపాన్ని సంతరించుకుంది. ఆయన కథ గాని, కవిత గాని యదార్ధవాద, విప్లవాత్మక ధోరణిలో, పదునుగా సమాజాన్ని చైతన్య మార్గంలో నడిపించే ప్రయత్నం చేస్తాయి. 'అమ్మ' నాటకం, 'మరో ప్రపంచం' నాటకాలు, 'చరమ రాత్రి' కథా సంకలనం, మానవుడి పాట్లు' నవల.. ఇలా ఎన్నో ఆయన సాహిత్య విస్తృతికి తరతరాలు నిలువెత్తు నిదర్శనాలు.

ఓ పాతిక, ముప్పై కథలు, మరో అన్ని అనువాద కథలు శ్రీశ్రీగారి కలం నుండి జాలువారాయి. మహాప్రస్థానం కవితల రచనకు ఓ దశాబ్దం ముందే కథలు వ్రాసారు. కొంత గ్రాంథికం, సాంప్రదాయ పద్దతులు ముందుగా కనబడినా, ఆ కథాంశంలో సామాజిక సమస్య పాఠకుల్ని ఆలోచనల్లోకి దింపుతుంది. అంతే కాదు.. ఓ ప్రత్యేకమైన శైలి, భావప్రకటన, కథనం, ఇలా అన్నీ శ్రీశ్రీ గారి ప్రత్యేకతలే! ఆయన కథల్లో సాధారణంగా కనబడే కవిత్వ పోకడలు కనబడవు, కవితలలో

కనబడే ప్రాస, శ్లేషలు కనబడవు. పాఠకుల్ని కథని జోరుగా చదివించే వాక్యనిర్మాణం, పద విన్యాసాలు కనబడతాయి. తెలుగువారి సాధారణ జీవితాల్లో వినబడే మాటల శ్లేషలు, పట్టుపదాలు, వాస్తవ పరిస్థితులు కళ్ళ ఎదుట సాక్ష్యాత్కరిస్తాయి. ఆయన శైలి అనుపమానమైనది. అతి తక్కువ పదాలతో, ఎక్కువ అర్థాన్నిచ్చే వాక్యాలని నిర్మించడం బహుశా శ్రీశ్రీగారికే సాధ్యమయిందని చెప్పొచ్చు! ఎత్తుగడ.. కథని చదివించేటట్టు చేస్తే, ముగింపు ఓ మెరుపులా చురుక్కుమంటుంది. ఇంగ్లీషు భాషా కథలను అనువాదం చేసినా సరే, ఆ కథ తెలుగునేల మీదే కనబడుతుంది. పామరుడిని సైతం మెప్పించి, సామాజిక స్పృహను కల్పిస్తుంది. అందుకే శ్రీశ్రీ అక్షరం అక్షరమైంది. ఆయన కథలు, కవితలు ఎంతోమందిని ప్రభావితం చేశాయి. పాఠకులు రచయితలయ్యారు. రచయితలు గతులు మార్చారు.

పూడిపెద్ది వెంకటరమణయ్య, అప్పలకొండ దంపతులకు 30 ఏప్రిల్ 1910 జన్మించి, శ్రీరంగం సూర్యనారాయణ దంపతులకు దత్తత వెళ్ళడం వలన 'శ్రీరంగం'గా ఇంటిపేరు మారింది. శ్రీశ్రీగారి ప్రాథమిక విద్యాభ్యాసం విశాఖపట్నంలో జరిగింది. పదిహేనేళ్ళ వయసులో వివాహం, ఆ ఏడాదే యస్.యస్.ఎల్.సి. పాసవడం జరిగాయి. మద్రాసు విశ్వవిద్యాలయంలో బియ్యే పాసై, కొన్నాళ్ళు విశాఖపట్నంలోని ఏవియన్ కాలేజీలో పనిచేసి, తర్వాత ఆంధ్రప్రభ, ఆకాశవాణి(ఢిల్లీ), మిలటరీ, నిజాం నవాబు ఆస్థానం , ఆంధ్రవాణిలో పని చేసారు. ఆ కాలంలోనే మహాప్రస్థానం కవితలు వ్రాసారు. తిరిగి 1947లో మద్రాసు వచ్చి స్థిరపడి, తన రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తూ, ఎన్నో సినిమాలకు పాటలు, మాటలు వ్రాసారు. శ్రీశ్రీగారికి వచ్చిన అవార్డులు, రివార్డులు కంటే పండిత పామరులను సైతం మైమరిపించి, మెప్పించిన సాహిత్యంతో కలకాలం తెలుగువారి హృదయాల్లో సుస్థిర స్థానం పొందడమే గొప్ప అవార్డు అని చెప్పాలి. అటు విప్లవ సాహిత్యాన్నీ, ఇటు సాంప్రదాయ సాహిత్యాన్ని ఆదరించే ఇరువురుని ఆకట్టుకోవడం శ్రీశ్రీ సాహిత్యానికే దక్కింది. అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులుగా ఉన్న రోజుల్లో, 1970లో ఆయన షష్టిపూర్తి మహోత్సవం జరుగుతున్న సందర్భంలో, శ్రీశ్రీ గారు అధ్యక్షులుగా విప్లవ రచయితల సంఘం ఏర్పడింది.

ఏడవ ఏట రచనలు చేయడం ప్రారంభించిన శ్రీశ్రీగారి మొదటి గేయాలసంపుటి ఎనిమిదవ ఏట ప్రచురింపబడింది. మహాప్రస్థానం కవితలతో పాటు, అమ్మ (నాటకం), చరమరాత్రి (కథా సంకలనం), మానవుడి పాట్లు (నవల), గురజాడ (సాహిత్య విమర్శ), ఖడ్గసృష్టి (కవితా సంకలనం), అనంతం (ఆత్మకథ), ప్ర–జ (ప్రశ్నలు–జవాబులు)... వంటి ఎన్నో శ్రీశ్రీగారి రచనలు అజరామరంగా ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందాయి. 30 ఏప్రిల్ 1983 కనుమూసిన శ్రీశ్రీగారికి మరణం లేదని చెప్పడానికి ఒక్కటే తార్కాణం... నేటికి శ్రీశ్రీ పేరు కనబడినా, వినబడినా.. ముందు కీర్తిశేషులు అన్న మాట కనబడదు వినబడదు!

సూర్యచంద్రులు ఈ జగతికి వెలుగులిచ్చే వరకు, నిలిచిపోయే తెలుగు సాహిత్యాన్ని అందించిన మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు గార్కి నివాళిగా, ఈ జన్మదిన సంచికను 'చంద్రునికో నూలుపోగు'గా అంకితం ఇస్తున్నాం!

**కథామంజరి బృందం**

## జీడిగుంట రామచంద్రమూర్తి గారి కథ "నిన్నటి కొడుకు"

జీడిగుంట రామచంద్రమూర్తి గారు సాహితీ ప్రపంచంలో ఒక బహుముఖ ప్రజ్ఞాశాలిగా కొనియాడబడిన వ్యక్తి. ఆయన కథలే మూడొందల పైచిలుకు ఉండగా, ఆయన రాసిన నాటకాలు, నవలలు, వ్యాసాలు, మొదలైనవి ఎన్నో ఉన్నాయి. ఆలిండియా రేడియోలో ఇరవై ఎనిమిది సంవత్సరాలు పనిచేసి, ప్రసార మాధ్యమంలో కూడా ఎన్నో ప్రక్రియలు చేసి శభాష్ అనిపించుకున్న కొద్దిమంది వ్యక్తులలో ఆయన ఒకరు. ఆయన రాసిన కథలలో ఈ నెల పరిచయం చెయ్యడానికి ఎంచుకున్న కథే 'నిన్నటి కొడుకు'.

కథంతా ప్రథమ పురుషలో పాత్ర చెబుతున్నట్లుగా రాయబడింది.

ఆయన అమెరికా వచ్చి, ఇంకో కొద్ది రోజుల్లో ఇండియా తిరిగి వెళ్ళి పోతూ న్యూజెర్సీ రాష్ట్రంలో బ్రిడ్జి వాటర్ అనే వూళ్ళో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి రావడం జరిగింది. ప్రసాదం తిని ఓ పక్కగా కూర్చున్నప్పుడు ఎవరో ఓ డెబ్బై ఏళ్ళ మనిషి దగ్గరకొచ్చి "హలో, నా పేరు నారాయణ, మీరు రేడియో స్టేషన్లో పని చేశారనుకుంటాను, కరక్టేనా?" అని పరిచయం చేసుకున్నప్పుడు అతన్ని ఎక్కడ చూశాడో గుర్తుకు రావడానికి ఎక్కువసేపు పట్టలేదు.

ముప్పై రెండేళ్ల క్రితం రేడియోలో ఉద్యోగం చేస్తూ దివిసీమలో వచ్చిన పెద్ద ఉప్పెన చేసిన ఉపద్రవాన్ని కవర్ చేయడానికి 'హంసల దీవి' కి వెళ్ళినప్పటి జ్ఞాపకాలు అతనే గుర్తుచేశాడు. అవును ఆ నారాయణే. తుఫాను, ఉప్పెన ఎంత భీభత్సాన్ని తెచ్చాయి ఆ గ్రామానికి? అతనికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు, ఒక అబ్బాయి, ఒక అమ్మాయి. పెనుగాలి, జడివాన మొదలయినప్పుడు నారాయణ పొలం పనులు ఆపి గబ గబా ఇంటికి వచ్చేశాడు. క్షణాల్లో పెరిగిపోయిన గాలి, వాన, ఊళ్ళోకొచ్చేసిన నీళ్ళు.

భార్య వెనకాలగా, పిల్లలిద్దర్నీ చెరో చంకలో వేసుకుని నడవలేక నడవలేక నడుస్తూ, వూరి చివరి శివాలయంకెళ్ళి తలదాచుకోవాలని ముందుకెళ్తున్నాడు నారాయణ. ఇంతలోనే వెనకనుంచి 'మావా' అంటూ తాటిచెట్టు మీదపడి భార్య కూలిపోయింది. ఎంత లాగినా ఆమెను బయటకు తీయలేక పోయాడు. ఆమె అక్కడే ప్రాణాలు విడిచింది. కోపం, బాధ, అశక్తత, ఎవరూ లేరు సహాయానికి. అప్పటికే మొలలోతు నీళ్ళొచ్చేశాయి. పిల్లల్నైనా కాపాడుకుందామనుకుని, ముందుకెళ్లే ప్రయత్నం చేశాడు నారాయణ. ఇద్దరు పిల్లలూ ఏడుపు. కొద్ది దూరంలోనే శివాలయం. కానీ, ఉధృతంగా గాలి, వాన, పడిపోయిన చెట్లు చుట్టుపక్కలంతా. నీళ్ళల్లో నడవడం కష్టంగా ఉంది. ఏదో చెట్టుని పట్టుకుంటే ముళ్ళున్న తుమ్మచెట్టు. గుచ్చుకుంటున్నాయి. ఈ లోపలే కొడుకు చేతుల్లోంచి జారిపోయాడు. "నేను బరువులేనయ్యా, నన్ను వదలకయ్యా..." అన్న రెండేళ్ల కూతురు ఏమైపోతోందో తెలుసుకునే లోపునే స్పృహ తప్పింది నారాయణకి. మర్నాడెప్పుడో స్పృహొచ్చింది. చుట్టూ బురద, పడిపోయిన చెట్లూ, మనుషుల శవాలూ, జంతువుల కళేబరాలూ, ఏడుపులూ, పెడబొబ్బలూ.... సత్తువ తెచ్చుకుని లేచి ఓ రెండడుగులు వేసిన నారాయణకి ఎక్కడో చిన్నగా ఏడుపు వినిపించింది కూలిన

మామిడి చెట్టు కొమ్మల మధ్య నుంచి. రెండేళ్ళైనా నిండని పిల్లాడు. తను పిల్లల్నీ, భార్యానీ పోగొట్టుకుంటే ఈ పిల్లవాడు తల్లి తండ్రుల్ని పోగొట్టున్నవాడు.

ఆ కుర్రాడిలోనే కొడుకు రాజును చూసుకుంటూ పెంచుకున్నానని చెప్పాడు నారాయణ. ఆ అబ్బాయి ప్రయోజకుడవడం, తనని ఎంతగానో ప్రేమతో చూసుకోవడం, అమెరికా తీసుకురావడం జరిగిపోయాయి. తను మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. ఏ జన్మలోనో ఆకుర్రాడే తనకి ఋణం ఉన్నాడనీ, తనకి ఈ మధ్యనే కిడ్నీ మార్పిడి చెయ్యాల్సివస్తే తను పెంచుకున్న కొడుకే తన కిడ్నీనిచ్చి తన ప్రాణం కాపాడాడని చెబుతాడు.

మాటల్లోనే నారాయణ కొడుకు భార్య, కొడుకులతో రావడం జరుగుతుంది. పరిచయాలలో కొడుక్కి రామనారాయణ అన్న పేరు పెట్టాడని తెలుస్తుంది. తను అడిగిన ప్రశ్నకు అతను తండ్రికి కిడ్నీనివ్వడం 'డొనేషన్' కాదని, బడ్డీ కొట్టు పెట్టుకుని రూపాయ రూపాయ కూడబెట్టి తనను తండ్రి చదివించాడని, తనీస్థితికి రావడానికి తన తండ్రి కారణమని వ్యక్తం చేస్తాడతను.

ఇంతలోనే తన కొడుకూ కోడలూ రావడం పరిచయాలూ అయి వీడ్కోలు చెప్పుకుని ఎవరి కారులో వాళ్ళు వెళ్ళిపోయే సందర్భంలో, నారాయణ వెనక్కి వచ్చి, 'ఒకవేళెప్పుడైనా భవిష్యత్తులో కలిసినా తను ఆ కొడుకుని చేరదీసి పెంచుకున్న విషయం ఎప్పుడూ చెప్పవద్దని, ఆవిషయం ప్రస్తావించవద్దని' తన చెయ్యి పట్టుకుని అడుగుతాడు. అంత దాచవలసిన విషయమేమిటో అర్థం కాలేదు. ఆ సంగతి తెలిస్తే ఇంకా కృతజ్ఞత చూపించేవాడు కదా అన్న ప్రశ్నకి నారాయణ చెప్పిన సమాధానమిది. "మొదట్లో ఆ విషయం చెప్పాల్సి రాలేదు. ఆ తరువాత తెలిస్తే, తన అసలు తల్లితండ్రులెవరో వెతుక్కునే ఆలోచనలో చదువు పాడుచేసుకుంటాడని చెప్పలేదు. ఇక ఎప్పుడైతే తన కిడ్నీ నాకు ఇచ్చాడో అప్పుడిక ఈ జీవితంలో ఆ రహస్యాన్ని బయట పెట్టకూడదని, అది నాతోనే అంతరించి పోవాలని నిర్ణయించుకున్నాను. పెంచి పెద్ద చేసినంతమాత్రాన ఎవరికో తన కిడ్నీని ఎందుకిచ్చానా అని, బ్రతికినంతకాలం వాడు బాధ పడతాడేమోనన్న భావం కలిగింది. తండ్రి, కొడుకులుగా మేం హాయిగా ఉన్నాం, హాయిగానే ఉండాలి, అంతే!" అంటూ చేయి వదలి మరమనిషిలా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు నారాయణ.

ఇదీ కథ.

ఇక్కడ రామచంద్రమూర్తిగారు కథలో కలిపిన పాత్రల మధ్య, సంఘటనలు జరిగిన కాలాల మధ్య, మనుష్యుల ఆలోచనల అంతరాలలో ఎంతెంత దూరాలను కలిపారో ఈ కథలో. ఎక్కడ అమెరికా, ఎక్కడ దివిసీమ! విషయం జరిగి ముప్పై రెండేళ్లు. దివిసీమలో జరిగిన భీభత్సాన్ని, వికావికలైన కుటుంబాల పరిస్థితుల్ని కళ్ళకు కట్టినట్లు పాఠకుల ముందుంచారు రచయిత. అక్కడి ప్రజలు ఎంత దుర్భరమైన పరిస్థితులకి లోనయ్యారో, మన దైనందిన జీవితాల్లో పడిపోయి మరచిపోయాం కూడా. కొత్త తరాల వాళ్ళకి బహుశా అక్కడేమి జరిగిందో తెలీదేమో కూడా!

అవన్నీ ఒక ఎత్తైతే నారాయణ ఆలోచనలు ఎంకో ఎత్తు. తను పెంచుకున్న కొడుకుకి ఏ సందర్భంలోనూ ఆ విషయం చెప్పకూడదన్న ఒక బలమైన నిర్ణయానికి రావడానికి కారణం, తండ్రి, కొడుకుల మధ్య ఉన్న ఆ బంధం తెగిపోకూడదన్న బలమైన ఆలోచన. ఇన్నేళ్ళుగా పెంచుకున్న ఆ బంధం, ఒక ఉప్పెన కాదు, ఏ చిన్న అలల తాకిడికీ ఏ కొంచెం సడలినా తను

తట్టుకోలేనన్న అతి సున్నితమైన భావన. తన కొడుకు ఆలోచనలు కాదిక్కడ ముఖ్యం. నారాయణ మనసే ఆ 'పెంపుడు' భావనను రానీయంది. ఆ భావన ఎంత బలమైనదో నారాయణ మాటల్లోనే చెబుతారు రచయిత.

ఇన్ని దూరాల్ని కలిపింది రామచంద్రమూర్తిగారి కథ. ఒక మంచి కథగా సాహిత్య ప్రపంచంలో నిలిచిపోతుంది.

రామచంద్రమూర్తిగారి కొన్ని కథలలో అమెరికా ప్రసక్తి ఉండడం ఒక ప్రత్యేకత. అమెరికా వచ్చినట్లుగానో, అక్కడి అనుభవాలో, లేక కొడుకో, కూతురో అమెరికాలో ఉండడం, ఇలా ఏదో విధంగా కథలలో సందర్భాలు కల్పించడం జరిగింది.

ఈ కథ నవ్య, 2010 దీపావళి సంచికలో ప్రచురించబడింది. చదవదలుచుకున్నవారికి కథానిలయం వారి వెబ్‌సైట్‌లో దొరుకుతుంది.

*పరిచయకర్త : శాయి రాచకొండ, హ్యూస్టన్*

## వినదగునెవ్వరు చెప్పిన..

జూన్ 2025 సంచికలోని అనంత పద్మనాభరావుగారి కథ 'మంటకు కరగని మంచు' కథనం, అద్భుతంగా సాగింది. పాఠకులకు కథాంశం, తెలిసినట్లే తోచినా, ముగింపు ఊహించగలిగినా కూడా... ఒక్క అక్షరం కూడా వదిలి పెట్టకుండా, ఆతృతగా చదివించగలిగిన వారి రచనాశైలి, నాకైతే విదేశీ రచయితల శైలిని పోలినట్లు తోచింది. రచయిత కథ వ్రాస్తున్నప్పుడు, ఆ కథలోని అంశాలను గూర్చి, ప్రదేశ పరిస్థితులను గూర్చి ఎంతగా అధ్యయనం చేయాలో... ఈ కథ ద్వారా గ్రహించవచ్చు. ఈ కథ ద్వారా... ప్రచురించబడిన 'కథామంజరి' పత్రిక యొక్క స్టాండర్డ్ కూడా అర్థం చేసుకోగలిగాను. ఇంత చక్కని కథనాన్నందించిన రచయితకు మరీమరీ ధన్యవాదాలండీ.

**శ్రీమతి తక్కలపల్లి స్వాతి**

---

"తల్లీ భారతీ వందనం" కథలో రచయిత్రి సరస్వతీ కరవది గారు, వాగా బోర్డర్ గురించి, అక్కడి విన్యాసాలలో ఉద్విగ్నత గురించి, చూడనివాళ్లకు కూడా, మనసుతో వీక్షించేంత గొప్పగా చెప్పారు. ఎంత చదువుకున్నా, అంతస్తుల తేడాలను ఎవ్వరూ మర్చిపోరని, ఆకలికేడ్చే పసిబిడ్డ విషయంలో కూడా నిర్దయగా ఉంటారని, తన కథలో సమాజాన్ని కూడా ప్రతిబింబించారు. ఒక సైనికురాలికి భారతి అని పేరు పెట్టడం ద్వారా, సింబాలిక్‌గా భరతమాత గొప్పదనం గురించి చక్కగా కథలో విపులీకరించారు. వాగా బోర్డర్‌ను నేను రెండుసార్లు దర్శించాను. ఎన్నిసార్లు వెళ్లినా, సైనిక విన్యాసాలను చూస్తుంటే ఆ ఉద్విగ్నత అంతే స్థాయిలో ఉంటుంది. కథలో మరొక్కసారి ఆ వాగా బోర్డర్ను దర్శింప చేసినందుకు రచయిత్రి గారికి అభివందనములు. "బతక నేర్చిన భారతీయుడు"లో "ద్విభాష్యం రాజేశ్వరరావు" గారు భారతీయత లేని భారతీయత గురించి చక్కగా అభివర్ణించారు. "కథామంజరి బృందం" వ్రాసిన కథలన్నీ ఆసాంతం చదివించేవిగా ఉన్నాయి. కథామంజరి జన్మదిన శుభాకాంక్షలు!

**డా. మజ్జి భారతి**

---


"తల్లీ భారతీ వందనం" కథ చాలా ఇన్స్పిరేషన్‌తో నిండి ఉంది. అసలు వింటూ ఉంటేనే దేశ భక్తి ఉప్పొంగింది. శ్రీమతి సరస్వతి గారు రచించిన తీరు చదివి వినిపించిన తీరు అద్భుతం.

"పొరుగు (సేవా) దొంగలు" చాలా చక్కని కథ. శ్రీ శర్మగారు, కథని వాస్తవానికి చాలా దగ్గరగా రాశారు. Outsourcing ద్వారా కలిగే ఎన్నో విపత్తులలో ఈ కథ ఒక చక్కని ఉదాహరణ. శ్రీ భోగారావు గారు స్పష్టంగా ఉత్సాహంగా చదివి వినిపించారు.

**భాను కొవ్వలి**



# కథాపుస్తక పరిచయం




## నిప్పు నుంచి నీరు

తెలుగు కథా భీష్ముడు శ్రీ విహారిగారి కథల గురించి వేరేగా తెలుగు కథాప్రియులకు చెప్పనవసరం లేదు. ఈ మధ్య కాలంలో విహారిగారి కలం నుంచి జాలువారి, ఏప్రిల్ 2024లో విడుదలైన ఇరవై కథల ఈ సమాహారం వెల రు.200/-.

ప్రతులకు

శ్రీ జె. ఎస్. మూర్తి (విహారి)
F 103, జె. బ్లాక్ (టెర్ర) రాజ్యపుష్ప అట్రియా,
గోల్డెన్ మిలే రోడ్డు, కోకపెట్,
హైదరాబాద్ – 500075
✆ 9848025600

## చిత్ర కథానందనం

కథలంటే ఇష్టం. ఆ ఇష్టంతో వ్రాసిన కథలు వెలుగు చూడకపోయినా, నిరాశ చెందకుండా 2015లో కథా ప్రపంచంలోకి అడుగుపెట్టిన ప్రముఖ చిత్రకారుడు శ్రీ కోయిలాడ రామ్మోహనరావుగారి 19 కథలు ఈ సంపుటిలో ఉన్నాయి. సరళంగా, క్లుప్తంగా, చక్కటి కథనంతో సాగే ఈ కథల సంపుటి వెల రు.150/-.

ప్రతులకు

కె. రామ్మోహనరావు
3-6-22, నరసింగరావు పేట,
అనకాపల్లి – 531001
✆ 9649345060



# మందువా లోగిలి


సింహప్రసాద్



✆ 9849061668


**జన్మదిన సంచిక 2024 "పల్లెకు పోదాం" కథల పోటీలో**
**ప్రోత్సాహక బహుమతి పొందిన కథ**

***"మాకు కాంటాక్ట్స్ ఉంటాయి గాని, కనెక్షన్స్ ఉండవు. కలిసి కూర్చుంటాం, కలిసి భోజనం చేస్తాం, కలిసి తిరుగుతాం తప్ప మా మధ్య ఎలాంటి బంధమూ ఉండదు. బంధం అంటే కనెక్షన్. కనెక్షన్ అంటే మనసుకి మనసుకి మధ్య ఉండే అపురూప అనుబంధం. ఇంత దాకా మిస్సయిన ఆ కనెక్షన్స్‌ని నేనూ చేజిక్కించుకోవాలనుకుంటున్నాను. ఇండియన్ కల్చర్ ముఖ్యంగా మీ ఫ్యామిలీ సిస్టం, నాకు బాగా నచ్చింది. మీ వివాహ వ్యవస్థ అంటే ఎంతో ఇష్టం. గౌరవం!"***

మా అబ్బాయి, వాళ్ల కంపెనీ 'టెక్ ఫెస్ట్'కి మమ్మల్ని తీసుకెళ్లాడు.

హైదరాబాదులోని ఆ కంపెనీ ఇలా ప్రతి ఏటా చిన్న సైజు ఉత్సవంగా జరుపుతుందట. పాటలు, నృత్యాలు, స్కిట్లు... హోరెత్తే సంగీతంతో ప్రదర్శిస్తున్నారు. మరోపక్క రకరకాల వెజ్, నాన్‌వెజ్ స్టార్టర్లు సీట్ల దగ్గరికి తెచ్చి మరీ అందిస్తున్నారు. ఆడిటోరియం లోపల రకరకాల స్టాల్స్ పెట్టారు. అందులో ఆడవారికి గాజులు, మగవారికి వారి వారి పేరు చెక్కి కీ చెయిన్స్, పిల్లలకు రంగుల స్కెచ్ పెన్నులూ, బజ్జీలు పకోడీలు పీచు మిఠాయిలాంటి తినే పదార్థాలు ఇస్తున్నారు. డిన్నర్ నార్త్, సౌత్ డిషెస్‌తో భారీగా ఏర్పాట్లు చేశారు.

సాంస్కృతిక కార్యక్రమం ముగియగానే, కంపెనీ మేనేజ్మెంట్ వారు వేదిక మీదకు వచ్చి ఉద్యోగుల కృషిని, టీం వర్క్‌ని అభినందించారు. వారి వల్లే కంపెనీ చక్కని ఫలితాలు సాధిస్తోందని అభినందించారు.

అమెరికా కంపెనీ డైరెక్టర్ సాగర్ చెలంకూరిని వేదిక పైకి ప్రత్యేకంగా ఆహ్వానించి సత్కరించారు.

ఆయన ఇంటిపేరు తప్పుగా విన్నాననిపించి, సరిగ్గా వినమని మా అబ్బాయికి చెప్పాను.

"నువ్వు విన్నది కరెక్టే నాన్నా. మన ఇంటి పేరే!"

"అయితే మన బంధువే అయి ఉంటాడురా. ఎక్కడి వాడో కనుక్కో!" మావాడు మొహమాట పడ్డాడు.

డిన్నర్ చేస్తుండగా నేనే సాగర్ దగ్గరికి వెళ్లి పరిచయం చేసుకున్నాను. మా ఇంటిపేరు నొక్కి చెప్పేసరికి, ఆసక్తి ప్రదర్శించాడు.




"మీరు ఏ ప్రాంతం, ఏ ఊరి వాళ్ళు?" అతడి పుట్టుపూర్వోత్తరాలు తవ్వడానికే నిశ్చయించుకున్నాను.

"తెలీదు. గోదావరి దగ్గరి విలేజ్ అని డాడీ చెప్పేవారు!"

"మల్లవరం?"

భుజాలు ష్రగ్ చేసి, "మేబి. ఐ యాం నాట్ షూర్ అంకుల్" అన్నాడు.

"మీ తాత పేరు"

“సుబ్బారాయుడు”

“అయితే మీరు కమలాకర్‌రావు గారి అబ్బాయి అయ్యుండాలి !”

“యా యా. డాడీ మీకు తెలుసా?”

“మా సీనియర్! మా ఊరు నుంచి మొదటిసారిగా అమెరికా వెళ్ళింది మీ నాన్నే. తర్వాత అక్కడే సెటిల్ అయిపోయాడు. నాకు తెలిసి మీరు ఎప్పుడూ మన ఊరికి రాలేదనుకుంటా!”

“అసలు ఇండియాయే రాలేదు. డాడీ చనిపోయినప్పుడు కొన్ని పేర్లు ఇచ్చి కాంటాక్ట్ చేయమని మమ్మీ చెప్పింది గాని, వాళ్ళ కాంటాక్ట్ నెంబర్లు తెలీక ఇన్ఫామ్ చేయలేకపోయాను!”

పక్కనే ఉన్న భార్యకి, ఇరవై ఏళ్ల కూతురికి నన్ను పరిచయం చేశాడు.

“డాడీ విలేజ్ గురించి, రిలేటివ్స్ గురించి తెలుసుకోవాలని ఇంటరెస్ట్‌గా ఉంది! రేపు హోటల్ కి రాగలరా?”

“తప్పకుండా! తమ మూలాలు ఎక్కడున్నాయో తెలుసుకోవాలని ప్రతివారికీ ఉంటుంది. ఉండాలి!”

మర్నాడు మా అబ్బాయి, మా ఆవిడతో కలిసి హోటల్‌కు వెళ్ళాను. జున్ను, మొగల్తూరు సీతాఫలాలు తీసుకెళ్లాం.

భార్య లిజ్ నీ, కూతురు గోదావరినీ పరిచయం చేశాడు.

“డాడీయే ఆ పేరు పెట్టారు!”

“వెరీ హ్యాపీ. ఒకనాడు వేలాది ఆకలి చావులు చూసిన ప్రదేశం ఇవాళ ధనధాన్యాలతో తులతూగుతోందంటే, దానికి కారణం గోదావరీ, దాని మీద ఆనకట్ట కట్టిన కాటన్ దొరవారు!”

“దొర?”

“ఎస్. బ్రిటీషర్! అతను చేసిన భగీరథ ప్రయత్నం మరువలేనిది. అందుకే నేటికీ కోనసీమ బ్రాహ్మలు సంధ్యావందనంలో అతన్ని స్మరిస్తుంటారు!”

“రియల్లీ గ్రేట్!”

“మనం ఉన్నా, లేకపోయినా మనం చేసిన మంచి పనులు మాత్రం ఎప్పటికీ నిలిచి ఉంటాయి. భౌతికంగానో, జనం గుండెల్లో జ్ఞాపకాలు గానో!”

“వెల్ సెడ్. మనకి ఏమైనా రిలేషన్ ఉందా!”

“మా నాన్న, మీ తాత బ్రదర్స్” అనేసరికి, “ఓ. సో యు ఆర్ మై కజిన్!” వాటేసుకున్నాడు. లేచి వచ్చి పక్కన కూర్చున్నాడు.

ఊరి విశేషాలు, తండ్రి ఫ్రెండ్స్, వారి వారసుల కబుర్లు చెప్పించుకున్నాడు.

“మన పూర్వీకుల ఆఖరి జ్ఞాపక చిహ్నం మండువా లోగిలి! ఇప్పుడు కూలడానికి సిద్ధంగా ఉంది. మీరు వచ్చి చూస్తే బాగుంటుంది. తర్వాత చూడడానికి మరి ఉండదు!”

"అందులో ఎవరూ నివసించడం లేదా!"

"ఆర్థిక పరిస్థితి బాగోలేక అందరూ, అటు భీమవరం, ఇటు హైదరాబాద్ వలస పోయారు. పిల్లలు చదువుకుని ఉద్యోగాలకు వెళితే, వారి వెంట కొందరు తరలిపోయారు!"

గోదావరి మరింత ఉత్సాహంగా మండువా లోగిలి గురించి ఆరా తీసింది. "మీ డాడీ ముత్తాతకి ఆరుగురు కొడుకులు. అందరూ కలిసికట్టుగా ఉండటానికి ఆరు వాటాల లోగిలి కట్టారు. మధ్యలో మండువా అంటే కూడలిలో అంతా కలిసి, పని ఎవరిదైనా సరే కలిసికట్టుగా చేసుకునేవారు. కుటుంబపు కొమ్మలు తలో దిక్కుకీ చాచుకుంటూ వెళ్లిపోయాయి కానీ, అందరి వేళ్ళూ ఒకటే. అదే వంశవృక్షం!"

"గ్రేట్ ట్రెడిషన్!"

"లోగిలిలోనే కాదు ఊళ్లోనూ ఆ మండువా లోగిలి కల్చర్ ఉండేది. అందరూ ఏదో వరుసతో పిలుస్తూ బాంధవ్యం కల్పించుకునేవారు. సఖ్యంగా కలిసి ఉండేవారు. కష్టంలో సుఖంలో తోడునీడగా ఉండేవారు. నిజానికి అంతా కలవడానికి, ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకోవడానికి, ఆత్మీయ భావన పెంపొందించుకోవడానికి పెళ్లి, చావు, పండగలు, ప్రతీదీ ఓ ఉత్సవంలా జరిపేవారు!"

గ్రాండ్ ఫా ఊరు చూద్దామని మంకుపట్టు పట్టిందా అమ్మాయి. "మీ గ్రాండ్ ఫాదే కాదు గ్రాండ్ మదర్ దీ అదే ఊరు!"

"ఫెంటాస్టిక్!" ఎగిరి గంతేసింది. ఇద్దరి రిలేటివ్సునీ కలుద్దామంటూ తల్లిదండ్రులని ఫోర్స్ చేసింది.

"మై వైఫ్ ఈజ్ ఆర్డెంట్ ఫ్యాన్ ఆఫ్ తిరుపతి బాలాజీ. రేపు అక్కడికి వెళుతున్నాం!"

"అక్కడి నుంచి ఫ్లైట్లో విజయవాడ వస్తే, ఎయిర్‌పోర్టు నుంచి కారులో మూడు గంటల్లో మన ఊరికి వచ్చేస్తారు. మీరు వస్తానంటే మన వారందరినీ సమావేశపరుస్తాను. ఎలాగూ కార్తీకమాసం మొదలైంది గనుక సామూహిక వన భోజనాలు చేసినట్టూ ఉంటుంది!"

ఆ అమ్మాయి వనభోజనాల గురించి అడగ్గా మా అబ్బాయి వివరించాడు.

"ఓకే దెన్. ఐ విష్ టు మీట్ ఆల్ మై బ్లడ్ రిలేషన్స్!" ఉత్సాహపడ్డాడు సాగర్. అతని భార్య కూడా ఉత్సుకత ప్రదర్శించింది.

హోటల్ నుంచి వస్తూనే అందుబాటులో ఉన్నవారికి ఫోన్ ద్వారా సమాచారం అందించాను.

'మనవాడు అమెరికాలోని పెద్ద సాఫ్ట్వేర్ కంపెనీ డైరెక్టర్ అయ్యాడంటే మనకి ఎంత గర్వకారణం. రేపు ఎప్పుడైనా మన కుర్రాళ్ళకి అవసరమైతే చేయూతనిస్తాడు' అన్నారు కొందరు.

వివిధ ప్రదేశాల్లో ఉన్న మా వంశపు అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు, వారి పిల్లలు, అల్లుళ్ళు అంతా తరలి వచ్చేసారు. దాదాపు రెండువందల మంది దాకా అయ్యారు. నా చిన్నప్పుడు గ్రామదేవత చల్లాలమ్మ వారి తిరునాళ్లకు ఇలాగే వచ్చేవారు. మళ్లీ ఇన్నాళ్లకు ఆ అపురూప సంగమ దృశ్యం... సాగర్ వల్ల సాధ్యమైంది!

నా కళ్ళే కాదు, ఊరి కళ్లూ ఉద్వేగంతో చెమ్మగిల్లాయి. ఊరంతా బీరకాయ పీచే గనుక, వారిలోనూ కొందరు వచ్చారు. సాగర్ కుటుంబానికి మేళతాళాలతో స్వాగతం చెప్పాం. మాకు సంక్రాంతి పండగ ముందుగానే నడిచి వచ్చేసినట్టుగా ఉంది. ఊరంతా తిప్పి వేంకటేశ్వర స్వామి గుడి, చెరువు, రావి చెట్టు బజారు... చూపించాం.

“ఇదిగో ఈ రావిచెట్టు రచ్చబండ మీద కూర్చునే, మీ తాత ఊరి గొడవల్లో తీర్పులు ఇచ్చేవారు. ఇదే మీ నాన్న చదువుకున్న బడి. అప్పట్లో ఇది ఎలిమెంటరీ స్కూలే. మీ నాన్న అయిదారు కిలోమీటర్లు దూరంలోని వీరవాసరం నడిచి వెళ్లి చదువుకున్నాడు. తర్వాత మత్స్యపురిలో హైస్కూల్ వచ్చాక, మన ఊళ్లో చదువుకునే వాళ్ళు పెరిగారు. తర్వాత మన చెలంకూరి నరసింహమూర్తిగారి కృషి వల్ల ఈ బడి జిల్లా పరిషత్ హైస్కూల్ అయింది! చదువు ఉంటే చాలు అభివృద్ధి, ఉద్యోగం, ఉపాధి అన్నీ నడచి వస్తాయి!'' వ్యాఖ్యానించాను.

ప్రతిదీ ఆసక్తిగా చూస్తూ విన్నాడు సాగర్. అతడికి ఈ నేల, నీరు పరిచయం లేకపోవచ్చు. కానీ ఏదో దగ్గరితనం , ఏదో హృదయ స్పర్శ, అతని గుండెల్ని స్పృశించే ఉంటుంది!

ఊరంతా తిప్పి, అన్నీ వివరంగా చూపించి, మా మండువా లోగిలికి తీసుకెళ్లాం.

దీర్ఘ తపస్సు వల్ల శుష్కించిన ఋషి దేహంలా ఉంది మండువా లోగిలి!

ఎన్ని తరాలకు ఆశ్రయం ఇచ్చిందో వివరించాం. ఆ లోగిలితో పెనవేసుకున్న మా బాల్య స్మృతుల్ని వారి ముందు పరిచాం. పిమ్మట లోగిలి స్వరూపం చూపిస్తూ వివరించాను.

“మన లోగిలిది తూర్పు సింహద్వారం. మిగతా మూడు వైపులా ఒక్కో పక్కన రెండు వాటాలు చొప్పున కట్టారు. ఒక్కోదానికి ముందు గది, పొడుగాటి నడవ, ఒక గది. పెరటి వైపున విడిగా వంట వసారా, గాదె, వాటి వెనుక పశువుల శాల. అందరిదీ ఒకే రకపు వాటా. ఇదిగో ఈ వాటా మీదే. ఈ ఆరువాటాలు కలిసిన మధ్య ప్రదేశం మండువా!”

మండువాలో పది అడుగుల వ్యాసపు చదరపు గుంటను చూపించి ‘ఇది ఎందుకని’ ప్రశ్నించింది గోదావరి.

“ఇంటి పైన కురిసిన వాన నీరు ఇందులోకొచ్చి పడి, తూము ద్వారా బయటికి వెళ్తుంది. ఈ చుట్టూ ఉన్న స్తంభాల ప్రదేశం అన్ని వాటాల వారికీ కామన్ ఏరియా. పిల్లల ఆటలు, ఆడవారి కబుర్లు, మగవారి వ్యవసాయ పనిముట్ల బాగుజేత... వగైరా పనులు ఇక్కడే చేసుకునేవారు. చూశావుగా, ఈ లోగిలి ఇవాళో రేపో అన్నట్టుగా ఉంది. రిపేర్ చేయించకపోతే ఎన్నాళ్లో నిలబడదు. మీరైనా పూనుకుని దీన్ని నిలబెడితే, గత కాలపు వైభవాన్ని ముందు తరాలకు చాటినవారు అవుతారు. వారసత్వ సంపద అందించిన వారు అవుతారు. ఇందులో మీ వాటా ఆరో వంతు మాత్రమే అనుకోండి. అయినా మిగతా వారి ఆర్థిక పరిస్థితి బాగా దిగజారింది. వారి వల్ల ఏమీ కాదు. మీరు పూనుకోగలిగితే బాగుంటుంది. మనం ఎంతగా ఎదిగామన్నది కాదు, మన వల్ల ఎందరు ఎదగగలిగారన్నది ముఖ్యం!”

నా వంక సాలోచనగా చూసాడు సాగర్.

“ఆల్ లివ్డ్ టుగెదర్ హియర్? హౌ ఇటీజ్ పాసిబుల్?'' లిజ్ అడిగింది.

“అంతా విడివిడిగా ఉంటూనే కలిసికట్టుగా మసలటం, ఈ మండువా లోగిలి ప్రత్యేకత. ఇలాంటివి మన ఊళ్లో ఇంకో

మూడు ఉండేవి కానీ, మల్లు వారిది ఒకటే కాస్త గట్టిగా ఉంది. మిగతావన్నీ ఎప్పుడో...!'' ఆ పై మాటలు మింగేసాను.

“రిపేర్ చేయడానికి ఎంత ఖర్చు అవుతుంది?” ఆరా తీశాడు సాగర్.

అందరి లెక్కలూ విని, “ముప్పై, నాలభై లక్షలు. సుమారు నలభై వేల డాలర్లు!” మా అబ్బాయి చెప్పాడు.

“ఐయామ్ ఇంప్రెస్డ్. వియ్ హావ్ టు ప్రిజర్వ్ దిస్ హెరిడిటిరీ మాన్యుమెంట్. ఐ విల్ గెట్ ఇట్ రిపేర్డ్, బట్ హూ విల్ రిసైడ్ హియర్?”

“మనవాళ్ళలో ఇల్లు లేని పేదలకు ఇద్దాం! మీ పేరు చెప్పుకుని సంతోషంగా జీవిస్తారు. మిగతా హక్కు దారుల నుంచి ఎలాంటి ఇబ్బందీ రాకుండా నేను చూసుకుంటాను!”

“డన్. గెట్ ఎస్టిమేషన్స్ అండ్ ప్లాన్ ప్రిపేర్డ్ బై క్వాలిఫైడ్ ఇంజనీర్!”

అందరం ఆగకుండా ఐదు నిమిషాల పాటు తప్పట్లు కొట్టాం.

పెద్దవాళ్లు వారిస్తున్నా వినకుండా గ్రామ యువకులు ముందుకు వచ్చారు. “ఇది గ్రేట్ వర్కే. కానీ కొద్దిమందికే, అదీ.. మీ వాళ్ళకే ఉపయోగం. మీరు గ్రామాభివృద్ధి కోసం కొన్ని మంచి పనులు చేస్తే బాగుంటుంది. ఊరందరికీ ఉపయోగిస్తుంది!”

“వాట్ దే వాంట్?” లిజ్ అడిగింది.

“ఫైనాన్షియల్ అసిస్టెంట్ ఫర్ డెవలప్మెంట్ ఆఫ్ విలేజ్” వివరించాడు సాగర్.

“ఓకే. వుయ్ కెన్ హెల్ప్ త్రో అవర్ ట్రస్ట్!” మెరుస్తున్న కళ్ళతో అంది.

“గుడ్ ఐడియా! మా ట్రస్ట్ ద్వారా ఎన్నో సహాయ కార్యక్రమాలు చేస్తూ ఉంటాం. అలాగే ఇక్కడా చేద్దామంటోంది నా వైఫ్. ఏమి చేస్తారో, ఎంత ఉపయోగమో వివరాలు పంపించండి. బట్ వన్ థింగ్, ప్రతి డాలర్ సద్వినియోగం అవ్వాలి. సమ్ పీపుల్ హాస్ టు టేక్ రెస్పాన్సిబిలిటీ కలెక్టివ్లీ!” నొక్కి చెప్పాడు.

యువబృందం ముందుకు వచ్చి హామీ ఇచ్చింది. వారి భుజాలు తట్టాడు. “మీలోని మెరిట్స్‌ని మా కంపెనీలో ట్రైనీస్‌గా తీసుకుంటాం. బట్ ఐ వాంట్ సాలిడ్ మెరిట్ ఓన్లీ!”

గ్రామస్తులు మరోసారి తప్పట్లు కొట్టారు.

పిమ్మట అమ్మవారి గుడి చుట్టూ ఉన్న వరి కోసిన పొలాల్లో ఏర్పాటు చేసిన వనభోజనాలకు తీసుకెళ్లాం.

అక్కడంతా శుభ్రం చేసి పట్టాలు పరిచి, షామియానాలు వేయించాం.

ముగ్గురు గ్రామదేవతల దర్శనం చేసుకున్నారు. విగ్రహాల సైజు చూసి ‘ ఔరా’ అన్నారు. గోదావరి కించిత్తు బెదిరినట్టు చూసింది.

బంధు మిత్రులందరూ పోటీపడి మరీ సాగర్ మీదకు వచ్చి పడ్డారు. అతడు తమకి, తాము అతడికి ఏమవుతారో చెప్పారు.

అతని తల్లి, తండ్రి, తాతయ్య, నాన్నమ్మలను తలచుకున్నారు. వారికి ఊరివారితో గల అనుబంధాన్ని స్మరించారు.

"వావ్! మనకు ఇంతమంది రిలేటివ్స్ ఉన్నారా!" విస్తుపోయింది గోదావరి.

"ఎస్. అవర్ రూట్స్ఆర్ హియర్, ఇన్ దిస్ సాయిల్ ఓన్లీ!" గుండెలు పొంగించి చెప్పాడు సాగర్.

పూర్వకాలంలో మాదిరిగానే పనివాళ్ల అవసరం లేకుండా, ఆడవారంతా కలిసికట్టుగా కొంగు బిగించి మరీ చేస్తున్న వంటల్ని చూపించి, వివరించాం.

అంతా కలిసి నేల మీద కూర్చుని బంతి భోజనం చేశాం. వారు చేత్తో తినడానికి చాలా ఇబ్బంది పడ్డారు. స్పూన్స్ ఇచ్చాం గాని, వాటిని లాగేసుకుంది గోదావరి. "లెటజ్ ఫాలో ది విలేజ్ ట్రెడిషన్" అంది.

"మీ ముత్తాత ఇలాగే సుద్దులు చెప్పేవాడు!" అన్నాడో ముసలాయన.

మురిసిపోయారు తండ్రీ కూతుళ్లు.

ఆటపాటలు అయ్యాక అందరం కలిసి సాగర్ దంపతుల్ని ఘనంగా సత్కరించాం. బొట్లు పెట్టి, కొత్త బట్టలు పెట్టాం.

ఎంతో సంబరపడిపోయారు. లిజ్ ఉద్వేగంతో ఊగిపోయింది. చెమ్మగిల్లిన కళ్ళతో మాట్లాడింది. ఆమె మాటల్ని తెలుగులోకి తర్జుమా చేసాడు మా అబ్బాయి.

"మీ ప్రేమాభిమానాలకు కరిగి నీరు అవుతున్నాను. ఇంతటి ఎఫెక్షన్ కనీ వినీ ఎరుగను. నిజంగా నేను ఎంతో లక్కీని. ఆ లక్ ఇదిగో ఈ సాగరే! అతడు నన్ను ఎంతో ప్రేమగా గౌరవంగా అపురూపంగా చూసుకుంటాడు. ప్రతి పని షేర్ చేసుకుంటాడు. ఒక్క ముక్కలో చెప్పాలంటే మూడు పెళ్లిళ్లు చేసుకున్న మా అమ్మ కన్నా నేను ఎక్కువ హ్యాపీగా ఉన్నాను. ఆమె నన్ను చూసి అసూయ పడుతుందంటే మీరు నమ్మాలి. మీ అభిమానానికి థాంక్స్. ఇక వీలున్నప్పుడల్లా ఇక్కడికి వస్తుంటాం. ఇది సాగర్ ఏన్సెస్టర్స్ విలేజ్ కాదు, నన్ను కన్న కూతురిగా ఆదరించిన డియరెస్ట్ విలేజ్. థాంక్యూ ఆల్!"

వెంటనే గోదావరి లేచి నిలబడింది. అందరం ఆసక్తిగా చూసాం.

"ఐ టూ అగ్రీ విత్ మామ్. షి ఈజ్ వెరీ హ్యాపీ అండ్ సెక్యూర్డ్ పర్సన్. మాకు కాంటాక్ట్స్ ఉంటాయి గాని, కనెక్షన్స్ ఉండవు. కలిసి కూర్చుంటాం, కలిసి భోజనం చేస్తాం, కలిసి తిరుగుతాం తప్ప మా మధ్య ఎలాంటి బంధమూ ఉండదు. బంధం అంటే కనెక్షన్. కనెక్షన్ అంటే మనసుకి మనసుకి మధ్య ఉండే అపురూప అనుబంధం. ఇంత దాకా మిస్సయిన ఆ కనెక్షన్స్‌ని నేనూ చేజిక్కించుకోవాలనుకుంటున్నాను. ఇండియన్ కల్చర్ ముఖ్యంగా మీ ఫ్యామిలీ సిస్టం, నాకు బాగా నచ్చింది. మీ వివాహ వ్యవస్థ అంటే ఎంతో ఇష్టం. గౌరవం! మీ అందరితో మా పూర్వీకుల ఊరితో వారి జ్ఞాపకాలతో కనెక్షన్ పెట్టుకోవాలని ఆశగా ఉంది. నేను కూడా మా అమ్మలా ఇండియన్నే పెళ్లి చేసుకుంటాను!"

తప్పట్ల వర్షం పది నిమిషాల పాటు ఆగకుండా కురిసింది!

# ఒక్కసారి మా ఊరు పోయిరావాలి


## డా. ఎం. సుగుణరావు



✆ 9393129945


**జన్మదిన సంచిక 2024 “పల్లెకు పోదాం” కథల పోటీలో**
**ప్రోత్సాహక బహుమతి పొందిన కథ**

> ***“ఒక ఆత్మహత్య అంటారా? ఇది ఆత్మహత్య కాదు. ఒక సామాజిక హత్యే! ప్రకృతి కూడా రైతు మీద పగ పట్టింది. రైతు బిక్కుబిక్కు మంటూ చినుకు జాడ కోసం ఎదురుచూస్తూ వుంటాడు. ఒకవైపు కమ్ముకుంటున్న కరవు కూడా. దెబ్బతిన్న పంటల పరిహారానికి లెక్క తేలదు. వర్షం లేక ఇంకిపోయిన భూగర్భ జలాలు. దాంతో ఆవిరై ఇంకిపోయిన ఆశలు. గరళాన్ని గొంతులో దాచుకున్న ఈశ్వరుడైపోయాడు రైతు.***

వివేక్ ఆరోజు ఉదయం తొందరగా లేచాడు. చాలా సంతోషంగా ఉంది. చాలా సంవత్సరాల తర్వాత తన ఊరు వెళ్తున్నాడు. తను పుట్టి పెరిగిన ఊళ్లోనే తనకు ఉద్యోగం వచ్చింది. ఆనందంతో అంతకు ముందురోజు రాత్రి నిద్ర పట్టలేదు. ఇంకో అరగంటలో తను కుదుర్చుకున్న టాక్సీలో ఆ ఊరు వెళ్తాడు. ఉదయమే లేచి పనులన్నీ ముగించుకుని తయారై బైటికి వచ్చి చూసేసరికి... వదిన టమోటాలు కడుగుతూ కనిపించింది. ఒక బకెట్ నిండా టమోటాలు.

“దేనికి ఇన్ని టమోటాలు కొన్నారు?” అన్నాడు వివేక్.

“చవకగా వచ్చాయి. కేజీ ఇరవై రూపాయిలే! మీ అన్నయ్య రైతు బజార్ నుంచి తీసుకొచ్చారు!” అంది.

ఆ మాటలకు ఒక్కసారి మనసు చివుక్కుమనిపించింది వివేక్‌కు. “అయ్యో మనకు కేజీ ఇరవై రూపాయిలకు దొరికితే, టమోటాలు పండించే రైతుకు ఎంత మిగులుతుందో! కనీసం ఒక రూపాయి అయినా వస్తాదో రాదో కేజీకి?” అన్నాడు.

ఆ మాటలకు ఆఫీసుకు వెళ్లడానికి తయారవుతున్న వివేక్ అన్నయ్య, “ఒరేయ్, అగ్రికల్చరల్ బిఎస్సీ చదివినంత మాత్రాన మొత్తం రైతులందరినీ ఉద్ధరించడానికి నడుం కట్టుకున్నట్టే మాట్లాడతావు. వాళ్లను అభివృద్ధి పరచడానికి ప్రభుత్వం ఉంది. పథకాలు ఉన్నాయి!” అన్నాడు, చిన్నగా నవ్వుతూనే.


ఆ మాటలకు వివేక్ మౌనంగా అయిపోయాడు. ఒక్కసారి ఆలోచనలో పడ్డాడు.

అన్నావదినలకు తను అగ్రికల్చరల్ బిఎస్సీ చదవడం ఇష్టం లేదు. ఇంటర్మీడియట్‌లో తను బైపిసి తీసుకోవడం వారికి నచ్చలేదు. ఎమ్‌పిసి తీసుకుని కంప్యూటర్ సైన్స్‌లో ఇంజినీరింగ్ చేసి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా అమెరికా వెళ్తే బాగుంటుందనేది వారి ఆకాంక్ష. అయితే వారి కలలకు తను గండి కొట్టాడు. అమ్మానాన్నలు తన పదిహేనేళ్ల వయసప్పుడు చనిపోయారు.

నాన్న వ్యవసాయదారుడు. ఒక రాత్రిపూట పొలానికి వెళ్తుంటే పాము కరచి చనిపోయాడు. ఆ బెంగతో కొన్ని నెలలకు అమ్మా చనిపోయింది. అప్పటికే పెళ్లయిన అన్నావదినలే తనకూ, చెల్లెలికి అమ్మానాన్నలయ్యారు.

తన చెల్లెలు హైదరాబాద్‌లో హాస్టల్‌లో వుండి ఇంజినీరింగ్ చదువుతోంది. తను సంవత్సరం క్రితమే ఏజీ బిఎస్సీ పూర్తి చేసాడు. అప్పటి నుంచి బ్యాంకు పరీక్షలు, ప్రభుత్వ ఉద్యోగం ప్రయత్నాలు మొదలుపెట్టాడు. ఖాళీగా ఉండడం ఎందుకు, కంప్యూటర్ కోర్స్‌లో చేరు... అంటూ అన్నావదినలు ఒత్తిడి చేసారు. వారి కోసం ఆ కోర్సును పూర్తి చేసాడు. తనకు ఏమాత్రం ఇష్టం లేదు. అయితే వారి ఉద్దేశ్యం వేరేగా ఉంది. ఇప్పుడు పిల్లలందరూ అమెరికా వెళ్లిపోతున్నారు. అక్కడే చదివి ఉద్యోగం సంపాదించుకుంటున్నారు. అయితే అదృష్టం తలుపు తట్టినట్టు తనకు ప్రభుత్వ ఉద్యోగం వచ్చేసింది. ఒక సంవత్సరం తర్వాత ఆ ఉద్యోగం పర్మినెంట్ అవుతుంది. ఆ ఉద్యోగం సొంత ఊరులో రావడం ఇంకా ఆనందం కలిగించింది వివేక్‌కు.

అందుకే తను అమెరికా వెళ్లనని కరాఖండిగా చెప్పేసాడు. వివేక్‌ను అమెరికా పంపిన తర్వాత కంప్యూటర్ సైన్స్‌లో ఇంజినీరింగ్ చేస్తున్న చెల్లెలను కూడా అమెరికా పంపేద్దామని వాళ్ల ఉద్దేశ్యం. అక్కడ తమ బంధువులున్నారు. తనకు, చెల్లెకి అమెరికా సంబంధం చేద్దామని వాళ్ల కల. ఇలా చెల్లెలి సెంటిమెంట్ చూపించేసరికి వివేక్ కాస్త మెత్తబడ్డాడు. అయితే



కొంత కాలం ఉద్యోగం చేస్తాననీ, ఒకటి రెండేళ్లు ఉద్యోగం చేసిన తర్వాత అమెరికా వెళ్తాననీ, ఈలోపు చెల్లెలి ఇంజినీరింగ్ చదువు కూడా పూర్తవుతుందనీ అన్నావదినలను ఒప్పించాడు.

వాస్తవానికి వివేక్‌కు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఉద్యోగం చేయడం ఇష్టం లేదు. తను చదివింది అగ్రికల్చరల్ బిఎస్సీ. దానికి సంబంధించిన ఫీల్డ్‌లోనే స్థిరపడాలని నిశ్చయించుకున్నాడు. కానీ అన్నావదినల ఒత్తిడికి తలొగ్గి సరే అన్నాడు. వాళ్లు కూడా రెండేళ్ల తర్వాత అమెరికా వెళ్తాడనీ, ఉద్యోగం చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

ఆలోచనల నుండి బైటికి వచ్చిన వివేక్, ''ఇక బయలుదేరతాను. కారు వచ్చేసింది'' అంటూ తన బ్యాగుతో బైటికి వచ్చాడు.

"మంచిది. వెళ్లి రా!" అంటూ అన్నావదినలు కారెక్కిన వివేక్‌ను సాగనంపారు.

★ ★ ★

నాలుగు గంటల ప్రయాణం తర్వాత తూర్పు గోదావరి జిల్లాలోని ఆ ఊరుకు చేరుకున్నాడు. ఊరి పొలిమేరల్లో కారు ప్రవేశించగానే వివేక్ మనస్సు ఉప్పొంగింది. ఊహ తెలిసిన తర్వాత తనను అమ్మ ఎత్తుకోవడం గుర్తుంది. పంటచేలో నాన్న నాగలితో దున్నుతున్న దృశ్యం తనకు మంచి జ్ఞాపకం. ఆకుపచ్చగా శోభిస్తూన్న పంటపొలాలు. రోడ్డుకిరువైపులా తాటిచెట్లు, కొబ్బరిచెట్లు. రోడ్డుకు అటువైపున పిల్లకాలువ.

కారు అద్దం తీసి ఆ ప్రాంతపు గుబాళింపును ఆస్వాదిస్తూ వుండిపోయాడు. కారు తన ఆఫీసు చేరుకునేవరకు తన బాల్యపు జ్ఞాపకాల్లోనే ఉండిపోయాడు.

తన బ్యాగు తీసుకుని ఆఫీసులోనికి అడుగుపెట్టాడు. ఆఫీసులోని ఉద్యోగులంతా వివేక్‌కు నమస్కారం చేసారు. అంతకు ముందున్న వ్యవసాయాధికారి "రండి... రండి... వెల్‌కమ్!" అన్నాడు నవ్వుతూ. ఆయన వివేక్ కూర్చున్న తర్వాత చెప్పడం మొదలుపెట్టాడు.

"రెండు రోజుల క్రితమే ఒక మెయిల్ వచ్చింది. దాని ప్రకారం ఈ ఊళ్లో ఆత్మహత్య చేసుకున్న ఒక రైతు కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలి. వ్యవసాయాధికారి, తహశీల్దారు, పోలీస్ సబ్ ఇన్స్‌పెక్టర్.. ఈ ముగ్గురూ కలసి ఆత్మహత్య చేసుకున్న రైతు ఇంటి కుటుంబాన్ని దర్శించి, అతడే ఆత్మహత్య చేసుకున్నాడని ధృవీకరించి, రిపోర్టు జిల్లా కలెక్టర్ గారికి అందజేస్తే ఆ క్షతగాత్రుడి వారసుడి ఖాతాలో ఏడు లక్షలు నష్టపరిహారం జమ అయిపోతుంది. నేను ఈరోజు రిలీవ్ అయిపోతున్నాను గనుక మీరు వెంటనే ఈ పని టేకప్ చేయండి!" అన్నాడు.

"అలాగే సార్!" అన్నాడు వివేక్.

"మీరు వస్తారని ఇన్స్‌పెక్టర్ గారికీ, మండల రెవెన్యూ అధికారి గారికి చెప్పాను. వారిని తీసుకుని ఆత్మహత్య చేసుకున్న రైతు ఇంటికి వెళ్లి ఎంక్వయిరీ చేసి రండి. మీరు వచ్చిన తర్వాత నేను మీకు ఛార్జి అప్పగిస్తాను!" అన్నాడు.

"అలాగే సార్" అన్నాడు వివేక్. ఆ తర్వాత ఆయన తెప్పించిన కాఫీ త్రాగి బైటికి వచ్చి కారు ఎక్కాడు. మార్గమధ్యంలో ఇన్స్‌పెక్టర్ గారినీ, ఎమ్ఆర్ఓ గారినీ తన కారులో ఎక్కించుకుని ఆ ఊళ్లోని చనిపోయిన రైతు ఇంటికి బయలుదేరాడు. రైతు ఇంటికి వెళ్లే రోడ్డు సరిగ్గా లేదు. రోడ్డంతా గతుకులు, గుంతలు. కారు వెళ్తున్న బాట ప్రక్కన పచ్చగా పెరిగిన

పంటభూములు. మధ్యాహ్నం పన్నెండు దాటినా వాతావరణం చల్లగా ఉంది. కారు ఆ రైతు ఇంటి వైపు దూసుకు వెళ్తూంటే వివేక్‌కు ఆ ప్రాంతం చిరపరిచితంగా అనిపించింది. చనిపోయిన వ్యక్తికి సంబంధించిన కాగితాలు చదివిన తర్వాత 'అయ్యో!' అనుకున్నాడు వివేక్. ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి పేరు వెంకన్న. అతని తండ్రి సూరన్న.

తమ తండ్రిగారు చనిపోయిన తర్వాత తమ పొలాన్ని కౌలుకు తీసుకుని పండించేవాడు సూరన్న. న్యాయబద్ధంగా తమకు రావలసిన ధాన్యాన్ని అప్పగించేవాడు. తన బాల్యంలో వెంకన్నతో కలిసి తిరిగిన జ్ఞాపకాలు. తనకంటే పదేళ్లు పెద్ద. తను పొలానికి రాగానే చెట్టెక్కి కొబ్బరిబొండాలు తీయించేవాడు. అలాగే చెరకుగడలు, తేగలు, తాటిముంజెలు... అవన్నీ గోనెసంచీలో కట్టి తమ ఇంటికి తీసుకొచ్చేవాడు. తమ పశువులను కూడా వెంకన్న మేతకు తీసుకెళ్లేవాడు. తను చిన్నప్పుడు కాలువలో దిగి ఈత కొడితే వెంకన్న దగ్గరే వుండి, తనకు ఏ ప్రమాదమూ జరగకుండా కాపాడేవాడు. అలాంటి వెంకన్న ఆత్మహత్య చేసుకున్నాడంటే మనసులో బాధ ఎక్కువైంది.

నాన్న చనిపోయిన తర్వాత అన్నావదినలు ఆ ఊరు వదలిపెట్టేసారు. వెంకన్న సంగతి అసలు తెలియదు. తన జ్ఞాపకాల ఆల్బమ్‌లో వెంకన్న ఫోటో మిస్సయ్యింది. వెంకన్న చనిపోయిన తర్వాత అతని ఇంటికి వెళ్లడం బాధాకరమే! అలా అలోచనలోనే వెల్లవేయని గోడలతో వున్న ఆ చిన్న డాబా ఇంటికి చేరుకుంది కారు.

ఆ ఇల్లు నూట యాభై గజాల స్థలంలో ఉంది. ఆ ఇంటి ముందు చిన్న పెరడు. అక్కడే పశువుల కొట్టం. గేదెను కట్టేసి ఉంచారు. అక్కడే వున్న కుడితి తొట్టెలో పశువులకు మేత కలుపుతూ వున్న అరవై యేళ్ల మహిళ. తమ ఇంటికి వస్తూన్న అధికారులను చూసి గబగబా లోపలికి వెళ్లి నులకమంచం తీసుకొచ్చి బైట వేసింది. దాని మీద బొంత పరిచింది. అంతా ఆ మంచం మీద కూర్చున్నారు. ఆ ముసలావిడ జుత్తు నెరసిపోయి ఉంది. మనిషి పూర్తిగా ఎండిపోయి కనిపించింది.

అందరికీ చేతులు జోడించి, "ఒక్కడే కొడుకండీ బాబూ...!" అంటూ ఏడుపు మొదలుపెట్టింది.

"ఏడవకమ్మా... ఏడవకు..." అంటూ ఆమె చేయి పట్టుకున్నాడు వివేక్.

"బాణంకర్రలాంటి మనిషి బాబూ. మా ఆయనా అట్లా ఉండేవాడు. సొంతంగా సెంటు భూమి లేకపోయినా కౌలుకు తీసుకుని వ్యవసాయం మొదలుపెట్టాడు. కూలికి వెళ్లే బదులు వ్యవసాయం చేసుకుంటే నాలుగు డబ్బులు మిగులుతాయి కదా అని ఆశ. అంతే బాబూ. ఈ ఊళ్లో కాలువ ప్రక్క భూమి. చౌడుభూమే! ఎకరానికి పదిహేను బస్తాలు కౌలుకు ఒప్పందం చేసుకున్నాడు. ఆ పదిహేను బస్తాలు రెండు పంటలకివ్వాలి. పురుగుమందులు, ఎరువులకు దుకాణంలో బకాయి పడ్డాడు. అలాగే కూలీలకు ఇవ్వడానికి షావుకారు దగ్గర డబ్బు వడ్డీకి తెచ్చాడు. పంట చేతికొచ్చేసరికి వర్షాలు ముంచేసాయి. ముందు సంవత్సరం కూడా అదే జరిగింది. చివరికి అప్పే మిగిలింది. అంతే! దారీతెన్నూ లేదు బాబూ. పురుగుల మందు త్రాగి పొలంలో చనిపోయాడు!" చెప్పడం ఆపి, ఏడుస్తూ వుండిపోయింది.

అంతలో అక్కడికి లాల్చీ, పైజామా వేసుకున్న ఒక పెద్దాయన వచ్చాడు. అతను అందరికీ నమస్కారం చేసి, ఏ ఉపోద్ఘాతం లేకుండానే చెప్పడం మొదలుపెట్టాడు. "నేను మానవ హక్కుల వేదిక నుంచి వచ్చాను. మన దేశంలో రైతు అప్పుల్లో పుడుతున్నాడు. అప్పుల్లో జీవిస్తున్నాడు. అప్పులే వారసులకు మిగుల్చుతున్నాడు. మన వ్యవసాయం ఋతుపవనాలు మీద ఆధారపడి పని చేస్తుంది. తగిన సమయంలో వర్షాలు రావాలి కదా! ఈ కౌలు రైతుల కమతాలు చిన్నవే! అందువల్ల

ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేయలేరు. వీళ్లకి న్యాయం చేయాలి సార్!" అన్నాడు.

"అదే పని మీద వచ్చాము" అన్నాడు ఇన్స్‌పెక్టర్.

"ఇంతకీ మీ కోడలు ఏది?" అన్నాడు వివేక్, ఆ పెద్దావిడతో.

"కూలికి వెళ్లింది బాబూ... వచ్చే టైమ్ అయ్యింది" అంది.

"సరే.." అంటూ వివేక్, ఆ ఇంట్లోకి తొంగి చూసాడు. ఇద్దరు ఆడపిల్లలు కనిపించారు. తైలసంస్కారం లేని జుట్టు. చినిగిన గౌన్లు. ఒకరికి ఎనిమిదేళ్లు, ఇంకొక అమ్మాయికి పదేళ్లు ఉంటాయేమో! 'నాన్నమ్మా' అంటూ లోపలి నుంచి గట్టిగా పిలిచింది ఒక అమ్మాయి. ఆ పెద్దావిడ లోపలికెళ్లింది. వివేక్ దృష్టి అంతా ఈ ఇంటి లోపలి పరిసరాల వైపు ప్రసరించింది. వంటగది, ఆ ప్రక్కనే పడుకోవడానికి మరో చిన్న గది. వంటగదిలోని అలమరాలో వరుసగా పేర్చిన డబ్బాలు. పడకగదిలో ఒక పట్టెమంచం. దాని ప్రక్కనే ఒక పోర్టబుల్ టీవీ. 'పాపం... ఉన్నంతలో తన కుటుంబ అవసరాలు చూద్దాం అనుకున్నాడు. అంతలోనే రాలిపోయాడు' అనుకున్నాడు వివేక్.

ఆ పెద్దావిడ పొయ్యి మీద ఉన్న అన్నం పాత్రలోంచి ప్లేటులో వేసి, ఆ ప్రక్కనే ఉన్న గిన్నెలో మజ్జిగ పోసింది. జాడీలోంచి ఆవకాయ తీసి ఆ ఇద్దరి పిల్లల ప్లేట్లలో వడ్డించింది. 'ఇంతేనా వీరి ఆహారం... ఎదుగుతున్న ఈ ఆడపిల్లలకు? అందుకే అలా వున్నారు. ఎండిపోయిన డొక్కలతో నీరసంగా కనిపిస్తున్నారు' అనుకున్నాడు. అప్పుడే వస్తూ కనిపించింది, ముప్పై ఐదేళ్ల స్త్రీ. ఆమె వెంకన్న భార్య అనుకున్నాడు. చేతిలో ఒక కుండ. దాన్ని పదిలంగా పట్టుకొంది. ఆ కుండకు పసుపు రాసి ఉంది. ఆ కుండలో ఏమి వుందో అనుకున్నాడు.

ఆమె అత్తగారికి డిటోలా ఉంది. ఎండిపోయిన మొక్కలా కనిపించింది. పొలం నుంచి రావడం వలన అలసిపోయిన మొహం. చెమటతో తడిసిన శరీరం. తను తెచ్చిన కుండను జాగ్రత్తగా తీసుకెళ్లి ఇంట్లో ఫోటో ముందు పెట్టడం గమనించాడు వివేక్. తర్వాత బైటికి వచ్చిన ఆమె పశువుల కొట్టం ప్రక్కనున్న కుండీలోంచి నీళ్లు తీసుకుని చేతులు కడుక్కుంటూ "నమస్కారం సార్!" అంది. ఆ తర్వాత వారి ఎదురుగా నిల్చొని చెప్పడం మొదలుపెట్టింది.

"అప్పులు ఎక్కువైపోయాయండీ. ఆ షావుకారు రోజూ మనుష్యులను పంపించేవాడు. ఒక్కోసారి షావుకారి మనుష్యులు వచ్చేటప్పుడు వాళ్లకు కనబడకుండా దాక్కునేవాడు. ఇలా చాలా రోజులు జరిగాయి. ఒకరోజు పంచాయితీలో అందరి ముందు గట్టిగా తిట్టి, కొట్టినంత పని చేసాడు. ఇంకా ఎరువుల షాపు అతను కూడా వచ్చి దెబ్బలాడాడు. ఇక దాక్కోవలసిన పని లేకుండా కనబడకుండా పోయాడు" అంటూ ఆమె చెప్పడం ఆపింది. ఆమె కళ్ల నుంచి నీళ్లు రావడం లేదు. బహుశా ఏడ్చి ఏడ్చి నీరు ఇంకిపోయి వుంటుంది. కుటుంబ భారం ఆమె మీద పడింది.

భర్తను బెదిరించినట్టే ఈమెనూ బెదిరిస్తారు. 'అయ్యో...' అనుకున్నాడు. ఆ తర్వాత ఆమె తీసుకొచ్చిన డాక్యుమెంట్లను చూసారు, వివేక్, అతనితో పాటు వచ్చిన అధికారులు, అంతకు ముందు వారితో మాట్లాడిన మానవహక్కుల కార్యకర్త, "జాతీయ నేర రికార్డుల ప్రకారం, గత ఇరవై ఐదు సంవత్సరాల్లో మన దేశంలో మూడు లక్షలకు పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. లెక్కకడితే సగటున ప్రతి నలభై ఒక్క నిమిషానికీ ఒక రైతు ఆత్మహత్య చేసుకుంటున్నాడు!" అన్నాడు.

అతను చెప్తుంటే వివేక్ "దీనికి పరిష్కారం లేదా సార్?" అన్నాడు.

"ఎందుకు లేదండీ. రైతుల పంటల ఉత్పత్తికి మద్దతు ధర ప్రకటించాలి. కొంతవరకు ఋణం మాఫీ చేయాలి. మనం రోజూ తినే తిండీ, ప్రతీ మెతుకూ ఎవరో రైతు మన కోసం కష్టపడితే వచ్చిందే. అలాంటి అన్నదాతలను 'సుఖీభవ' అని మనం దీవించే రోజు కోసం ఎదురుచూడాలి!" అన్నాడు.

"ఒక ఆత్మహత్య తర్వాత వెంకన్న బతుకు ముగిసింది. కానీ వీరి బాధలు ముగియలేదు!" అన్నాడు వివేక్, ఆ కార్యకర్త వైపు చూస్తూ.

"ఒక ఆత్మహత్య అంటారా? ఇది ఆత్మహత్య కాదు. ఒక సామాజిక హత్యే! ప్రకృతి కూడా రైతు మీద పగ పట్టింది. రైతు బిక్కుబిక్కు మంటూ చినుకు జాడ కోసం ఎదురుచూస్తూ వుంటాడు. ఒకవైపు కమ్ముకుంటున్న కరవు కూడా. దెబ్బతిన్న పంటల పరిహారానికి లెక్క తేలదు. వర్షం లేక ఇంకిపోయిన భూగర్భ జలాలు. దాంతో ఆవిరై ఇంకిపోయిన ఆశలు. గరళాన్ని గొంతులో దాచుకున్న ఈశ్వరుడైపోయాడు రైతు. గిట్టుబాటు ధరలు లేవు. అమ్ముకునే వైనం కానరాదు. ఋణపరపతి అందని ద్రాక్ష అయ్యింది. ఆ క్రమంలో కొందరు చిన్నకారు రైతులు వేరే ఊరికి వలస పోతున్నారు. కొంతమంది రైతులు అరవలేని గొంతుకు ఉరి బిగిస్తున్నారు. మన కంచంలో మెతుకవుతున్నా, మన ఇంటి కట్టడంలో ఇటుక అవుతున్నా, మనం నిర్మించిన నగరంలో సమిధ అవుతున్నా చివరికి ఎక్కడా కానరాక నిర్మానుష్యమౌతున్నాడు. రైతే దేశానికి వెన్నెముక అన్నారు. చివరికి రైతుకు అదే మిగిలింది. ఇక్కడ ఒక ముఖ్య విషయం!" చెప్పడం ఆపి, వివేక్ వంక, ఆ అధికారుల వంక చూసి మళ్లీ మొదలుపెట్టాడు ఆ కార్యకర్త.

"ఈ ఊళ్లో చాలామంది పెద్ద రైతులు తమ పొలాలను కౌలుకు ఇచ్చి పట్నానికి వలస పోయారు. కౌలు రైతుల కష్టంతో వారు పెరిగి పెద్దవారయ్యారు. వారి పిల్లలను అమెరికాకు వలస పంపుతున్నారు. అలా ఎన్నో కుటుంబాలకు నిచ్చెనగా నిలబడ్డ ఆ కౌలు రైతులు అప్పులు, అతివృష్టి, అనావృష్టి లాంటి విషనాగుకోరల్లో చిక్కుకుపోయి ఆత్మహత్యల పాలవుతున్నారు."

ఆ కార్యకర్త అన్న చివరి మాటలతో వివేక్ తల వంచుకున్నాడు. 'నిజమే! వెంకన్న, అతని తండ్రి సూరన్న వారి కష్టంతో, స్వేదంతో తన కుటుంబం ఒడ్డున పడింది. తను ఉద్యోగస్తుడయ్యాడు. చెల్లి చదువుకుంటోంది. అన్నయ్య కూడా ఉద్యోగస్తుడై ఒక ఇంటివాడయ్యాడు. మరి వెంకన్న కుటుంబం ఏమయ్యింది?' వివేక్ మనసులో బాధ సుడులుగా తిరిగింది.

ఆ కార్యకర్త మెల్లగా వివేక్ చెవిలో చెప్పాడు.. "మీరు తొందరగా వీరికి వచ్చే నష్టపరిహారాన్ని అందజేయండి. వీరికి ఇంకో పని తగిలింది. వెంకన్న తన తల్లిని కాశీకి తీసుకెళ్తానని మాట ఇచ్చాడు. తల్లి మాట తీర్చకుండానే వెళ్లిపోయాడు. ఇప్పుడు ఈ ముసలావిడ, కొడుకు అస్తికలతో కాశీకి పోదామని చూస్తోంది. అందుకు డబ్బు కావాలి కదా!" అన్నాడు.

అప్పటికి వివేక్‌కు అర్థమైంది. వెంకన్న భార్య తీసుకువచ్చిన ఆ కుండలో ఏమి ఉన్నాయో! వివేక్ ఒళ్లు జలదరించింది. ఆమె జాగ్రత్తగా, పదిలంగా తన భర్త అస్తికలు ఉన్న పాత్రను ఆ చిన్న ఇంట్లో దేవుడి ఫోటో ముందు పెట్టడం తను చూసాడు. వివేక్ కడుపులో పేగు కదిలినట్టయ్యింది.

"ఇక పనైపోయింది, వెళ్దాం!" అంటూ తహశీల్దారు, సబ్ ఇన్స్‌పెక్టర్ అక్కడి నుంచి లేవడంతో వివేక్ వాళ్లను అనుసరించాడు. వాళ్ల జీపు వెళ్తుంటే ఆ పెద్దావిడ, ఆమె కోడలు, ఆ ఇద్దరు ఆడపిల్లలు వారి వంక చూస్తూ, చేతులు జోడించి నిలబడ్డారు.

ఆఫీసుకు వెళ్లిన తర్వాత వెంకన్న కుటుంబానికి రావలసిన నష్టపరిహారం కోసం రిపోర్టు తయారుచేసి ఇన్‌స్పెక్టర్‌తో,

తహశీల్దారుతో సంతకాలు పెట్టించాడు. తను రిలీవ్ చేసిన వ్యవసాయాధికారి "డ్యూటీలో చేరిన రోజే ఒక మంచి పని చేసారు" అన్నాడు వివేక్‌తో.

★ ★ ★

ఆరోజు ఆదివారం. ఆ మధ్యాహ్నం పూట భోంచేయడానికి అన్నయ్యతో డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నాడు. వదిన ఇద్దరికీ పులిహోరా, గారెలు వడ్డించింది. రెండు కప్పుల్లో వేడి పాయసం తీసుకొచ్చి పెట్టింది.

"ఏమిటి ఇవన్నీ చేశావు?" అన్నాడు వివేక్, వదినతో.

"నీకు ఉద్యోగం వచ్చిందని మన ప్రక్కింటివారు పార్టీ అడుగుతూంటే ఇవి చేసి, వారికి పంపింది!" అన్నాడు అన్నయ్య.

ప్లేటులో వదిన వడ్డించిన ఆ పదార్థాల కేసి చూస్తూ ఉండిపోయాడు. అవి తనకిష్టమైనవే. ఎంతో ఆకలిగా ఆ డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్న వివేక్‌కి ఆ ప్లేటులో పదార్థాలు రుచిగా అనిపించలేదు. ఆత్మహత్య చేసుకున్న ఆ వెంకన్న కుటుంబంలోని ఆ వ్యక్తులే గుర్తుకొచ్చారు. ఎండిపోయిన డొక్కలతో వున్న ఆ చిన్నపిల్లలు మనసులో మెదిలారు. 'వారిది ఆత్మహత్య కాదు, సామూహిక హత్య. ఆ కౌలు రైతుల స్వేదంతో పెరిగినవారు వారిని వదిలి విదేశాలకు వలస పోతున్నారు' అంటున్న కార్యకర్త మాటలు పదేపదే గుర్తొచ్చాయి. సరిగ్గా తినలేక సగం తిని చేతులు కడుక్కున్నాడు.

"ఏమైంది?" అంటూ అన్నా, వదినా ఆశ్చర్యంగా చూసారు.

"నేను అమెరికా వెళ్లను అన్నయ్యా" అన్నాడు వివేక్.

"అప్పుడే కాదు, రెండు సంవత్సరాల తర్వాత కదా!" అన్నాడు అన్నయ్య.

ఆ మాటలకు "రెండు సంవత్సరాల తర్వాత కూడా వెళ్లను. నా ఉద్యోగం నేను చేసుకుంటాను. మన ఊళ్లోనే కదా!" అన్నాడు మెల్లగా వివేక్.

అన్నయ్యా, వదినా అతని వంక ఆశ్చర్యంగా చూస్తూ వుండిపోయారు. 'అమెరికా వెళ్లి డాలర్లు పండిస్తాడనుకున్నాం. సొంతూరులో వుండిపోయి ఇక పంటలు పండిస్తాడు కాబోలు!' వివేక్ అన్నా, వదినలు తమలో తాము గొణుక్కొన్నారు.

మౌనంగా తన గదిలోకి వచ్చి కూర్చున్నాడు వివేక్. అతనికిష్టమైన పాట మనసులో మెదిలింది.

'మా ఊరు ఒక్కసారి పోయి రావాలి

పంటచేల గట్ల మీద నడవాలి

ఊహకేమో రెక్కలొచ్చి ఎగరాలి

ఆటలతో బ్రతుకంతా గడపాలి

మా ఊరు ఒక్కసారి పోయి రావాలి.'

ఈ పాట తనే కాదు, తమలా నగరాలకు, విదేశాలకు వలస వెళ్లిపోతున్న వారంతా పాడుకోవాలి అనుకున్నాడు వివేక్.

# అష్టాక్షరి!



✆ 9441345651

## శ్రీమతి గొర్తి వాణి శ్రీనివాస్


**జన్మదిన సంచిక 2024 "పల్లెకు పోదాం" కథల పోటీలో**
**ప్రోత్సాహక బహుమతి పొందిన కథ**

***వాడు కళ్ళు విప్పి మమ్మల్ని చూస్తూ, ఆనంద భాష్పాలు రాలుస్తున్నాడు. మా కళ్ళూ చెమర్చాయి.***
***"ఆక్సిజన్ తీసేయండిరా" అన్నాడు సారథి***
***"అమ్మో వద్దు" అన్నాన్నేను.***
***"ఏం కాదు. మన ఊరి పైరగాలి, స్వచ్ఛమైన వాతావరణాన్ని మించినది ఏముంది. వాడికి ఏం కాదు నాది హామీ!" అన్నాడు సారథి.***
***మావాడు మాలో ఒకడిగా హాయిగా పల్లె గాలి పీల్చుకుని తిరిగి ప్రాణం పోసుకున్నాడు.***

"మళ్ళీ అష్టాక్షరి దగ్గరకేనా ప్రయాణం?" అంది మా ఆవిడ.

"ఆహా, అక్కడికే. మా పాలిట మహా ప్రాణమంత్రం. రాక్షసుడి ప్రాణాలు చెట్టు తొర్రలోనో, చిలక రెక్కల్లోనో వుండొచ్చు. మావిమాత్రం అష్టాక్షరిలో వున్నాయి. మనకి కావలసిన బట్టలు సర్దు." అన్నాను. హుషారుగా ఇల్లంతా తిరుగుతూ. డెబ్బై ఏళ్ళ వయసులోనూ చిన్న పిల్లాడిలా ఉన్నానంటే ఆ మహిమేమిటో నా శ్రీమతికే తెలుసు. మారు మాట్లాడకుండా మా ఇద్దరి బ్యాగులు సిద్ధం చేసింది.

ఈనాటి ఆనందానికి కారణమైన ఒక సంఘటన నాకింకా గుర్తుంది.

రాఘవులు పిలిచినా పలకట్లేదు. అపస్మారక స్థితిలో వున్నాడని మా స్నేహితుల వాట్సప్ గ్రూప్‌లో మెసేజ్ వచ్చింది. అది చూశాక నా కాళ్ళూ చేతులూ ఆడలేదు.

'ఎందుకు, ఎలా జరిగింది' అనే ప్రశ్నలు వేసాను.

వాడు రాత్రి భోంచేసి టివి చూశాడు. ఎండ వేడికి పగలంతా నిద్ర పట్టలేదుట. ఏ.సీ. వేస్తే పడదుగా. కూలర్ దగ్గరే కాలక్షేపం చేశాడు. బాగా పొద్దుపోయిన తర్వాత వాతావరణం చల్లబడి అప్పుడు నిద్రలోకి జారుకున్నాట్ట. కొంతసేపటికి ఊపిరి అందక, ఆయాస పడుతుంటే హాస్పిటల్లో చేర్చారు. వయసు పెరిగి బీ.పీ. హెచ్చిందన్నారు డాక్టర్లు. ఆ సందేశాలు నాలో ఆవేదనని పెంచాయి.

ఆప్తమిత్రుల్లో ఒకడైన రాఘవులు అనారోగ్యం మా అందరిపై ప్రభావం చూపింది. ముఖ్యంగా నేను చాలా కుంగిపోయాను. వాడు ఏమైపోతాడో అనే దిగులు పడ్డాను.

మాది కృష్ణాజిల్లా భట్లపెనుమర్రు గ్రామం. అక్కడే పుట్టి పెరిగాం. ఎనిమిది మంది మిత్రులం! ఒకే బడిలో కలిసి చదువుకున్నాం. ఆ ఊరితో మా అనుబంధం చాలా విచిత్రమైనది. అమ్మానాన్నా పడుకోగానే ఒక ఈల వినపడేది. అది ఆటలకు పిలుపు. మిట్ట మధ్యాహ్నం. మండుటెండ మాకు మాత్రం పండు వెన్నెల! మామిడితోటలోకి మా పరుగు. జేబులో బ్లేడు తప్పనిసరి. చెట్టెక్కి చక్కటి పుల్లకాయలు కోసుకుని , బ్లేడుతో తొక్కు చెక్కుకుని కొరుక్కు తినేవాళ్ళం. ఆ పులుపుకి మా పళ్ళు రంపపు బ్లేడులల్లే పదును తేలేవి. ఉప్పు కారాలు అదనంగా దట్టించి తింటే అమోఘం.



నేరేడు పళ్ళ సీజన్లో మా జేబులకు వున్న కర్రులు వదిలించడానికి మా అమ్మ అవస్థ పడేది పాపం. అప్పట్లో క్యారీబ్యాగులు... మా లాగు జేబులే!

చెరువులో ఈతలు కొడుతుంటే అటుగా వస్తున్న నాన్నని చూసి చెరువు మధ్యలో మునిగి, నీటి అడుగునున్న కలువ దుంపలపై కాళ్లు ఆనించి, కలువపూల కాడలు అడ్డుపెట్టుకొని చూస్తూ, నాన్న వెళ్ళాక బయటకు వచ్చిన ఆ పండంటి రోజులు మర్చిపోలేం!

క్రమంగా ఉద్యోగ వ్యాపారాల నిమిత్తం వేరే చోట్లకు వెళ్లిపోయాం. చాలా కాలంపాటు ప్రత్యక్ష సంబంధాలు నెరపలేకపోయినా, మనసుల్లో మాత్రం ఒకరంటే ఒకరికి అమితమైన ఇష్టం. ఆధునిక టెక్నాలజీ మమ్మల్ని కలిపింది. కలిసి

ఆడుకున్న ఆటలు, ఆ ఊరి తోటల్లో గడిపిన క్షణాలను వాట్సప్ సాక్షిగా గుర్తు చేసుకున్నాం. పాత జ్ఞాపకాల నీడల్లో గుబులు తీర్చుకున్నాం.

రాఘవులు ఆరోగ్యం గురించి గ్రూప్ సందేశాలు వస్తుంటే ఏ క్షణాన ఏం వినాల్సి వస్తుందో అని బాధ పడుతూ కూర్చున్నాను. నిస్సత్తువ నన్నావహించి చాలా సేపయింది. మిట్ట మధ్యాహ్నం అయింది.

"ఎంతసేపూ ఆ ఫోనేనా... భోజనానికీ వచ్చేదుందా లేదా? నేనూ షుగరు మనిషినే, మీకు పెట్టి నేను తిని పడుకుందామని చూస్తుంటే రారేం?" అని మొదటి రాగానికి శ్రుతి పెట్టె తెరిచింది మా ఆవిడ.

"నాకాకలిగా లేదు. నువ్వు తిని పడుకో. నేను తర్వాత తింటాను" అని, ఫోన్ పక్కన పెట్టేసి కళ్ళు మూసుకున్నా.

"ఇది మరీ బాగుంది. ఆ ముక్క ముందే చెబితే నేను ముందే తినేసేదాన్ని! అయినా మీ ఆరోగ్యం మాత్రం ఏం బాగుందనీ. నాతోపాటే ఒక ముద్ద తిని మీరూ కాసేపు పడుకోండి. రండి వడ్డిస్తున్నాను!" అంది.

"నాకొద్దు" అన్నాను.

"రోజూ త్వరగా అన్నం పెట్టమంటూ తొందర చేసేవారు, వంట అయిందా అంటూ నా కాళ్ళకింద నిప్పులు పోసేవారు. ఇవాళ ఎందుకు ఆకలిగా లేదు. అలిగారా? ఏవిటి మీ బాధ? నాతో చెప్పండి!" అనడిగింది.

నా భార్య అలా అడిగేసరికి, నాకు కన్నీళ్ళు ఆగాయి కాదు.

"అయ్యొయ్యో, రోజురోజుకీ చిన్నపిల్లాడిలా మారిపోతున్నారు. ఇప్పుడేవైందనీ?" అంటూ, తన చీర కొంగుతో నా కళ్ళు అద్దింది.

"మొదటి వికెట్ పడబోతోంది. మా వాడికి ఆరోగ్యం బాగాలేదు. నాకేదో భయంగా వుంది. ఇక ఒక్కొక్కళ్ళకీ ఆ పరిస్థితి వస్తుంది. పిల్లలు ఫారిన్‌లో వున్నారు. ఏదన్నా అయితే దిక్కెవరు?" బాధగా అన్నాను.

"ఇప్పుడు మీ బాధంతా మన పిల్లలు దూరంగా వున్నారనా, మీ స్నేహితుడి ఆరోగ్యం బాలేదనా?"

"రెండూనూ, ఒకదాని వల్ల ఒకటి. అనారోగ్యంగా వున్న మా స్నేహితుల్లో ఎవరికీ అండగా ఉండేందుకు వాళ్ళ పిల్లలు దగ్గర లేరు. ఇప్పుడు రాఘవులు మంచాన పడ్డాడు. నా పరిస్థితి ఏవిటో అని నాకు భయంగా వుంది!" అన్నాను.

"పిల్లలు బాగా చదివి ఫారిన్ వెళ్లాలని మీరే కోరుకుంటారు. వాళ్ళు ఫారిన్ వదిలి రాలేదని మీరే బాధపడతారు. మీరు ఆ ఫోన్ అసలు చూడకండి. మీ స్నేహితుడికి ఏం కాదులెండి." అని ధైర్యం చెప్పింది.

"ఏ పాటు తప్పినా సాపాటు తప్పదుగా! ముందు భోజనానికి నడవండి. ఆలోచించేందుకు ఓపిక కావాలి కదా" అని బలవంతంగా తీసికెళ్ళి. భోజనం పెట్టింది.

ఆరోజు ఎలాగో గడిచింది! నా దిగులు ఎక్కువైపోయింది. నీరసించి పోతుంటే నేనేమైపోతానో అని ఆవిడ దిగులు పడింది.

ఓరోజు నా మిత్రుడు నరసింహం ఓ మెసేజ్ పెట్టాడు.

"మన గ్రూప్‌కి కళ తెచ్చేందుకు ఒక కొత్త మెంబర్ వచ్చాడు. ఎవరో గుర్తు పట్టండి చూద్దాం. చెప్పిన వాళ్ళకి ఐదొందలు ఫోన్‌పే చేస్తాను" అని ఉడికిస్తూ ఊరిస్తూ.

"వాడా? వీడా..?" అంటూ అందరం కొన్ని పేర్లు చెప్పాం. కాదన్నాడు.

"హింట్ ప్లీజ్" అన్నాం.

"మనవాడే, క్రిష్ణ ప్రియుడు" అన్నాడు.

"దీపం గాడు" అన్నాన్నేను.

"కరెక్ట్" అన్నాడు వాడు.

దీపం గాడి పేరు చెప్పగానే మా అందరి పెదవులపై నవ్వులు విరిసాయి. అందరం ఉత్సాహంగా ఎమోజీలు పెట్టాం. ఎలాగైతేనేం మా ఎనిమిది మంది కలుసుకోడం మాకు చాలా సంతోషంగా వుంది. అందరం గతాన్ని నెమరువేసుకున్నాం.

మా ఊళ్ళో రెండతస్తుల ప్లీడరు గారిల్లు. దాని ఎదురుగా బస్టాండు. గాంధీ బొమ్మ. వెనకాల పెద్ద అరుగుల ఇల్లు. ఆ అరుగులపై కూర్చునే కుర్రవాళ్ళం మేమంతా. ఆ అరుగుల ఇంట్లో ఒకమ్మాయి వుండేది. దంతపుబొమ్మ అనాలో, పాలరాతి శిల్పం అనాలో... ఆ అమ్మాయి బయటకు రాగానే మా కుర్రాళ్ళం అందరం పారిపోయినా ఒక్కడు మాత్రం అక్కడే వుండేవాడు. వాడే వీడు. దీపధారి! వాడి అసలు పేరు సారథి.

అరుగుల మీద కూర్చుని చీకట్లో కూడా దీపం పెట్టుకుని చదివేవాడు. అదే దీపం పట్టుకుని ఆ అమ్మాయి ఇంటి చుట్టూ తిరిగేవాడు. అందుకే వాణ్ణి దీపంగాడని పిలిచేవాళ్ళం. ఆ అమ్మాయికీ వాడికీ మధ్య ఏం నడుస్తోందో చూడాలనుకునేవాళ్ళం. వాళ్ళ మధ్య నుంచి ఆవులూ గేదెలూ నడిచి వెళ్ళేవి తప్ప మేం కనిపెట్టలేకపోయాం. తర్వాత తెలిసింది... వాడు ఆ అమ్మాయిని పెళ్ళిచేసుకున్నాడని!

వాడు చేరాక మా గ్రూప్‌కి కొత్త ఊపు వచ్చింది. వీడియో కాల్స్ పర్వం మొదలైంది. ఎప్పుడూ సరదాగా వుంటాడు. పల్లెటూరిలో టెన్షన్ లేకుండా గడపడం వల్ల కావచ్చు, వాడి మొహం మీద ఇంకా ముడతలు రాలేదు. రిటైర్ అయ్యాక ఆ వూళ్ళో సెటిలయ్యాడు. అందర్నీ అక్కడికి రమ్మన్నాడు. ఇన్నాళ్ళూ వెళ్లాలని వున్నాగానీ, అక్కడ వుండేందుకు మాకెవరికీ ఇళ్లులేవు. ఎక్కడ వుండాలనే మీమాంస వుండేది. వాడున్నాడు కాబట్టి ఇబ్బందిలేదు. మాఊరికి వెళ్లేందుకు సరదాపడ్డాం. ఆ అమ్మాయిని చూడాలని కూడా మా అందరి లోపల చిన్న ఆశ!

వివిధ సిటీల్లో వున్న మేము భట్లపెనుమర్రు గ్రామం వెళ్లేందుకు నిర్ణయించుకున్నాం.

"మరి రాఘవులు? వాడ్ని వదిలేసి మేమెలా వస్తాం" అన్నాను

"వాడ్ని కూడా తీసుకురండి" అన్నాడు సారథి.

"ఎలా తీసుకొస్తాం?"

"అంబులెన్స్ లో"

"కష్టమేమో?" అన్నాను.

“ఏం కష్టం లేదురా. మీ విజయవాడ నుంచి రెండు గంటల్లో వచ్చేస్తారు. ఏం ఫరాలేదు. తీసుకురండి వాడ్ని. వాడూ మన ఊరు చూస్తాడు!” అన్నాడు.

“దారిలోనో హరీ అంటే?”

“ఏవీ అనడు. వచ్చేది ఎక్కడికీ! వాడు తొలి ఊపిరి పీల్చిన గడ్డకి. ఏం కాదు తీసుకురండి” అన్నాడు .

వాడంతే ఏదీ నాన్చకుండా గబుక్కున తెగ్గొట్టేస్తాడు.

“రాఘవుల్ని నేను తీసుకొస్తాను మీరంతా రెడీగా వుండండి” అన్నాడు నరసింహం.

రాఘవుల్ని తీసుకుని నరసింహం ఎకాఎకీన భట్లపెనుమర్రు వచ్చేటట్టు మాట్లాడుకున్నాం.

మేం పుట్టి పెరిగిన గ్రామానికి వెళ్లే ప్లాన్ వేసుకున్న దగ్గర్నుంచి నా మనస్తత్వం మారిపోయింది. హఠాత్తుగా మా ఆవిడ్ని చూడగానే ‘వున్నట్టుండి ఎవరీ పెద్దావిడ?’ అనిపిస్తోంది. అంటే నా వయసు ఓ ముప్ఫై ఏళ్లు తగ్గినట్టుగా, ఆవిడ నాకన్నా చాలా పెద్దావిడలా అనిపిస్తోంది. వింత అనుభూతులేవో కలుగుతున్నాయి.

ఒకరకంగా కొత్త జన్మ ఎత్తినట్టుగా వుంది.

అందరం కలిసి వ్యాగనార్‌లో ఊరికి బయల్దేరాం. ముందు మేము, వెనకాల అంబులెన్స్‌లో రాఘవులు.

“వాడికి ఆక్సిజన్ పెట్టీ మరీ తీసుకురావడం అవసరమా?” అన్నాన్నేను.

“తీసెయ్యమంటావా చెప్పు?” అన్నాడు సారథి

అందరూ నవ్వులు. అంత క్లిష్టమైన విషయం అప్పుడు అంత తేలిగ్గా అనిపించింది.

భారమంతా మన ఆలోచనలోనే వుందనిపించింది. “మరణం వరకూ నలుగురు తోడుంటే చాలు. ఇంకేం అక్కర్లేదు!” అన్నాన్నేను.

ఇక నవ్వులు జోకులు. అల్లరి చేస్తూ మా వూరు చేరుకున్నాం.

ఊరిలోకి రాగానే ముందుగా కనబడే లైబ్రరీ అప్పట్లో శిథిలావస్థలో వుండేది. కానీ ఇప్పుడు బాగుపరచి, రంగులు వేసి చక్కగా వుంది.

ఒకప్పుడు బస్సు ఎక్కాలంటే ఎండా, వానలో నిలబడాల్సి వచ్చేది. ఇప్పుడు బస్సు షెల్టర్ కట్టించారు. పార్క్‌లో బెంచీలు వేసి, గ్రీనరీ పెంచి అందంగా ముస్తాబు చేసారు. మా వూరు ఎలా బాగుపడిందో అర్థం కాలేదు.

అందరం సంభ్రమంగా చూసాం!

సారథి ఇంట్లో విడిది. ఆ అమ్మాయిని చూడాలని మాలో ఆరాటం.

రాఘవుల్ని ఆక్సిజన్ సిలిండర్‌తో సహా తీసుకొచ్చి సారథి ఇంట్లో పడుకోబెట్టాం.

అప్పుడే ఆమె బయటకు వచ్చింది. తేరిపార చూశాం అందరం. అమ్మాయి అని ఫాంటసీతో పిలుచుకునే ఆమె, మా ముందుకొచ్చి నిలబడింది. నది అలలపై చంద్రకిరణాల మిలమిలలా అక్కడక్కడా నెరిసిన జుట్టు. వయసు పైబడినా, అందాన్ని మించిన హుందాతనంతో ప్రశాంత గోదారిలా వుంది. చేతులెత్తి మొక్కాలనిపించేలా పరిపూర్ణమైన స్త్రీమూర్తిలా కనబడింది.

"మన రాఘవులు కూడా లేచి, ఆ అమ్మాయిని చూస్తే బాగుండు" అన్నాడు నరసింహ.

"వాడికి బండ పడిందిగా" అన్నాను.

ఫక్కున నవ్వారు అందరూ.

"అదేంటి?" అంది ఆమె.

"ఆక్సిజన్ బండ!" అని చెప్పాడు మా వాడు.

ఆమె కూడా నవ్వింది.

అందరం అక్కడే భోజనం చేశాం .

"మీకొక సర్ప్రైజ్ చూపిస్తా రండి" అని సారథి మమ్మల్ని వెంటపెట్టుకుని తీసుకెళ్లాడు.

మా వెనక రాఘవుల్ని బండతో సహా వీల్ చైర్లో కూర్చోబెట్టి వూరు చూపించడానికి తీసుకెళ్లాం. వాడు కళ్ళు మూతలు వేసుకుని కూర్చున్నాడు పాపం.

మామిడితోట పక్క నుంచి వెళుతుంటే, మాలో చిన్ననాటి జ్ఞాపకాలు కదిలాయి.

"ఆ చెట్టు మీద నుంచే కదా మన సుందరయ్యగాడు జారి పుచ్చకాయ పడ్డట్టు పడ్డాడు. రాయి గుచ్చుకున్న మచ్చ, వాడి కాలు మీద ఇంకా వుంటుంది!" అన్నాడు నరసింహ.

"ఆ చెట్టు కాదురా....." అన్నాడు రాఘవులు.

"రాఘవులు మాట్లాడాడు" అంటూ అందరం సంబరంగా వాడి చుట్టూ చేరాం. వాడు చిన్నప్పట్నుంచీ అంతే. తప్పు మాట్లాడితే సరిదిద్దటం వాడికి అలవాటు.

వాడు కళ్ళు విప్పి మమ్మల్ని చూస్తూ, ఆనందబాష్పాలు రాలుస్తున్నాడు. మా కళ్ళూ చెమర్చాయి.

"ఆక్సిజన్ తీసేయండిరా" అన్నాడు సారథి

"అమ్మో వద్దు" అన్నాన్నేను.

"ఏం కాదు. మన ఊరి పైరగాలి, స్వచ్ఛమైన వాతావరణాన్ని మించినది ఏముంది. వాడికి ఏం కాదు నాది హామీ!" అన్నాడు సారథి.

మావాడు మాలో ఒకడిగా హాయిగా పల్లె గాలి పీల్చుకుని తిరిగి ప్రాణం పోసుకున్నాడు. అందరం సంతోషంగా చప్పట్లు కొట్టాం.

"అసలైన సర్ప్రైజ్ ఇంకా వుంది రండి" అని మమ్మల్ని ఒక ఇంటికి తీసుకెళ్లాడు సారథి.

అది ఒకప్పుడు సారథి తాతయ్యా వాళ్ళ పాతిల్లు. దాని స్థానంలో నాలుగు గదులున్న కొత్త ఇల్లు కట్టారు. అన్ని సదుపాయాలతో చాలా బాగుందది.

ఆ ఇంటికి 'అష్టాక్షరి' అని బోర్డు వుంది.

ఇంట్లోకి వెళ్ళాం. చాలా చల్లగా హాయిగా అనిపించింది. ఇల్లంతా పిల్లల్లా తిరిగి చూశాం. ఇంతకీ ఇది ఎవరిల్లు అనడిగితే 'మనదే' అని చెప్పాడు సారథి. తెల్లబోయి చూశాం.

"అర్థం కాలేదా? ఈ ఇంటిని కొని, ఇలా రెనోవేట్ చేసింది ఎవరో తెలుసా మన పిల్లలు. మన ఎనిమిది మంది పిల్లలు. అందుకే ఈ ఇంటికి అష్టాక్షరి అని పేరు పెట్టాను. ఫారిన్‌లో వున్న మన పిల్లలందరూ మాట్లాడుకుని, మన అరవై ఏళ్ల స్నేహానికి గుర్తుగా బహుమతి ఏమివ్వాలా అని ఆలోచిస్తుంటే నేనే వాళ్లతో చెప్పాను. మేమంతా కలిసి వుంటే మాకు బాధలే గుర్తు రావు. భయం పరారు. మేం పుట్టి పెరిగిన వూళ్ళో మట్టిగా మారడం మాకానందం. మేమిక్కడ సంతోషంగా ఉంటేనే మీరిక్కడ హ్యాపీ గా వుంటారని చెప్పినమాట, వాళ్ళకి నచ్చింది. డబ్బులు సమీకరించి పంపారు. గ్రామస్తుల సాయంతో ఊరిని బాగు చేశాను. ఎవరికి ఏ చిన్న కష్టం వచ్చినా, ఈ ఇంటికి రావచ్చు. ఇది మనందరి సొంత ఇల్లు. మనం కలిసి వుండేందుకు చక్కటి ఏర్పాటు చేసిన మన పిల్లల్ని మెచ్చుకుంటూ ఈ స్వీట్ తినండి." అంటూ, విషయం చెప్పి తీపి తినిపించాడు మావాడు.

మా వూరి పెద్దమనుషులు కూడా వచ్చారు.

"ఇది మంచి పరిణామం. పుట్టి పెరిగిన వూళ్ళో ఇల్లు వుండటం సహజమే. కానీ స్నేహితులందరికీ కలిపి ఒకిల్లు వుంటే ఎంత బాగుంటుందనే ఆలోచన రావడం గొప్ప విశేషం. కుటుంబంతో సహా వచ్చి గడిపేందుకు చక్కటి వసతి. ఫారెన్లో డాలర్లు సంపాదిస్తున్న పిల్లలు, వొక్కొక్కరూ వాళ్ళ జీతంలోంచి కొంత తీసి, పల్లెల బాగుకోసం వెచ్చిస్తే అద్భుతంగా తయారవుతాయి. చిత్తశుద్ధి వుంటే చాలు!" అన్నారు వాళ్ళు.

మా అందరికీ అవుననిపించింది. మా ఎనిమిది మందికీ ప్రాణ భయం పోయింది. మాలో ఎవరికి పల్లెపై గాలి మళ్ళినా అందరం 'పల్లెకు పోదాం వస్తారా...!' అని అష్టాక్షరి అందుకుంటాం. ఆ ఎనిమిది అక్షరాల పేరు మా గ్రూప్‌కి పెట్టుకున్నాం. చెలో అంటే పొలోమని అందరం పోతాం... మా పల్లెకు. మా గుండెల నిండా మమకారం నింపుకునేందుకు!

ఇప్పుడు మాకు ప్రాణవాయువు కొనుక్కుని పెట్టుకునే పని ఉండటం లేదు!!

# సీనిగాడి పెళ్లి


## రాపాక కామేశ్వరరావు



✆ 7032905901


**జన్మదిన సంచిక 2024 "పల్లెకు పోదాం" కథల పోటీలో**
**ప్రోత్సాహక బహుమతి పొందిన కథ**

> ***"ఆ పిల్లకి కిందటి నెలే పెల్లి అయిపోనాది. మొగుడికి గవుర్మెంటు ఉద్దేగమట" అని సుట్టాల పిల్లడు సెప్పాడు. "పెతీ ఆడపిల్లకి ఉద్దేగమున్న మొగుడే కావాలట. మరి మనలాటోలికి పెల్లిల్లవ్వవురా" అని తెగ బాద పడి పేయాడు సీని.***

'సీత కట్టాలు సీతవి సీనిగాడి కట్టాలు సీనిగాడివి'. సీనిగాడి పెల్లి కట్టాలు సెప్పుకుంటె సేంతాడంత.

మా సీనిగాడు మీకు తెల్దు కదా. మా ఊరు అదేనండి నేలకట్టినూరికి అందగాడండి. మా ఊర్లో నల్ల కల్లద్దాలెట్టుకున్నోడొక్కడేనండి. సినిమా స్టారు లెక్కుంతాడు. ఆడికి పెల్లి సెయ్యడానికి నానా కట్టాలు పడ్డామండే!

"మగోడి పెల్లికి కట్టాలేటి" అని కొట్టి పారేకండి. పస్టు.. తొలీత పిల్ల దొరకాల, ఆ తరవాత అలయ్య, అలమ్మ ఒప్పుకోవాల. ఆతరవాత అలన్న, ఒదిన ఇంకా అప్ప బావ.. ఈలందరు ఒప్పుకుంతె ఆ పిల్ల ఒప్పుకోవాల! ఆ తరవాత పిల్ల తల్లిదండ్రి, ఇంకా ఆల తరుపు నొచ్చినోలు అందరికి సీనిగాడు నచ్చాల. ఇదీ ఇసయం!

ఆడి పెల్లి సూపులు కంటి సూపుల్తో పేరంబం. మా సీనిగాడికి ఒయిసు రాగానె నలుగురు గుంటల మీద కన్నేసాడు. తొలీత అల్లోలి, బోడి నుయ్య కాడ తానం కెల్లినప్పుడు రాములుని సూసి అయిసై పోనాడు.

"రాములు, నీవంటె నాకు మనుసే" అన్నాడు.

"నన్ను మనువాడతావా?" అని అడిగింది.

"ఓసోసి అలగడిగేసినావేటి"

"ఎలాగ కనబడతన్నాను?"

"అయినా మా అయ్య అమ్మ సచ్చిపెయినారేటి, ఆలు సూసుకుంతారు" అన్నాది రాములు.

రాములు జబాబే ఇట్టమనుకుని "రేపు మా అయ్యని పంపిత్తానె మీ ఇంటికి" అన్నాడు సీనిగాడు.

"ఏమో నాకేటి తెల్దు" అని బుంగ మూతెట్టింది రాములు.

★★★



“తెల్లారితే లచ్చిమోరం మంచిదేనిరా అయ్య. నీవు అమ్మ కలిసెల్లి ఆ పిల్ల సంగతి తేలిసేయండి” అన్నాడు సీని.

“ఓస్ తొందరేనికిరా! అలగైతె మనకి అనువు కట్టైత్తారు. నాల్రోజులు పోని ఎల్దుమ!” అన్నాడు రాజిగాడు అదేనండి సీనిగాడలయ్య.

కిందా మీద సేసి, ఎలాగైతేనేం రాజిగాడినొప్పించేడు సీని.

తెల్లారగానె పకాలన్నము తిని, సోంపెంట మాడుగులోలి కొట్లో కొన్న లంక పొగాకు సుట్ట ఎలిగించి, గుప్పు గుప్పుమని పొగ ఒదులుకుంటా రాములింటికి బయల్దేరాడు రాజిగాడు.

ఒల్లిగాడు, అదే రాములు తండ్రి, ఆడు కూడ పకాలి తినీసి అరుగు మీద కూకున్నాడు. బరంపురం నుండి కొనుకోని తెచ్చిన నాడిమైన గుంటూరు పొగాకుతో సేసిన పెద్ద సుట్ట తీసి ఎలిగించాడు.

రాజిగాడు ఇసయం సెప్పగానె “మీ పిల్లడు ఏటి సేత్తున్నాడు? ఏటైనా సదివాడా?” అంటూ అడిగాడు.

“పదో తరగతి దాక సదివాడురా, పేస్ అవనెదు”

"ఏముద్దేగం సేత్తాడు?"

"పెద్ద సదువులోలికే ఉద్దేగం లేదు. ఈడికేటొత్తాదిరా?"

"మరి మా పిల్లనెలాగ పెస్తాడు?"

"మనమేటి సదుముకున్నామురా ఒరే ఒల్లిగా? మరి మనం పెల్లాం పిల్లల్ని పెంచుకోలేదా?"

"మనం సదువు లేకపోయినా కూలి సేసుకొనైనా పెల్లంని పెంచగలమన్న దీమారా, ఆ తాకత్తు కూడ మనకున్నాది. ఇప్పుడు మీవోడికి అదే మీ సీనిగాడికి, సిన్న పిల్లప్పుడే ఇస్కూలు సదువుకి పంపేవు. మన రైతువారి పని ఏటి నేరపలేదు. అటు కాక ఇటు కాక అయిపోయాడు. మా పిల్ల కట్టం తిని బతుకుతాడేటిరా? మీవోడు"

"ఓస్ పుసుక్కున అలాగనేసావేటిరా? నాకు ఎకరా కొబ్బరి తోట ఎకరా పల్లము ఉన్నాదిరా. కొబ్బరితోట నుంచి దింపుకి అయిదేలు లెక్కన, సమచ్చరానికి ఆరు దింపులుకి మొత్తం కలిపి ముప్పై ఏలొస్తాయిరా. పల్లం బూమిలో పండిన గింజలు అల తిండికి సరిపోవేటిరా?"

"మరి మీ పెద్దోడికేమి వాటా ఇయ్యవా?"

"ఆడి వాటా అడెప్పుడో పట్టికెల్లిపోయాడురా, పారాగతులు కూడ అయిపోయాయి"

"ఆడపిల్లకి కూడ పెల్లి సేసేసాము దానికివ్వల్సింది ఇచ్చి పంపించేసేము"

"సరేగాని మాయమ్మినడిగి సెప్పుతానులే"

ఇలాగ నడిసాయి మాటలు.

రెండు రోజులు ఎల్లి పోయినా ఏ ఇసయము జబాబు రాలేదు ఒల్లిగాడి కాడి నుంచి.

సీనిగాడు మాసెడ్డ ఇదై పోనాడు. ఉలుకు పలుకు నేదు. నూతికాడ రాములు కనబడనేదు. ఆరా తీస్తే ఇచ్చాపరం అలపెద్దమ్మ ఇంటికెల్లిందని తెలిసింది.

★★★

"పర్నేదురా నిన్న మీ పెద్దయ్య కూతురు నచ్చిమి వొయిజాగ నుండి కబురెట్టింది మన ఊరి పేరిగాడితోటి"

"దద్దా మా ఆడబొట్టి పెల్లికి రడీగున్నాది, మన సీనికి సరిపోతాది, ఇట్టముంటె సూసుకోడానికి రాయండి అని" అన్నాడు రాజిగాడు.

"అన్నట్టు పొటొావు కూడ పంపిందిరా పేరిగాడి తోటి. నీవు పొటొావు సూసి 'ఊ' అను రేపే టైనెక్కి బయల్దేరి ఎల్దుమ" అన్నాడు సీనిగాడితో.

సీనిగాడికి మాత్రం రాములు మీదే మనుసు. "ఉహూ" అనాలని ఉంది గాని "సరే ఒకసారి వొయిజాగ సూసినట్టుంతాది"

అనుకొని, తండ్రికి "సరేనయ్యా" అన్నాడు.

తెల్లారి రెయిలు బండెక్కి, వొయిజాగెల్లారు తండ్రికొడుకులు ఇద్దరు నచ్చిమింటికి.

"ఏమే నచ్చిమి ఆ పిల్ల ఎక్కడుంతాది?"

"ఇక్కడే దద్దా, మా అత్త మామ దగ్గిరుంటాది, మీము ఏరేగున్నాము."

"అయిదు నిమసాల్లో, ఆపిల్ల మా అత్త మామతో కలిసి ఒచ్చేత్తాది"

రాజిగాడు 'ఎనాగైనా ఈ సమందం సెటల్ సేసుకుందాం' అనుకుంతున్నాడు.

'వొయిజాగ సమందం ఇంతదాక మా ఊర్లో ఎవురు సేసుకోనేదు మరి! అది గొప్పగా ఉంతాది కదా రాజిగాడికి. పోతె, పట్టనం పిల్ల కదా మంచి పేసన్ మీద ఉంతాది' అని ఆడి ఆలోసన.

నచ్చిమి.. అత్త మామ, పిల్లని తీసుకొనొచ్చారు. పిల్ల కొంచెం రంగు తక్కువైనా పేసన్ మీదున్నాది. ఈ మద్దినే పదో తరగతి పేసయ్యిందట.

"సీనిగాడి ఇసయాలు నచ్చిమి మీకు సెప్పుంతాది. ఇంక అడగడానికి ఏమి నేవు" అని రాజిగాడు అడి సేతికున్న ఉంగరం తీసి పిల్లతండ్రి సేతిలో ఎట్టి "ఇయాల్టి నుంచి పిల్ల మాది" అని ఒప్పందం సేసుకున్నట్టు అనీసాడు.

సీనిగాడు ఏమి మాటలాడనేదు. మర్నాడు పెందిలికాడ ఇంకో బండి పట్టుకొని మా ఊరు వొచ్చీసినారు.

★★★

ఈ ఇసయం 'పురిల్లుకి అగ్గి అంటుకున్నట్టు' నిమసాల్లో ఊరంత యాపించీసింది.

కాని సీనిగాడికి మాత్తరం రాములు మీద మనుసు పోలేదు. అయ్య గాబరపడి ఆ వొయిజాగ పిల్లని ఖాయం సేసిన ఇసయం అలన్న నరిసిగాడికి సెప్పాడు.

ఆ రోజు సందేలకి సీనిగాడి అన్న నర్సిగాడొచ్చాడు అలింటికి .

"ఏటిరా అయ్య, తమ్ముడికిట్టం లేకుంటా ఆ వొయిజాగ పిల్లని ఖాయం సేసుకొచ్చీసావట" అన్నాడు రాజిగాడితో

"పిల్ల బంగారమొసే, నీకేటి తెలుసురా వొయిజాగ పిల్లా మజాకా! ఎంత పేసనో.. నీవొక పాలి ఎల్లి సూసిరారా, నీకే తెలుస్తాది" అన్నాడు రాజిగాడు.

"అది కాదురా, అడికిట్టం లేదంతన్నాడు కదా" అన్నాడు నర్సిగాడు.

ఇంతలోపు నర్సిగాడి ఫెందు పెకాస్ గాడొచ్చాడక్కడికి

"రేపు పనిమీద వొయిజాగెల్తున్నానురా నర్సి, నీవు కూడ రా, ఆపిల్లని చూసొద్దుమ" అన్నాడు పెకాస్ గాడు.

"రుసి లేని కోరకి నొరెంగిలెందుకురా పెకాసు" అన్నాడు నర్సిగాడు. "ఆ ఉంగరం ఎక్కడో పడిపోయిందనుకొని ఒదిలేరా అయ్యా" అన్నాడు అలయ్యతో.

★★★

సీనిగాడి పెల్లి కత మల్ల ముందుకొచ్చింది!

రాములు ఇచ్చాపరం నుంచి ఇంకా రాలేదు. సరే సీనిగాడు నలుగురి గుంటలమీద కన్నేసాడన్నాను కదా, ఇంకో గుంట పేరు జేనికి.

ఒక రోజు పొద్దున్నే పొలం గట్టు దగ్గర ఏతాం పట్టికొని నీలు తోడుతున్న జేనికి దగ్గిరికెల్లాడు.

"ఏమే జేనికి ఎలాగున్నావే? నీకేం, బాగుంతావులే, నీది నవ్వు మొకమే ఎప్పుడు నవ్వతన్నట్టే ఉంతావు" అన్నాడు సీని.

"ఏటిరా సీని, పొద్దున్నే ములగ సెట్టెక్కించెత్తన్నావు? ఇంకెవులు దొరకనేదా నీకు, ఏటి సంగతి?"

"అదికాదె, నీవు గువ్వపిట్టలాగుంతావె, నీకు సూసినప్పుడల్ల నాకు మా సెడ్డ ఇదైపోతాదె."

"ఏటైపోతాది? ఒల్లుకొవ్వెక్కితే అలగే ఉంతాది. మూడు పూటలు పుల్లుగ తినీసి, సెరువు గట్లుకాడ, పొలం గట్లు కాడ కాస్తె అలాగె ఉంతాది. ఒల్లొంచి ఏదైనా పని సేస్తె బాగుంతాది!"

"అదేటె అలగనీసావు. నేను సదువుకున్నోడినే. నాకేటి తక్కవే?"

"గయినేరి ఉద్దేగమొత్తాదా కలకటేరా, నీ సదువుకి?"

"ఒసే నీ నోటిలె నోరెట్టడం నా బుద్ది తక్కవే, పచ్చి మిరపకాయలాటి దానవే నీవు!" అని ఒచ్చీసాడు.

★★★

మూడో గుంటండి వర్లచ్చిమండి. వర్లచ్చిమిది మా పక్కన గుంటల గుమ్మి. మా ఊరి సిలిమీ వాల్లో 'పుసప' సినిమీ సూడ్డానికి ఒచ్చినప్పుడు సీనిగాడు సూసేడు. పిల్ల బాగున్నట్టు అనిపించింది. ఆ తరవాత ఎల్లమ్మ జాతరలో సూసి ఎనకెనక తిరిగేడు. మాట కలిపేడు. ఇప్పుడు ఆ పిల్లకి మనువుకోసం అడగమని పెకాసుగాడికి సెప్పాడు.

"ఒరే పెకాసన్నా! గుంటలగుమ్మిలో సీరాములు నీ దోస్తీ కదా, ఆడి సెల్లి వర్లచ్చిమికి నా కోసం అడుగురా" అన్నాడు సీని.

"అలగేనిరా" అన్నాడు పెకాసు.

పెకాసుగాడికి మా సుట్టు పక్కల నాలుగైదు గేమాల్లో మంచి పేరున్నాదండి. ఎమ్మెల్లే గారి ఎనకమాలి తిరగతుంటాడండి. వర్లచ్చిమన్న సీరాములుగాడికి పెకాసుగాడికి మాంఛి దోస్తీ అండి.

వారం రోజుల్లోపు పెకాసుగాడు పెల్లి సూపులుకి రడీ సేసీసాడు. పెల్లి సూపుల్లో సీనిగాడు, వర్లచ్చిమి ఏరే గదిలో కూకొని మాటలాడుకున్నారు.

“వర్లచ్చిమే, నీవు పుసపలో సీవల్లి లెక్కుంతావే, ‘ఊ’ అంతె మనం పెల్లి సేసుకుందుమే” అన్నాడు సీనిగాడు.

“మాయన్న ఇట్టమే నా ఇట్టం” అని సెప్పింది వర్లచ్చిమి.

“ఒరే సీని, నీకు ఏమి ఉద్దేగం నేదు కదా, ఏద్దైనా ఒస్తె సూదుమురా! నీవు పది పేస్ అయ్యావంతె నీకు గేమ కార్యాలయంలో మన పెకాసుగాడు, ఎమ్మెల్లేకి సెప్పి వలంటీర్ ఉద్దేగమిప్పిస్తాడంట. అప్పుడే మీ పెల్లిరా” అని సీరాములు కండీసన్ పెట్టినాడండి.

మనోడు పది పేస్ అవ్వడమంతె వీజీ అనుకున్నారా? ఆడికి అన్ని పేపర్లల్ల గుండు సున్నాలే. సీరాములు గాడు ‘ఉహూ’ అనీసినట్టే.

★★★

మరి నాలుగో గుంట పార్వతి. సీనిగాడు పది సదవతన్నప్పుడు మాపక్కనున్నఇంకో ఊరు ‘దిమ్మలూరు’ సుట్టాల పెల్లికెల్లాడు. అక్కడ సూసాడు. పెల్లిలో ఆ పిల్లతో ఇగటాలు, పరేసికాలాడాడు. పిల్ల మా సక్కగుంతాది. అచ్చం సిలిమీలో సమంత లెక్క. మనుసులో ఒక మూలున్నాది ఆ పిల్ల కూడ. ఇప్పుడు ఒక మాట అడుగుతామని సీనిగాడు, నేను కలిసి దిమ్మలూరు సుట్టాలింటికెల్లి, ఆ పిల్ల కోసం ఆరా తీసామండి.

“ఆ పిల్లకి కిందటి నెలే పెల్లి అయిపోనాది. మొగుడికి గవుర్మెంటు ఉద్దేగమట” అని సుట్టాల పిల్లడు సెప్పాడు.

“పెతీ ఆడపిల్లకి ఉద్దేగమున్న మొగుడే కావాలట. మరి మనలాటోలికి పెల్లిల్లవ్వవురా” అని తెగ బాద పడిపేయాడు సీని.

★★★

ఈ లోపు రాములుకి ఇచ్చాపరంలో అల పెద్దమ్మ ఏదో సమందం సూస్తున్నాదని సీనిగాడికి తెలిసిందండి.

“ఏటి సేతుమ?” అని అడిగాడండి నన్ను. సుట్టు తిరిగి మల్ల రాములు దగ్గిరికొచ్చిందండి మనోడి పెల్లి కత. “అటో ఇటో తేలి పోవాలిరా” అన్నాడు.

“తొందరేనికిరా, ఇంకో పిల్లని సూదుములేరా” అన్నాను.

“ఉహూ, పద ఇచ్చాపరం ఎల్దుమ” అన్నాడండి.

“రాములెక్కడుంతాదో, ఎడ్రస్ ఎలాగ పట్టుకుంతాము?” అని అడిగానండి.

“నోరుంతె ఊరు కరువా? పదరా” అన్నాడండి.

మరస్టనాడు పుసప సిలిమీలో అల్లు అర్జున్ లాగ నల్ల కల్లద్దాలెట్టి, ‘తగ్గేదేలే’ అనుకొని బయలుదేరాడండి. ఆడి ఎనకాలే నీను ఎల్లానండి. ఇచ్చాపరం ఎల్లి రాములు పెద్దయ్య, పెద్దమ్మతో మాటలాడినామండి.

“ఒల్లిగాడితో మాటలాడి ఒప్పిస్తాను గాని, మీకున్న ఎకరా కొబ్బరితోట రాములు పేరున రాయాలి” అని రాములు పెద్దయ్య కండీసన్ పెట్టాడండి.

అటునుండి తిరిగొచ్చి, ఈ మాట, రాజిగాడికి అంటె సీనిగాడి అయ్యతో సెబితె, అదు సర్రున లెగిసాడు. మొత్తం మీద అడికి నచ్చజెప్పాము. తరువాత సీనిగాడి తరుపునున్న దగ్గిరోలందరికి సెప్పి రాములుతో పెళ్లి ఖాయం సేసామండి.

సీనిగాడికి రాములుకి మొన్న మాగమాసంలో పెళ్లి సేసీసామండి. రాజిగాడు ఒల్లిగాడు ఇప్పుడు ఇరకాదులైపొయినారండి.

ఇవండి మా సీనిగాడి పెళ్లి కట్టాలు. సేంతాదంత అయింది కదండీ? నమస్తే, ఉంతానండి!

# చెప్పాలని ఉంది


## ఉయ్యూరు అనసూయ



✆ 9550506829


**జన్మదిన సంచిక 2024 "పల్లెకు పోదాం" కథల పోటీలో**
**ప్రోత్సాహక బహుమతి పొందిన కథ**

> ***ఇటువంటి వెన్నెల రాత్రులు ఇంట్లో కన్నా ఇలా మంచె మీద ఉంటే ఎంత అందంగా ఉంటాయో, పెళ్ళైన కొత్తలో మీ నాయన నాకు చూపించాడులే. అది గుర్తొచ్చి కమలిని ఈడికే తెచ్చా. పెళ్ళి చేసింది కొడుకు కోడలు అన్యోన్యంగా మసలుకుంటే చూసి ఆనందించడానికే. దాన్ని నేను ఎందుకు దూరం చేసుకుంటాను! త్వరగా నాకో మనవణ్ణో, మనవరాలినో ఇస్తే ఈ బాధల నుండి ఉపశమనం పొందుతా!"***

పంటచేలో కాపు కాసేందుకు వచ్చిన చంద్రం, చేనంతా ఓసారి చుట్టి వచ్చి వరిమళ్ళు తడిచేట్లుగా కాలువ కట్టలు తెంచి వుంచాడు. నీరు నిదానంగా ఒకో మడికి చేరుతోంది. ఈలోపు ఓ కునుకు తీసి మళ్ళీ వచ్చి చూడ వచ్చులే అనుకుని మంచె పైకెక్కాడు. ఓసారంతా కలియజూసి, వరి మాంచి పొట్టమీదుంది దేవుడు కరుణిస్తే ఈ ఏడన్నా బాకీలు మాఫీ చేయొచ్చని మనసులో అనుకుంటూ దుప్పటి పరచి వెల్లకిలా పడుకున్నాడు. ఆకాశం అంతా వెన్నెల పరచుకొని చంద్రుడు మహా అద్భుతంగా కనిపించాడు. 'ఓ.. ఈరోజు పౌర్ణమి కదూ' అనుకోగానే చంద్రానికి చప్పున పెళ్ళాం కమలిని గుర్తొచ్చింది. ఏం చేస్తోందో పాపం. పెళ్ళయి రెండు నెలలు కూడ కాలేదు, మొదటిసారి తనని వదిలి ఇలా చేనుకి కాపలాకి రావాల్సి వచ్చింది అనుకున్నాడు. భార్య తలపుకు వచ్చిందో లేదో, తాను వదిలి రావాల్సి వచ్చిందే అనే స్థానంలో, కమలిని కూడ ఇక్కడుంటే ఎంత బావుండేది అనుకున్నాడు.

తాను పిలిస్తే వచ్చేదే కమలిని. కానీ అమ్మ పడనిస్తేనా. ఈ మధ్య అమ్మకి ఏమైందో తెలియదు తాను ఎంతో ఇష్టపడి తెచ్చుకున్న కోడలిని విసుక్కుంటోంది. కమలినీ తప్పేం వున్నట్టు తనకి అనిపించటం లేదు. ఆమాట అంటే 'బాగా వెనకేసుకొస్తున్నావు' ఆంటూ దెప్పిపొడుస్తుంది. కోడలు చేసే పని నచ్చలేదో.. లేక తను భార్యని ప్రేమించడం నచ్చలేదో తెలియలేదు కానీ, కావాలని తనను భార్య ముందు అవమాన పరుస్తుంది. ఏ పని సక్రమంగా చేయడం లేదని విసుగు చూపిస్తుంది. నోరు తెరచి అడుగుదామంటే చిన్న విషయం అనవసరంగా పెద్దదిగా తనే చూపించినట్లు అవుతుందని తలొంచుకుని వచ్చేస్తున్నాడు.

ఈరోజు కూడా పొలం కాపలాకి 'ఎవరినైనా పంపుతాలే' అంటే వినిపించుకోకుండా, 'ఎందుకు చెబుతున్నానో అర్థం చేసుకో' అంటూ బలవంతంగా పొలం వైపు తరిమింది. పెళ్ళయిన కొద్ది రోజులన్నా కాలేదు విరహం బాధతో, మనసు దిటవు చేసుకొని పనిలోకి వచ్చాడు. పాపం! కమలిని ముఖం చూడాలి, ఎలా వడలిపోయిందో? అంటూ ఉదయం జరిగిన

విషయం గుర్తుకు వచ్చి, అమ్మ మీద ఎక్కడలేని కోపం వచ్చి, నిద్రరాక అన్యమనస్కంగా లేచి కూర్చున్నాడు. భార్య జ్ఞాపకానికి రాగానే ఆమెతో గడిపిన సంఘటనలు మదిలిలో మెదిలాయి.

కమలినిని మొదటిసారి తల్లి వెంకటమ్మతో కల్సి బంధువుల పెళ్ళిలో చూసాడు. లంగా ఓణీలో అందంగా ముస్తాబైన ఈ పిల్ల, మంచి గుమ్మటంలాగుంది ఈ ఊరి పిల్లేనా? లేక పెళ్ళికి వచ్చిన మగ పెళ్ళివారి తాలూకానా అని ఆరాగా అడిగాడు తల్లిని.

“అది మా బంధువు మాలక్ష్మి వదిన కూతురు, తొమ్మిదో తరగతి చదువుకుంటుంది” అని చెప్పింది తల్లి.



“మనలో కూడ ఇంత ముచ్చటైన పిల్లలున్నారటనే?” అని ఆశ్చర్యంగా చూసిన కొడుకు మనసు గ్రహించింది గాబోలు తల్లి “పిల్లకి సంబంధాలు చూత్తన్నారంట అడగమంటావేంది?” అడిగింది… సంవత్సరం నుంచి పెళ్ళి మాట ఎత్తితే విసుక్కునే కొడుకుని.

“చదువుకుంటుంది అంటున్నావు కదే! పిల్ల బాగా ఎదిగింది కానీ ఇంకా పెళ్ళీడు కూడ వచ్చినట్లు లేదు. అప్పుడే పెళ్ళి ఆలోచనేంటి? అయినా చదువుకునే పిల్ల నన్ను చేసుకుంటుందంటావా?” అన్నాడు.

మాలక్ష్మికి ఇంకో ఇద్దరు ఆడపిల్లలున్నారు. భర్త అనారోగ్యంతో వున్నాడు అందుకే తొందర పడుతున్నారు. ఇది తెలిసిన తల్లి కొడుకు సంశయంతో పాటు కొడుకు మెచ్చిన పిల్ల అని కూడ అర్థం చేసుకుంది.

అందుకే మాలక్ష్మి దగ్గర కొచ్చి అడిగింది "వదినా! కమలినికి పెళ్ళి చేద్దామనుకుంటున్నావట?"

"అవునొదినా, నీకు తెల్వనిదేముంది? మీ అన్నయ్యకా... శక్తి సన్నగిల్లింది. నాల్గునెల్లనాడు రెండో పిల్లకూడ సమర్తాడిందని అన్నయ్యకి బెంగ ఎక్కువైపోనాది. అందుకే పెద్దదానికి పెళ్ళి చేసేద్దారి అనుకుంటుండాం,"

"అదేంటి వదినా, పద్దెనిమిది ఏళ్ళు రాకుండా పెళ్ళి చేస్తుంటే మా పల్లెలో అంగన్వాడోళ్ళు ఊరుకోటంలా.. పట్నం దగ్గరలో వున్న మీకెట్టాకుదురుద్ది?"

"నిజమే వదినా! కానీ తప్పటంలే, ముందు సంబంధం రానీ ఎలాగో గట్టెంక్కించే దారి దొరక్కపోతుందా?" అంటూ తనకున్న బాధలన్నీ ఏకరువు పెట్టింది మాలక్ష్మి .

ఆ బాధలు విన్న వెంకటమ్మ.. "ఇదిగో నీవేం కష్టపడకు. పిల్లని బాగ చదివించు. తరవాత విషయం భగవంతుడు నిర్ణయిస్తాడు. సదువు మాత్రం ఆపక. సదువు విషయంలో ఏ సాయం కావాలన్నా నేనున్నా" అని భరోసా ఇచ్చింది.

ఈమాట తన కొడుకు కోసం మాత్రమే అనలేదు వెంకటమ్మ. వెంకటమ్మకి చదువుకునే వారంటే ఇష్టం. భర్త పోయిన తర్వాత బాధ్యత నెత్తిన పడి కొడుకుని ఎనిమిది వరకే చదివించ గలిగానని బెంగ. ఇప్పుడు పరిస్థితి కొంత మెరుగ్గా వున్నా పూర్తిగా వ్యవసాయంపై మొగ్గు చూపిన కొడుకు, ఇక దాని ఊసెత్త లేదు. అందుకే ఎవరైనా చదువుకుంటుంటే వారిని బాగ ప్రోత్సహిస్తుంది. నిజంగానే మాలక్ష్మి భర్త కోసం కష్టపడటం చూసి జాలి పడి ఆమాటలు అంది.

సంవత్సరం తర్వాత మాలక్ష్మి దంపతులు కమలిని చేసుకోమని అడగటానికి వచ్చారు. కాలేజీ చదువులు చదివించలేనని, పెళ్ళి చేసుకోమని చెప్పిన తల్లికి 'చేసుకుంటే చంద్రం బావను చేసుకుంటా, లేకుంటే అస్సలు పెళ్ళి చేసుకోను' అని మొండికేసిందని చెబితే ఆశ్చర్యపోయారు తల్లీ కొడుకులు.

చేసుకోటానికి అభ్యంతరం లేదని పెళ్ళి ఖాయమే గాని పద్దెనిమిది ఏళ్ళు నిండాక కమలిని మనువాడతానని చెప్పాడు.

"అంటే ఇంకా రెండేళ్ళా? అందాక నేనుంటానంటావా?" అన్నాడు మాలక్ష్మి భర్త దిగాలుగా.

"ఛ అదేం మాట మావా! ఈరోజు నుండి నీకు పెద్ద అల్లుడిని. భరోసా వుంచుకో, నా మరదళ్ళ బాధ్యత కూడ నాదే. ఇంక నీవు నీ ఆరోగ్యం మీద శ్రద్ధ పెట్టు, మరి దేని గురించీ ఆలోచించకు" అని మాట ఇచ్చాడు.

భార్యాభర్తలు ఇద్దరూ సంతోషంగా బైలుదేరారు. వాళ్ళటు వెళ్ళగానే తల్లిని అడిగాడు "పట్నంలో పెరిగిన పిల్ల మనింటికి ఎలా వస్తానందే? ఇందులో నీ పాత్రేం లేదు కదా!" అని.

"ప్రత్యేకించి నేనేం చేయలేదురా! ఆ పిల్ల కోడలైతే బావుండు అని మనసారా దేవుణ్ణి కోరుకున్న మాట వాస్తవం. దేవుడు నా కోరిక మన్నించాడు తప్ప నాకేం తెలియదు!" అంది. నిజంగానే వెంకటమ్మకి కూడ ఆశ్చర్యంగానే వుంది వాళ్ళు వచ్చి అడిగినందుకు.

ఆ రోజు మొదలు, ఏ చిన్న పండగొచ్చినా, మాలక్ష్మి పిండి వంటలు చేసి అల్లుడి కోసమని పంపేది. 'ఎందుకు ఇవన్నీ, అసలే ఖర్చు మీద వున్నారంటే' 'అల్లుడికి ఆమాత్రం చేయకూడదా' అని బదులిచ్చేది.

ఓసారి మామ పరిస్థితి మరీ దిగజారిపోయిందంటే, కొడుకుని వెంటబెట్టుకుని చూసేందుకు వెళ్ళింది వెంకటమ్మ. వీళ్ళని చూసి సంతోషించాడు బుల్లియ్య. అల్లుడిని కూతుర్ని అలా దగ్గరగా చూసాక, పోతున్న ప్రాణాలు ఎవరో ఆపినట్లనిపించాయి.

సాయంత్రం బావని తీసుకుని ఏదన్నా సినిమాకు వెళ్ళిరాండని చెప్పింది మాలక్ష్మి. మాలక్ష్మికి సినిమాల పిచ్చి. కమలినికి ఆ పేరు పెట్టటానికి సినిమానే కారణం. అప్పుడెప్పుడో వచ్చిన ఆనంద్ సినిమాలో హీరోయిన్ బాగ నచ్చి, ఆ పేరే పెట్టుకుంది కూతురికి. మాలక్ష్మి సంగతి తెలిసి కోపం చేసుకోబోయాడు బుల్లియ్య, కానీ వెళ్ళమంది అల్లుడితో కాబట్టి సరే అన్నాడు.

మొట్టమొదటిసారి ఓ ఆడపిల్లతో తెలియనిచోట ఆటోలో ప్రయాణించటం. కాస్త బిడియం అనిపించింది చంద్రానికి. హాల్లో కూర్చున్నాక "నీతో ఇలా ఇష్టమైన సినిమాకి రావడం బావుంది" అంది. ఆ కళ్ళలో మెరుపు చూసాడు.

"థ్యాంక్స్ బావా!" అంది.

"నేను వున్నానని, మీ నాయన పంపించాడు, లేకుంటే పంపడు కదా! నీకు సినిమా చూడాలని వుందని నాకర్థమై ఒప్పుకున్నా. ఇంత మాత్రానికే థ్యాంక్సా?" ఆ మాత్రం సాయం చేయలేనా అన్నట్లు అన్నాడు.

"అదికాదు బావా! నాతో పెళ్ళికి ఒప్పుకున్నందుకు!" అంది.

"ఆ విషయం ఇప్పుడెందుకులే సినిమా చూడు!" అంటూ తెర వైపు చూపించాడు.

సినిమా మొదలైంది. కొద్దిసేపు గడిచాక కమలిని వైపు చూసాడు. పూర్తిగా సినిమాలో లీనమైవుంది.

కానీ తనకేమో ఆమె శరీరం నుండి వచ్చే అత్తరు వాసన, తలలో పెట్టుకున్న సన్నజాజులు, తన మనసుని పిండేస్తున్నాయి. పైగా దగ్గరగా కూర్చోవటం మూలంగా, ఆమె భుజాలు వెచ్చగా తగిలి, ఏదో గిలిగింతలు కలిగించాయి చంద్రానికి. చుట్టూ పరికించి చూసాడు. అందరూ సినిమాలో నిమగ్నమై వున్నారు. తనకి నచ్చిన హీరో కళ్ళ ముందు కనబడుతున్నా, అటువైపు దృష్టి పెట్టలేక పోయాడు. మళ్ళీ ఓసారి కమలినిని చూసాడు. తను చూడటం గమనించి ఏంటి అన్నట్లు చూసింది.

ఏం లేదనట్టు తలాడించాడు. ఎలాగో తమాయించుకున్నాడు. కాసేపట్లో ఇంటర్వెల్ పడింది. నిమిషం ఒక యుగంగా గడిపిన చంద్రం, ఊపిరి పీల్చుకుని 'తినటానికి ఏమైనా తెస్తా' అని లేచాడు. 'నేనూ వస్తా' అంటూ తనూ అనుసరించింది. అక్కడ క్యాంటిన్లో డ్రింకులు తాగుతుంటే జనం వీళ్ళని ఆసక్తిగా గమనించటం చూసాడు.

పెళ్ళికాని జంట కనబడితే ఎలా చూస్తారో అదే చూపు. తప్పు చేసానా అని ఒక్క క్షణం అనిపించింది.

మళ్ళీ సినిమా మొదలౌతున్నట్లుగా అలారం మోగింది. లోనికి వెళ్ళటానికి అడుగులు వేయబోతుంటే, చేయిపెట్టి ఆపి "ఇంటికి వెళ్ళిపోదాం" అంది. తనకి కూడా అలాగే అనిపించినా "ఎంతో ఇష్టపడి వచ్చిన హీరో సినిమా చూడకుండా వెళతావా?" అడిగాడు.

సమాధానం చెప్పకుండా "పద పోదాం" అంటూ ముందుకు కదిలింది.

హాలు బయటికి వచ్చాక ఆవైపు వెళితే, మా ఊరికి వెళ్ళే బస్సులు వున్నాయి. "ఈ సమయంలో అదే కరెక్టు" అంటూ సిటీ బస్సులు ఆగే వైపు నడిపిస్తూ తీసుకెళ్ళింది. ఇద్దరూ బస్టాండ్‌కి వచ్చి నిల్చున్నాక అక్కడ చాలామంది ఆడపిల్లలు ఇళ్ళకు వెళ్లడానికి అన్నట్లుగా, బస్సు కోసం నిలబడి ఉండటం గమనించాడు. పాపం పొద్దస్తమానం స్కూల్లో చదివి, మళ్ళీ ట్యూషన్ కోసం చదువుకుంటూ వీళ్ళ సమయం ఇలా బస్సుల నిరీక్షణ కోసమే సరిపోయేలా ఉంది, ఎప్పుడు ఇళ్ళకు చేరుకుంటారు.. ఎప్పుడు పడుకుంటారు, మళ్ళీ ఎప్పుడు లేస్తారు? అని జాలిపడ్డాడు. అనుకుంటాం కానీ పట్నం ఏమంత సౌకర్యవంతమైనది ఏం కాదు అనిపించింది చంద్రానికి.

కొద్దిసేపటికి బస్ వచ్చింది. దానిలో కూర్చున్న తర్వాత మళ్ళీ అడిగాడు "ఏం ఎందుకని వచ్చేసావు పూర్తిగా చూడాల్సింది ఎంతో ముచ్చటపడి వచ్చావు కదా?"

"సినిమాదేముంది... తర్వాత అయినా చూడొచ్చు, నీకు ఇలా రావడం నచ్చినట్లు లేదు. నేను నీకు నచ్చలేదా బావా?" తెలుసుకోవాలి అన్నట్లు అడిగింది.

"ఛ... ఛ... అలాంటిదేం లేదు. అసలు ఈరోజు నేను ఎన్నడూ మర్చిపోలేనంత గుర్తుంటుంది. నేను నిన్ను నచ్చటం కాదు, నీవెందుకు ఈ చదువులేని, పల్లటూరి వాణ్ణి కోరుకున్నావో అర్థం కావడం లేదు. ఇందాక బస్ స్టాప్‌లో కాలేజీ పిల్లలు చూస్తే అలా నీవు కూడా చదువుకొని మంచి ఉద్యోగం సంపాదించుకునే దానివి కదా! అనిపించింది.

"నీవు అన్నది నిజమే కానీ, పట్నంలో ఉంటేనే చదవాలని ఏం లేదు బావా, సరైన పరిస్థితులు ఉంటే ఎక్కడనుండైనా చదువుకోవచ్చు. చూసావు కదా ఇందాక ఆడపిల్లలు ఎంత అవస్థ పడుతూ బస్సులో ప్రయాణం చేస్తున్నారో! నిన్ను మొదటిసారి చూసినప్పుడు నాకేం అనిపించిందో తెలుసా? అత్తమ్మ మా అమ్మ దగ్గరకి వచ్చి నన్ను చదివించమని భరోసా ఇస్తూ మాట్లాడింది. ఆ మాటలు నేను విన్నా. అప్పుడే నిన్ను మరో కోణంలో చూసా. చదువుకి విలువ ఇచ్చే కుటుంబంలో కోడల్ని కావడం కన్నా ఏమంటుంది. నాకంటే చదువుకున్నోడ్ని తెచ్చినా వారు నన్ను సంపాదించే వస్తువుగా చూస్తారే తప్ప, చదువు సార్థకత ఏంటని ఆలోచించరు. అత్తమ్మ పెంపకంలో పెరిగిన నీవు చదువుకున్న భార్యని ఎలా చూసుకుంటావో ఊహించా. నాకు చదువుకోవాలని బాగా ఉంది. దానికి మీ సహకారం ఉంటుందని తెలిసినప్పుడు ఇక కాలేజీకి పోవడం ఎందుకు పల్లెలో వున్నా చదువుకోగలను!"

చెప్తూనే మనం దిగాల్సిన స్టేజి వచ్చింది అన్నట్లుగా లేచి నిలబడింది. తను కూడా ఆమెని అనుసరించాడు. తీరా దిగింతర్వాత గమనించాడు ఊరు కనబడలేదు. అదే అడిగాడు.

"నిజమే బావా! మనం ముందుగా వచ్చేస్తే సినిమా చూడకుండా వచ్చేసామంటే ఇంకేమైనా అనుకుంటారు. ఇక్కడ నుండి దగ్గరే, నిదానంగా నడుచుకుంటూ వెళ్దాం!" అంది.

ఆమె చేసిన పని కరెక్టో కాదో తెలియదు కానీ, మరి కాసేపు తనతో ఇలా ఏకాంతంగా గడపవచ్చనే విషయం నచ్చింది చంద్రానికి.

కాస్త ధైర్యం వచ్చింది. కమలిని చేయిని చేతితో పెనవేసి పట్టుకుని నడవటం ప్రారంభించాడు. కమలిని ఏం అభ్యంతరం పెట్టకుండా మరికాస్త ఆనుకుని నడుస్తూ "బావా ప్రశ్న అడిగింది నేనైతే, నాచేతే సమాధానం చెప్పించి నీవు ఏం చెప్పలేదు!" అంది.

పౌర్ణమి వెన్నెల కాంతుల్లో ఆమె ముఖంలోకి చూశాడు. తళతళ మెరిసే కాటుక కళ్ళని ఆస్వాదిస్తూ తన మనసు విప్పి చెప్పాలనుకున్నాడు. కానీ ఎందుకో అంతలోనే చిన్న తమాషా చేద్దామని.. "నాకు మా అమ్మంటే చాలా ఇష్టం. ఆమె ఏం చెపితే అది చేస్తా. ఆమె నిన్ను పెళ్ళి చేసుకో అని సెలెక్ట్ చేసింది, సరే అన్నాను!" అన్నాడు.

ఒక్క క్షణం మనస్సు చివుక్కుమంది కమలినికి.

"అంతేనా ఇంకేం లేదా?" అంది.

వస్తున్న నవ్వుని ఆపుకుని తల పక్కకి తిప్పుకున్నాడు. తన చేతుల్లోవున్న ఆమె చేతులు కాస్త పట్టుసడలి మళ్ళీ అంతలోనే గట్టిగా బిగుసుకోవటం గమనించాడు.

"నేనూ అదే కదా బావా చెప్పాను అత్తమ్మలాంటి ఆడవారు వుండరని. ఆమె పెంపకంలో పెరిగిన నీవు నాకు తగిన వాడివని అనిపించిందని" మీ అమ్మ మూలంగానే నువ్విష్టం అనే అర్థం వచ్చేట్లు అంది.

ఆ తెలివికి నవ్వుకున్నాడు.

చకచక నడుస్తూ వున్నవాడల్లా, రోడ్డు పక్కనే వంతెన కనబడితే ఓసారి ఆగి చూసాడు. షడన్‌గా ఆగే సరికి అతని చేతుల్లో వున్న ఆమె చేయి విడిపోయింది ఏమైంది అన్నట్లు చూసింది.

మరికాసేపట్లో ఊర్లోకి వెళ్ళబోతారు. ఎందుకో అంత తొందరగా పోవాలని పించలేదు. మరికాసేపు కమలినితో ఏకాంతంగా గడపాలని వుంది. అందుకే ఏదో సాకుతో ఆగాడు. "ఈ వంతెన ఎందుకు కట్టారు" అన్నాడు, దాని మీదకి ఎక్కి కూర్చుంటూ.

"వానాకాలంలో నీటి ఉధృతి ఎక్కువై రోడ్డు మీదుగా పారేవి నీళ్ళు, అప్పుడు ఊర్లోకి రాకపోకలు బంద్ అయ్యేవి. తర్వాత ఈ మధ్యే ఇలా కట్టటం మూలంగా ఎలాంటి ఆటంకం లేదు!" అంటూ తను కూడా అతని మీదుగా వంగి అక్కడ నుండి తొంగి చూసింది.

ఆ వెన్నెల కాంతిలో నీటిపై నుండి కాంతి ప్రతిబింబిస్తూ చూసేందుకు ఎంతో మనోహరంగా వుంది ఆ దృశ్యం. మాట్లాడటం ఆపేసి మైమరచి చూస్తూ వుంది. ఆ వెన్నెల నీటిలో తమ ప్రతిబింబాలు ఒకరిమీద ఒకరు వరిగినట్లుగా వుండటం చూసి మురిసిపోయాడు. పైగా తనకి అత్యంత దగ్గరకి వచ్చిన ఆ ముఖాన్ని అలాగే వెనుక నుంచి తన మీదకు లాక్కుని, ఆమె చేతుల్ని వెనుక నుండి తనని చుట్టేసేలా మలచి, తన ముందుకు లాక్కుని 'ఇందాక సరదాగా అన్నాను. అసలు మా అమ్మ నా మనసు గ్రహించే నిన్నూ.. నన్ను ఒకటి చేయాలనుకుంది' అని ఆమె గురించిన మధుర భావనలు మరెన్నో చెప్పాలనుకున్నాడు

కానీ ఈలోపు దూరం నుంచి ఏదో వాహనం వస్తున్నట్లుగా వెలుతురు పడింది. కమలిని ఒక్కసారిగా తేరుకున్నట్లుగా చూసింది. ఆ చూపులో ఎవరైనా చూస్తే బాగోదని బెరుకు ఆ వెన్నెల్లో స్పష్టంగా కనిపించింది. ఆమె బెరుకు చూసి చిన్న నిట్టూర్పుతో ఇది తగిన సమయం కాదేమో అని కొంచెం తగ్గాడు. తర్వాత ఇద్దరూ లేచి సర్దుకుని నిదానంగా నడుచుకుంటూ ఊర్లోకి వచ్చేసారు.

★★★

ఆ రోజు కమలిని అంటే తనకెంతో ఇష్టమో చెప్పాలని అనుకున్నాడు. కానీ చెప్పలేక పోయాడు. ఆ సంఘటన గుర్తొచ్చి దీర్ఘంగా నిట్టూర్చాడు. తర్వాత పెళ్ళయ్యేవరకూ కమలిని అనుమానం తీర్చటానికి తగిన సమయమే దొరకలేదు చంద్రానికి. ఎప్పుడన్నా ఏమన్నా ఏకాంతం దొరికితే తన మనసు విప్పి చెప్పాలని ఎదురు చూసిన రోజు, సరిగ్గా ఈరోజులాగే అనుకోని గొడవ ఏదో మొదలౌతుంది. అది గుర్తొచ్చి చిరాగ్గా, ఛ... అనుకుంటూ దుప్పటి విదిలించి పైకి లేచి నిలబడ్డాడు.

దూరంగా ఎవరో ఇద్దరు వ్యక్తులు లాంతరు పట్టుకుని నడిచి రావడం కనిపించింది. గబా గబా మంచె దిగి "ఎవరది?" అంటూ ఆ లాంతరుకు ఎదురెళ్ళాడు. కొంచెం దగ్గరకు రాగానే ఇద్దరినీ గుర్తుపట్టి ఆశ్చర్యంగా చూస్తూ "అమ్మా! కమలిని! ఏమైంది?" అన్నాడు గబరాగా

"హుష్... అరవకు ఏం కాలేదు" అమ్మ గొంతు విని స్థిమిత పడ్డాడు.

"నీ మనసు అర్థం చేసుకోలేని వాజమ్మని కాదురా! కాకుంటే ఈ ఏడు పంటలు రాక, అప్పులు ఎక్కువై ప్రతిదానికీ విసుగు ఎక్కువైన మాట నిజమే. నువ్వలా బాధగా వెళుతుంటే అనిపించింది 'నా తొందరపాటు ఏంటో.' లక్షణమైన కొడుకు కోడలు వుండగా ఇంకా నాకు దిగులెందుకు? అప్పులు ఈ ఏడు కాకుంటే మరో ఏడు తీరతాయి. ఒరే బంగారం! నిన్నేమైనా బాధపెట్టి ఉంటే క్షమించు. పంట విషయంలో అశ్రద్ధ వద్దని బలవంతంగా పంపాను. కానీ ఆ మీ ఆనందాన్ని పాడుచేయాలని లేదురా. ఇటువంటి వెన్నెల రాత్రులు ఇంట్లో కన్నా ఇలా మంచె మీద ఉంటే ఎంత అందంగా ఉంటాయో, పెళ్ళైన కొత్తలో మీ నాయన నాకు చూపించాడులే. అది గుర్తొచ్చి కమలిని ఈడికే తెచ్చా. పెళ్ళి చేసింది కొడుకు కోడలు అన్యోన్యంగా మసలుకుంటే చూసి ఆనందించడానికే. దాన్ని నేను ఎందుకు దూరం చేసుకుంటాను! త్వరగా నాకో మనవణ్ణో, మనవరాలినో ఇస్తే ఈ బాధల నుండి ఉపశమనం పొందుతా!" అంటూ కోడలిని కొడుకు చేతికి అందించి లాంతరు పుచ్చుకుని వెనుదిరిగింది.

ఎంతైనా అమ్మ అమ్మే, నయం తొందరపడలేదు అనుకున్నాడు చంద్రం.

ఆమె వెళ్ళిన వైపే చూస్తూ, భర్త భుజంపై తల ఆనిస్తూ "నువ్వు వెళ్ళాక అత్తమ్మ చాలా బాధ పడింది. అప్పుల మూలంగా అందరి మీద విసుగు ఎక్కువైంది. ఏమీ అనుకోకు అంది. తనకి తానే సర్ది చెప్పుకుని నన్ను బలవంతంగా ఇక్కడికి తెచ్చింది. ఎంతైనా అత్తమ్మ మనసు వెన్నెలంతా చల్లనైనది" అంది పైకి చూస్తూ కమలిని!

ఆ వెన్నెల్లో కమలిని నోట్లోంచి వచ్చిన మాటలు మనసుకి హాయిగొల్పాయి. చంద్రుడి వైపు చూస్తూ "కమలీ! ఈరోజు నీకో విషయం చెప్పాలని వుంది" అంటూ ఆమెని మంచె పైకి మోసుకెళ్ళాడు.

# వరికంకులు


## పెమ్మరాజు విజయరామచంద్ర



✆ 9849744161


**జన్మదిన సంచిక 2024 "పల్లెకు పోదాం" కథల పోటీలో**
**ప్రోత్సాహక బహుమతి పొందిన కథ**

> ***"నిజమే, కాని మనల్ని నమ్ముకున్నవాళ్ళు రోడ్డున పడ్డప్పుడు తృణమో, పణమో ముట్టచెప్పాలి. మనకున్న దాంట్లో కలో, గంజో పంచుకోవాలిగా. లేకపోతే పట్నానికి వలసపోతారు. వాళ్లు మనలాగే యాజ్ఞీకాలు చేసుకునేవాళ్లేనండి, యాచకులు కాదు. పాండిత్యం లేక. 25పోవచ్చు. ఆకలిబాధ ఉంటుందిగా. అందరికి ఒకటేగా!***

వేదం ఘోషించిన అరుగు మీద నిర్వేదం నృత్యం చేస్తోన్నట్లుంది. 'అరుగులన్నింటిలోను ఏ అరుగు మేలు, పండితులు కూర్చుండు మా అరుగు మేలు' చిన్నప్పుడు వల్లెవేసిన పద్యంలో అపశృతి వినిపిస్తోంది. మండువా లోగిలి, అరుగు గుర్తొస్తే.. నుదుట విభూతి రేఖలు, బ్రహ్మస్థానంలో మండేసూర్యుడిలా ఎర్రని కుంకుమబొట్టు, బ్రహ్మతేజస్సుతో వెలిగే శివనాథశాస్త్రి నిండురూపం గుర్తుకొస్తుంది. పరిపూర్ణ పవిత్రతతో ఇల్లు ఆలయంగా భాసిల్లింది. ఆయన సహధర్మచారిణి అన్నపూర్ణ. పేరుకు తగ్గట్టుగా అన్నపూర్ణే. కనిపించని ఆకలిని కన్నతల్లిలా కనిపెట్టేది. కడుపు నింపేది. సంస్కృతి, సంప్రదాయాలు రెండుకళ్లుగా నిలబడ్డ కుటుంబం ఊరికి మధురజ్ఞాపకం.

శివనాథశాస్త్రి పాండిత్యం పట్ల, వాక్శుద్ధి మీద జనానికి విపరీతమైన నమ్మకముండేది. ఆయన మాట బ్రహ్మవాక్కు. పలుకు వేదవాక్కు. అరుగు మీద జనం కూర్చునే టేకుబల్లకు, అరుగుకు ఉండే అనుబంధం ప్రాణవాయువుకి, మనిషి ఆయువుకున్న సంబంధంలా ఉండేది. ఆ అరుగు జనం దృష్టిలో కష్టాలకాలువ దాటించే బల్లకట్టు. వాస్తు కోసం వచ్చేవాళ్లు, జాతకం చెప్పించుకునేవాళ్ళు, ముహూర్తాలకి వచ్చేవాళ్ళతో ఆవరణ నిండిపోయేది. ఇంటి ప్రాంగణం నెలలునిండిన గర్భిణిలా ఉండేది. మాన్యుల నుంచి సామాన్యుల దాకా అందరూ వచ్చేవారు.

శివనాథశాస్త్రి పౌరోహిత్యం కోసం పొలిమేర దాటినా, మధ్యాహ్నానికి ఇంటికి చేరుకునేవారు. అరుగు మీద పరచిన తివాచీ మీద కూర్చునేవారు. ఎదురుగా చాప మీద కూర్చున్న మనిషిని వివరాలడిగి, పంచాంగం తిరగేస్తూ వేలితో గణాల్ని గుణించి లెక్కలు కట్టేవారు. పొడుండబ్బీలో నశ్యాన్ని చూపుడువేలుతో తీసి, బొటనవేలితో నొక్కిపెట్టి గట్టిగా రెండు ముక్కురంధ్రాలలోకి పీల్చారంటే ముహూర్తం ఖరారైనట్లే. భుజమ్మీదున్న ఎర్రటి కాశీ తువ్వాలుతో ముక్కుకి అంటిన నశ్యాన్ని తుడుచుకుని, పంచాంగంలో పదిలంగా పెట్టుకున్న తెల్లకాగితమ్ముక్క తీసేవారు. ఖద్దరుజుబ్బాలోంచి కలం తీసి సుముహూర్తం రాసి, కాగితానికి నాలుగువైపులా కాసింత పసుపు పూసి చేతికి అందించేవారు. అలా ముహూర్తం రాసిన

కాగితాన్ని జనం మహాప్రసాదంగా కళ్ళకద్దుకుని తీసుకునేవారు. శక్తికొద్దీ తోచినంత ద్రవ్యాన్ని అమ్మవారి పటం దగ్గర ఉంచేవారు. అది రివాజు.

ఒకసారి ముహూర్తం రాస్తే గురిపెట్టిన రామబాణంలా దూసుకుపోవలసిందే. పరిస్థితులు ఎలాంటివైనా పెట్టిన ముహూర్తంలో శుభకార్యం జరగవలసిందే.

ఎప్పుడూ గుమ్మం మామిడితోరణాలతో కళకళలాడేది. అది నాటి చరిత్ర!

ఇప్పుడా గుమ్మం, చిలకలు వాలిన చెట్టులా ఉండే అరుగు ఆకులురాలిన మోడులా మారిపోయింది.



శివనాథశాస్త్రి వారసుడు మహాదేవశాస్త్రి పౌరోహిత్యం చేసుకుంటూ ఊర్లోనే స్థిరపడ్డాడు. కరిగిపోతున్న కాలంతో పాటు కట్టుబాట్లు కనుమరుగువుతున్నాయి. మనుషులలో వచ్చిన మార్పుతో ఆచారవ్యవహారాలకి మకిలి పట్టింది. జీవనవిధానం త్రోవ తప్పింది. సంస్కృతి చాదస్తంగా కనిపిస్తోంది

అలాంటి పాండిత్యం పరవళ్ళు తొక్కిన అరుగు మీద పదేళ్ల శివుడు గుత్తులుగా గుమ్మానికి వేలాడదీసిన వరికుచ్చుల్ని చూస్తున్నాడు. వాటిమీద వాలుతున్న పిచ్చుకల్ని గమనిస్తున్నాడు. ధాన్యపుగింజల్ని నోటికి కరిచిపెట్టుకుని టపటప రెక్కలచప్పుడు చేసుకుంటూ తుర్రుమని పారిపోతున్నాయి. పిచ్చుక వెనుక పిచ్చుక వస్తోంది. గింజల్ని పట్టుకుని రివ్వున ఎగిరిపోతోంది. పిచ్చుకలు రావడం ధాన్యపు గింజలు పట్టుకుపోవడం పరిశీలిస్తున్నాడు. బుల్లిబుర్రను తొలిచే ఎన్నో సందేహాలకి సమాధానం కోసం ఆలోచిస్తున్నాడు శివుడు.

ఆక్కడకొచ్చిన అవధాన్లు “శివా, నాన్నగారు ఉన్నారా?” అడిగారు.

శివుడులో ఉలుకులేదు, పలుకు లేదు. దీక్షగా పిచ్చుకల్ని చూస్తున్నాడు.

వడియాలు పెట్టే పనిమీద పాతచీర పట్టుకుని, మడిచీర కట్టుకుని లోపల్నుంచి వచ్చింది మహాదేవశాస్త్రి భార్య పార్వతమ్మ.

గుమ్మం దగ్గర నిలబడ్డ అవధాన్లుని చూసి, “అన్నయ్యా, ఎంతసేపైందొచ్చి? దాహం కావాలా?” అడిగింది.

“వద్దమ్మా. ఇప్పుడే వచ్చాను. మకాం పట్నం మారుద్దామనుకుంటున్నాం. ఆ విషయాన్ని బావ చెవిన వేద్దామని...”

“అదేమిటన్నయ్యా, అలాంటి నిర్ణయం....”

“లేదమ్మా, ఇక్కడ రోజులు గడవడం కష్టంగా వుంది. జనం పనులు కోసం పట్నం బాట పడుతున్నారు. పల్లెలలో అలవాట్లు, కట్టుబాట్లు మారిపోతున్నాయి. రాబోయే రోజుల్లో ఈ మాత్రం ఆదరణ కూడా ఉండకపోవచ్చు. గతంలో మూఢంరోజులలో కార్యక్రమాలు లేకపోయినా కాలక్షేపం చేసేవాళ్లం. శూన్యమాసాలలో శుభకార్యాలు లేకపోయినా కాలం గడిపేవాళ్లం. సంపాదించిన గ్రాసంతో సర్దుబాటు చేసుకునేవాళ్ళం. అపరకర్మలు ఉండేవి. ఇప్పుడు సంవత్సరానికోసారి తల్లితండ్రులకు తర్పణ వదలడం మానుకున్నారు. గత్యంతరం లేక కుటుంబాన్ని పస్తు పెట్టవలసి వస్తోంది. మూలిగే నక్క మీద తాటిపండులా జరుగుతున్న యుద్ధాలు, పెరుగుతున్న ధరలు పెనుభారమై ప్రజలు పూర్తిగా కార్యక్రమాలు చేయడం మానేస్తున్నారు. బతుకు దుర్భరమైపోతోంది!”

“త్వరలోనే అన్ని సద్దుకుంటాయాన్నయ్యా! అధైర్యపడకు. మనం పురహితం కోరే పురోహితులం. మంచిరోజులు వస్తాయని ఆశించాలి.”

“నిజమే. ఎంతటి కష్టమొచ్చిన లోకకళ్యాణం కోసం నిత్యానుష్టానం, దేవతార్చన వదలుకోలేం. మనం చేసే పూజాపునస్కారమే మనల్ని, ప్రజల్ని కాపాడుతుందని నమ్ముతాం. ఇక్కడకంటే యజ్ఞాలు, యాగాలు లాంటి క్రతువులు పట్నంలోనే ఎక్కువ జరుగుతున్నాయి. పిల్లలు కూడా పట్నం వెళ్లదామని అంటున్నారు. అక్కడైతే గుడిలో అర్చకత్వం చేసినా, పళ్లెంలో వేసే దక్షిణపైసలతో బతకచ్చు. పిల్లలు ఏదో ఉద్యోగం చేసుకుని జీవితంలో స్థిరపడతారు!”

“దూరపుకొండలు నునుపు అంటారన్నయ్యా! దాదాపుగా అన్నిచోట్ల ఇదే పరిస్థితి. అక్కడ కూలీ చేసుకుందామని వెళ్ళిన

జనం పనిలేక ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి సమయంలో అక్కడకు వెళ్లడం ఎంతవరకు మంచిదో ఆలోచించు. పుట్టిపెరిగిన ఊర్లో కష్టం వస్తే పాపం అవధాన్లు మనవాడు అనుకుంటారు. ఆదుకుంటారు. ముక్కుమొహం తెలియని పట్నంలో నిన్ను ఎవరు పట్టించుకుంటారు. హడావిడి నిర్ణయాలు మంచివి కాదేమో... నీ వెనుక మేం ఉంటాం!"

"పనులు లేనప్పుడు మిమ్మల్ని మాత్రం అడిగి ఇబ్బంది పెట్టగలమా. బావకీ ఇబ్బందులుంటాయిగా!"

"మనలో మనకి ఇబ్బందేముందన్నయ్యా. ఆయన పొలం వైపు వెళ్లారు. రాగానే మాట్లాడి కబురు పెడతాను!"

"నువ్వింతగా చెపుతున్నావు. నేను ఇంట్లోవాళ్లతో ఆలోచిస్తానమ్మా!"

పార్వతమ్మ మాటలకి అవధాన్లుకి సాంత్వన కల్గింది. వెంట తెచ్చుకున్న విచారాన్ని పాతేసి మనోధైర్యాన్ని వెంటపెట్టుకుని ఇంటికెళ్ళాడు.

"ఏరా శివా, నాన్న ఉన్నాడాని అవధాన్లు మామయ్య అడిగితే సమాధానం చెప్పొచ్చుగా?"

"అమ్మా! పిచ్చుకలు ధాన్యపుగింజల్ని నోటికి కరచిపెట్టుకుని ఎక్కడికి ఎగిరిపోతాయి. గింజల్ని ఎక్కడ దాచుకుంటాయి?" అడిగాడు శివుడు.

"పిచ్చుకలు కట్టుకున్న గూటికి తీసుకుపోతాయి. గింజల్ని పిల్లలకి తినిపిస్తాయి!" పరచిన గుడ్డమీద పొందికగా వడియాలు పెడుతూ చెప్పింది పార్వతమ్మ.

"అంటే చిన్నప్పుడు నాకు చందమామని చూపిస్తూ, అన్నం తినిపించినట్టా?"

ఆడుగుతున్న ప్రశ్నలకి మొహంలో పలుకుతున్న భావాల్ని చూసి మురిసిపోయింది పార్వతమ్మ.

"ఇక్కడ గింజలు ఉన్నాయని కబురు ఎలా తెలుస్తుంది?"

"ఐకమత్యం వల్ల."

"ఐకమత్యమంటే?"

"కలసిమెలిసి ఉండడం. మన ఆకలి తీరితే చాలు అనుకోకూడదు. పక్కవాడికి తినడానికి ఉందో లేదో ఆలోచించాలి."

"మరీ పొలంలో పెరిగిన కంకుల మీద పిచ్చుకలు వాలితే తరిమేస్తాం. గుమ్మానికి కట్టిన వరికంకులు తీసుకెళ్లుతుంటే తరమటం లేదేందుకు?"

వాడి అనుమానానికి పార్వతమ్మ ఆశ్చర్యపోయింది.

"చూడు బంగారం, పొలంలో పిచ్చుకలు కంకుల్ని ముక్కుతో పొడిచాయనుకో. గింజలు రాలిపోతాయి. కిందపడ్డ గింజల కోసం పందులు, పందికొక్కులు వస్తాయి. పంటని నాశనం చేస్తాయి. అందుకే పొలంలోకి పక్షులు రాకుండా తరిమేస్తాం. గుమ్మానికి భక్తితో వరికంకులు కట్టి పిచ్చుకల్ని పిలుస్తాం. వాటితో పాటు లక్ష్మీదేవి ఇంట్లోకొస్తుంది"

"లక్ష్మీదేవా? ఎక్కడా కనిపించదేం?"

"ఆకలితో ఉన్న మనిషికైనా, పక్షికైనా అన్నం పెడితే లక్ష్మీదేవి వస్తుంది. కనిపిస్తుంది."

ఆ మాటలకు శివుడి మొహం వివర్ణమైంది. ముందురోజు సాయింత్రం లచ్చిగాడి అమ్మ మాటలు గుర్తుకొచ్చాయి. 'ఒరేయి, ఏడవకురా. అయ్య బైటకెళ్లిండు. ఎట్టాగైనా గుప్పెడు గింజలు తెత్తాడు. నేకపోతే నూకలైనా ఎత్తుకొత్తాడు. ఉడుకుగా వన్నమైనా పెడతా. జావైనా తాగిస్తా.'

'నీయన్నీ అబద్ధాలే. మూడుదినాల నుండి ఇదేమాట సెపుతున్నావు' లచ్చిగాడు ఏడుస్తున్నాడు.

'నేనేటి సేసేదిరా. డబ్బా ఊడ్చినా గలేసుడు గింజలు రానేదు. కూలిపని దొరకడం నేదు. ఇసుక దొరకట్నేదని ఇల్లు కట్టుబల్లు ఆగిపోనాయి. పెట్రోలు ధరలు పెరిగిపోనాయని పప్పు, ఉప్పు పిరమైపోనాయి. కూలి కూసింత, ఖర్సులు ఆకాసమంత. యుద్ధాలని దేసాలు కొట్టుకుని సత్తోంటే ఈడ ధరలు పెంచేసినారు.'

వెంకమ్మ మాటలు శివుడికి అర్థం కాలేదు. లచ్చిగాడి ఆకలి మాత్రం అర్థమైంది.

అది జ్ఞాపకం వచ్చి, శివుడికి మెరుపులాంటి ఆలోచన వచ్చింది. వడియాలు పెట్టి లోపలకి వెళుతున్న పార్వతమ్మ వెంటబడ్డాడు.

"ఆకలిగా ఉంది. తినడానికి ఏదైనా పెట్టమ్మా!" నీరసంగా మొహం పెట్టి అడిగాడు.

పార్వతమ్మ పెట్టిన జంతికలు కాగితంలో పొట్లం కట్టుకుని, జేబులో పెట్టుకుని బైటకి పరుగెత్తాడు.

"అవధాన్లు వెళ్లిపోయాడా?" పెరటిగుమ్మంలోంచి వచ్చిన మహాదేవశాస్త్రి పార్వతమ్మని అడిగాడు.

"ఏమండీ, కొన్నిరోజులుగా చూస్తున్నా. అవధాన్లు అన్నయ్య, పేరిశాస్త్రి బాబాయి వచ్చినప్పుడు ఇంట్లో ఉండి కూడా లేరని అబద్ధం చెప్పిస్తున్నారు."

"అది..." కాసేపు తడబడ్డాడు.

"ప్రశ్నలు అనవసరం. నేను చెప్పమన్నట్లు చెప్పడమే" మళ్లీ సంభాళించుకుని దబాయించాడు.

"కష్టాలలో ఉన్న మనవాళ్లని కాపాడుకోవలసిన బాధ్యత మనదే కదా!"

"బాధ్యతలు నాకు తెలుసు. పూజకి సంకల్పం చెప్పడం రానివాళ్ళకు దక్షిణలు ఇప్పించాను. గాయత్రిమంత్రం పలకలేని వాళ్లకు నాలుగువేళ్ళు లోపలికి వెళుతున్నాయంటే నేనే కారణం. పొట్ట చింపితే అక్షరంముక్క రానివాళ్ళ కడుపు నిండుతోందంటే నేను పెట్టిన భిక్షే!" అహంకారంగా అన్నాడు.

"వాళ్ళకే పాండిత్యముండుంటే మీ వెంట పడేవారా? మీరు చెప్పిన పని చేస్తూ, మీ వెనుకే తిరిగేవారా? పని ఇచ్చే మీలాంటి వాళ్లు, అలాంటివాళ్లకీ కావాలి. చెప్పిన పని చేసే అలాంటివాళ్లు మీకూ కావాలి. ఇది పరస్పరం అవసరం." .

"వీళ్లు కాకపోతే వేరొకరు.."

"ఇదేమాట వాళ్లు అనుకుంటే?"

"అంటే... నేను వాళ్ల మీద ఆధారపడి బతుకుతున్నానా?"

"వాళ్లు మనల్ని నమ్ముకుని బతుకుతున్నారంటున్నాను. కష్టాల్లో మనం ఆదుకోవాలంటున్నాను. మన ధర్మాన్ని గుర్తు చేస్తున్నాను!"

"ధర్మం ముసుగులో అలా పంచిపెట్టుకుంటూ పోతే మన చేతికి చిప్పే మిగుల్తుంది. అడుక్కుతినాలి. ఎప్పటి పనికి అప్పుడు సంభావనలు ముట్టచెప్పాం కదా!"

"సంభావనలకి సరిపడే పనిచేసారుగా? ఇవన్నీ కాదు. తరతరాలుగా మన కుటుంబాన్ని నమ్ముకుని బతుకుతున్నారు. మీ తాతలు, తండ్రులు వాళ్ల తల్లితండ్రులని గుండెల్లో పెట్టుకుని చూసుకునేవారు. ఇప్పుడు మన బాధ్యత!"

"ఆ రోజులు వేరు, ఇప్పుడు నాకే పనిలేదు. వాళ్ళ బతుకులకి పూచీకత్తు ఎలా తీసుకుంటాను."

"నిజమే, కాని మనల్ని నమ్ముకున్నవాళ్ళు రోడ్డున పడ్డప్పుడు తృణమో, పణమో ముట్టచెప్పాలి. మనకున్న దాంట్లో కలో, గంజో పంచుకోవాలిగా. లేకపోతే పట్నానికి వలసపోతారు. వాళ్లూ మనలాగే యాజ్ఞీకాలు చేసుకునేవాళ్లేనండి, యాచకులు కాదు. పాండిత్యం లేకపోవచ్చు. ఆకలిబాధ ఉంటుందిగా. అందరికి ఒకటేగా!" పార్వతి గొంతు జీరబోయింది.

"అది కాదు పార్వతీ..."

"ఏమండీ.. మనకేం లోటు! మీ తాతలు, తండ్రులు సంపాదించిన ఆస్తులు కొద్దో, గొప్పో ఉన్నాయి. పాడికి లోటు లేదు. నాలుగు రోజులు పని లేకపోయినా 'దేహి' అని చేయి చాపక్కర్లేదు. మనకున్నది ఒక్క నలుసు. కష్టాల్లో వాళ్లను చూసుకుంటే దేవుడు మనల్ని కంటికి రెప్పలా కాపాడతాడు. మీకు చెప్పేంత గొప్పదాన్ని కాదు!" ఆ క్షణం అవకాశంగా తీసుకుంది.

మహాదేవశాస్త్రి మౌనంగా వింటున్నాడు.

"అమ్మ ఆకలిగా వుందే. తినడానికి ఏదైనా పెట్టమ్మా" బైటనుంచి వచ్చిన శివుడు అడిగాడు

"ఇప్పుడే కదరా జంతికలు పెట్టాను. ఇంతలోనే ఆకలేమిటి?"

"నువ్వు చెప్పినట్టే చేశా".

"అమ్మ ఏం చెప్పిందిరా?" మహాదేవశాస్త్రి కొడుకుని అడిగాడు.

"నాన్నా. మన గుమ్మానికి వరికంకులు కట్టాం కదా!".

"కట్టాం."

"కంకుల్లోంచి పిచ్చుకలు గింజలు తీసుకెళుతున్నాయిగా."

"పిచ్చుకలు కాక రాబందులు తీసుకెళతాయా?" అసహనంగా అరిచాడు.

"పిచ్చుకలు తీసుకెళ్లడమే కాదు. మిగతా పిచ్చుకలని కూడా తీసుకొస్తున్నాయిగా..."

"అంటే..."

"తన ఆకలే కాదు. పక్క పిచ్చుకల ఆకలి గురించి ఆలోచిస్తోందిగా..."

"దానికి, జంతికలకి సంబంధం ఏమిటి?"

"పక్కవాడి ఆకలి చూడాలని అమ్మ చెప్పింది. అందుకే నిన్న సాయంత్రం ఈరిగాడి కొడుకు లచ్చిగాడు ఆకలంటూ ఏడ్చాడు. తినడానికి ఇంట్లో ఏమీ లేవని వెంకమ్మ చెప్పింది. అందుకే అమ్మ ఇచ్చిన జంతికలు వాడికి ఇచ్చేసాను. వాడు నా ఫ్రెండ్..."

"నువ్వు ఇచ్చిన జంతికలతో వాడి ఆకలి తీరిపోతుందా?"

"కొంతైనా తీరుతుందిగా?" పిల్లవాడి సమాధానానికి ఆశ్చర్యపోయింది. పార్వతమ్మ మాటల నుంచి పాఠం నేర్చుకున్న శివుడు, ఆమె కళ్లకు ముల్లోకాలను చుట్టి వచ్చిన కుమారస్వామిలా కనిపించాడు. కొడుకుని మురిపెంగా దగ్గరకు తీసుకుని నుదుట మీద ముద్దాడింది. మహాదేవశాస్త్రి స్థాణువై నిలబడిపోయాడు.

పిచ్చుకల చప్పుడుకి గుమ్మం వైపు చూసాడు మహాదేవశాస్త్రి. పిచ్చుకలు కిచకిచమంటూ శబ్దం చేస్తూ, వరికంకుల్ని నోట కరుచుకుని ఎగిరిపోతున్నాయి.

ఆ క్షణంలో సంకుచితాలోచనతో మరుగుజ్జులా కనిపించిన తనని చూసుకుని సిగ్గుపడ్డాడు మహాదేవశాస్త్రి .

పిల్లాడికి సంస్కారం నేర్పిన పార్వతమ్మని చూస్తే గర్వంగా అనిపించింది. కర్తవ్యం తెలిసొచ్చింది.

"పార్వతీ, ఈరిగాడికి రెండు బస్తాలు ధాన్యం కొలిపించు. భద్రం కొట్లో నెలకి సరిపడే సరకులు తీసుకెళ్లమని చెప్పు. అలాగే పేరిశాస్త్రికీ. అవధాన్లూ మిగతా మనవాళ్లందరికి సరకులు, బియ్యం పంపించే ఏర్పాటు చేయి!" మాట చెప్పి సాయంవేళ సంధ్యావందనానికి పూజా మందిరంలోకి నడిచాడు మహాదేవ శాస్త్రి.

పార్వతమ్మ కళ్లకు కైలాసం నుంచి కదలి వచ్చి వరాలిచ్చే భోళాశంకరుడిలా కనిపించాడు, పూజగదిలోకి వెళుతున్న మహాదేవశాస్త్రి!

# కథామంజరి
# బాలకథ

# పూల వ్యాపారం

కథామంజరి బాలకథ

**ఎం. డి. అస్మీన్**

ఇంటర్ రెండవ సంవత్సరం



ఒకానొక ఊరిలో రామయ్య అనే వ్యక్తి ఉండేవాడు. అతడు పుట్టినిల్లు వదిలిపెట్టి నడుచుకుంటూ చిట్టడవి గుండా వేరొక ఊరికి వెళ్తున్నాడు. ఆ చిట్టడవి మధ్యలో అతడు ఒక అందమైన పూలచెట్టును చూశాడు. ఆ పూలచెట్టుకు ఎంతో సువాసన భరితమైన పూలు ఉన్నాయి. అవి చూడటానికి చాలా బాగున్నాయి. రామయ్య వాటిని తెంపుకొని, తన నెత్తికున్న రుమాలు తీసి వాటిలో మూటగట్టుకొని మళ్లీ నడవడం ప్రారంభించాడు.

ఇంతలో అశ్వంపై వేటకు వచ్చిన ఆ ఊరి మహారాజు రామయ్యకు ఎదురయ్యాడు. "ఏయ్ నీవెవరు, ఎక్కడికి వెళ్తున్నావు" అని మహారాజు రామయ్యను అడిగాడు.



"అయ్యా, నాపేరు రామయ్య. నేను మన రాజ్యంలోని వెంకప్ప గూడెంకు చెందినవాడిని. అక్కడ పనేమీ లేక పక్కూరుకు వెళ్తున్నాను!" అన్నాడు.

అప్పుడు రాజు "ఏమంటివి నా రాజ్యంలో చేయడానికి పని లేదా?" కోపంగా అన్నాడు.

"అయ్యా, మన రాజ్యంలో పని లేక కాదు. నేను ఇంతకముందు దొంగతనాలు చేసేవాడిని. నాకొక కూతురు ఉంది. ఆమెను నా మేనల్లుడికి ఇచ్చి పెళ్లి చేయాలని అనుకున్నాను. కానీ నా మేనల్లుడు, నేను దొంగతనాలు మానేస్తేనే నా కూతురిని పెళ్లి చేసుకుంటానని అన్నాడు. అందుకే నేను దొంగతనాలు మానేసి ఏదైనా పని చేయాలనుకున్నాను. కానీ నన్ను నమ్మి ఊరి వారెవరు పని ఇవ్వడం లేదు మహారాజా!" పశ్చాత్తాప పడుతూ అన్నాడు రామయ్య.

అప్పుడు మహారాజు రామయ్యకు ఏదైనా పని అప్పజెప్పాలని అనుకుంటాడు.

"సరే, నీ దగ్గరున్న ఆ మూటలో ఏమున్నవి?" అని మహారాజు రామయ్యను అడిగాడు.

"అయ్యా, ఇవి పూలు, అడవిలో కనబడితే కోసుకున్నాను!" అంటూ, రామయ్య తన దగ్గర ఉన్న పూలని చూపెట్టాడు.

"అరె.. ఈ పూలు చాలా బాగున్నవి. మంచి సువాసన వస్తున్నవి. నేను వీటిని ఇంతకుముందు చూడలేదు!" అంటూ మహారాజు ఆశ్చర్యపోయి, "నువ్వు వీటిని తీసుకెళ్లి అమ్ము, అవి అమ్ముడైన వెంటనే, మళ్లీ ఈ అడవికి వచ్చి పూలు తెంపుకొని వెళ్ళు!" అని మహారాజు రామయ్యకి సలహా ఇస్తాడు.

మహారాజు చెప్పింది విని రామయ్య ఆ పూలను సంతకు తీసుకెళ్లాడు. ఆ పూలు బాగుండడంతో అవి వెంటనే అమ్ముడు పోయాయి. రామయ్య ఆనందానికి అవధుల్లేవు. మళ్లీ తెల్లవారి చిట్టడవికి వెళ్లి పూలు తెచ్చి సంతలో అమ్మాడు. రామయ్య పూల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగింది. దొంగతనాలు మానేసి పూలు అమ్ముతూ నిజాయితీగా బతికాడు. కూతురికి వివాహం చేశాడు. తను మంచిగా బతకడానికి మార్గం చూపిన రాజుగారి వద్దకు వెళ్లి ధన్యవాదాలు తెలిపాడు రామయ్య.

# అడవిలో తపస్సు

కథామంజరి
బాలకథ

వసుంధర



✆ 9885620065

అనగా అనగా వికాస దేశం. ఆ దేశానికి రాజు అంబికేయుడు. ఆయనకు ఇద్దరు కొడుకులు. పెద్దవాడు పుళిందుడు సమర్థుడే కానీ కోపం, ఉక్రోషం, స్వార్థం వగైరా అవలక్షణాలున్నాయి. చిన్నవాడు భుజంగుడు సామర్థ్యంలో అన్నకు తీసిపోడు. పైగా లౌక్యుడు. అంబికేయుడి తర్వాత భుజంగుడే రాజైతే బాగుంటుందని చాలామంది అభిప్రాయం.

ఆ విషయం రాజుకి తెలుసు. ఐనా పెద్దకొడుకు కాబట్టి పుళిందుణ్ణి యువరాజుగా ప్రకటించాలనుకుని, ఆ విషయం మంత్రి చతురుడికి చెప్పి సలహా అడిగాడు.

రాజు నిర్ణయాన్ని ప్రశ్నించలేడుగా, అందుకని మంత్రి నెమ్మదిగా, "ప్రభూ! మన దేశంలో సంపంగి అనే నగరముంది. ఆ నగరానికి రాజప్రతినిధి గురవయ్య. ఆ నగరంలో విదురుడు అనే మేధావి ఉన్నాడు. నగరవాసులకి ఆయనంటే భక్తి, గౌరవం. గురవయ్య కూడా నగరపాలనకు విదురుడి సలహాలు తీసుకుంటాడు. అందువల్లనే సంపంగి, దేశానికే మేటి నగరంగా భాసిల్లుతోంది. తమరు గురవయ్య స్థానంలో, కొత్త రాజప్రతినిధిగా పుళిందుణ్ణి నియమించండి. విదురుడి సాహచర్యంలో పుళిందుడు నిగ్గు తేలతాడు. అప్పుడతణ్ణి దేశానికి యువరాజుగా ప్రకటిస్తే బాగుంటుంది" అన్నాడు.

రాజుకి మంత్రి సలహా నచ్చింది. వెంటనే పుళిందుణ్ణి పిలిచి, "నాయనా! దేశాచారం ప్రకారం నిన్నే యువరాజుగా ప్రకటించాల్సి ఉంది. ఐతే జనంలో నీకు మంచిపేరు లేదు. నీ పాలనలో అరాజకం ప్రబలి, ప్రజలు అష్టకష్టాలూ పడతారని అంతా అనుకుంటున్నారు. నీ తమ్ముడు భుజంగుడే, రాజు కావాలని వారి ఆశ! ఐతే తమ్ముడు కానీ, నేను కానీ.. నువ్వే రాజు కావాలని మనసారా కోరుకుంటున్నాం. అది నెరవేరాలంటే జనాలకి నీపై ఉన్న దురభిప్రాయం పోవాలి. అందుకు నీకో అవకాశం ఇస్తాను. సంపంగి గ్రామానికి రాజప్రతినిధిగా వెళ్లు. అక్కడ విదురుడనే మేధావి పర్యవేక్షణలో, చక్కగా నగరపాలన చేసి, జనాన్ని మెప్పించి మంచి పేరు తెచ్చుకో" అని చెప్పాడు.

రాజు ఇలాంటి ప్రస్తావన తెస్తాడన్న విషయాన్ని, రాణి పుళిందుడికి ముందే చెప్పి, "డబ్బు, అధికారం ఉంటే ఏంచేసినా చెల్లుతుందని నీ నమ్మకం. ఐతే నేను విదురుడి గురించి ఆరా తీశాను. ఆయన వద్ద నీ ఆటలు సాగవు. నీ పద్ధతి మార్చుకుంటే తప్ప ఆయన్ని మెప్పించలేవు" అని గట్టిగా హెచ్చరించింది.

ఐతే, తండ్రి చెప్పినట్లు చెయ్యకపోతే, అధికారం తనకు దక్కదన్న అనుమానం పుళిందుడికుంది. అందుకని, "మీ ఆజ్ఞ పాలించి సంపంగికి వెడతాను. నన్ను నేను నిరూపించుకుంటాను. కానీ విదురుడు అక్కడుంటే, ఆ ఘనత నాకు కాదు.. ఆయనకు దక్కుతుంది. నేనక్కడున్నంత కాలం విదురుడా నగరంలో లేకుండా చెయ్యండి!" అన్నాడతడాయనతో.

నిజానికి మంత్రి పుళిందుణ్ణి సంపంగికి పంపమన్నదే విదురుడి సాహచర్యం కోసం. ఐనా పుత్రవ్యామోహంవల్ల, రాజుకి మంత్రి సలహా కంటే, కొడుకు ఆలోచనే సబబుగా



తోచింది. ఆయన వెంటనే విదురుడికి కబురంపి రాజధానికి రప్పించి, “మహాశయా! అమ్మవారు నాకు కలలో కనిపించి త్వరలో సంపంగి నగరానికి గొప్ప అరిష్టం రానున్నదంది. సంపంగిని ప్రాణం కంటే ఎక్కువగా ఇష్టపడే నగరపౌరుడెవరైనా తన మకాం అడవికి మార్చి, అక్కడ తపస్సు చేస్తే ఆ అరిష్టం తొలగి పోతుందిట. ఆ తపస్సుకి తమకంటే తగినవారు లేరని నా అభిప్రాయం” అని వినయంగా చెప్పాడు.

దానికి విదురుడు, “ప్రభూ! నాకు అరవైఏళ్లు నిండాయి. పిల్లలు స్థిరపడి వేరే చోట ఉంటున్నారు. ఏడాది క్రితం నా భార్య గతించింది. అప్పట్నించీ ఒంటరిగా ఉంటున్నాను. ఐనా జనం మధ్య ఉంటేనే నాకు తృప్తి. కానీ సంపంగి నగరానికి మేలు జరుగుతుందంటే, నరకానికైనా వెళ్లడానికి సిద్ధపడే నాకు, అడవి ఓ లెక్కలోది కాదు. అడవిలో తపస్సు చెయ్యమన్న తమ మాటని శాసనంగా భావించి సంతోషంగా వెడతాను!” అన్నాడు.

రాజు సమీపారణ్యంలో చిన్న ఆశ్రమం కట్టించాడు. “నేను చెప్పేదాకా తమరు అడవిలోనే తపస్సు కొనసాగించాలి” అని మాట తీసుకుని ఆయన్ను అడవికి పంపాడు. ఆయన్ను సేవించుకుందుకు, కూడా ఓ భటుణ్ణీ, అతడి భార్యనీ పంపాడు.

తర్వాత రాజు గురవయ్యని రాజధానికి రప్పించి కొలువులో వేరే పదవి ఇచ్చాడు. పుళిందుణ్ణి సంపంగికి పంపాడు.

జనం మెప్పు పొందడానికి సత్ప్రవర్తన,

సత్కార్యాలకంటే, డబ్బు, ప్రచారం.. ఇవే ముఖ్యమని పుళిందుడి భావన. అతడు సంపంగికి వెళ్లేక నగరంలో పెద్దలందర్నీ కలిసి, వారిలో మెత్తటివారినీ, ప్రలోభాలకి లొంగేవారినీ గుర్తించాడు. కొందర్ని డబ్బుతో, కొందర్ని పదవులతో, కొందర్ని ప్రలోభాలతో తనవాళ్లని చేసుకున్నాడు. వాళ్లు అతడి గురించి గొప్పగా ప్రచారం మొదలెట్టారు. కొందరైతే అతణ్ణి దేవుడి అవతారమని కూడా అనేవారు.

ప్రతిభ అందరికీ ఉంటుంది. దాన్ని మంచివాళ్లు మంచికి, చెడ్డవాళ్లు చెడు పనులకి వాడి, అనుకున్నది త్వరగా సాధిస్తారు.

అధికారంలో కలకాలం నిలబడాలంటే డబ్బు బాగా సంపాదించాలనుకున్న పుళిందుడు, సామాన్యులపై పన్నుల భారం పెంచాడు. ఊళ్లో ప్రతి వ్యాపారంలోనూ వాటా అడిగాడు. అధిక పన్నుల్ని ఆ వ్యాపారాల అభివృద్ధికి వాడేవాడు. తనని పొగిడినవారిని కానుకలతో సత్కరిస్తూ, ఎదిరించినవారిని కారాగారంలో వేయించేవాడు.

ఏడాది తిరిగేసరికి ఊళ్లో అరాజకం నెలకొంది. కానీ పుళిందుడి అనుచరులు ఇంటా బయటా, నగరంలో, దేశవిదేశాల్లో అతడి పాలనని ఆకాశానికెత్తేస్తూ ప్రచారం చేస్తున్నారు.

అంబికేయుడికి చారుల ద్వారా సంపంగి నగరానికి సంబంధించిన వాస్తవాలు తెలుస్తున్నాయి. ఆయన రాణికి విషయం చెప్పుకుని, "సంపంగికి వెళ్లి మనవాడు ప్రయోజకుడౌతాడనుకున్నాను. కానీ అహంకారానికి అధికారమదం జతపడి, తనింకా దిగజారిపోయాడు. తను రాజైతే కనుక, వికాస దేశపు గతి ఏమౌతుందోనని కలవరంగా ఉంది!" అన్నాడు.

రాణి ఆయనతో, "మీది అనవసరపు భయం. మన పుళిందుడి పరిపాలన చక్కగా ఉన్నదని, దేశ విదేశాల్లో ప్రచారముంది. సంపంగి నగరం కూడా పూర్వం కంటే వైభవోపేతంగా ఉంటున్నదని వింటున్నాం. తను రాజైతే వికాస దేశం మరింత వికాసాన్ని పొందుతుందని నేను నమ్ముతున్నాను!" అంది.

"మరి చారులు చెబుతున్నది వేరేగా ఉన్నది కదా!" అన్నాడు అంబికేయుడు.

"చారులు తెచ్చేది రహస్య సమాచారం. దాన్ని రహస్యంగానే ఉంచుదాం. పుళిందుడి పరిపాలన అధ్వాన్నంగా ఉంటే, అవస్థలు పడేది జనం కదా! మరి వారు తిరగబడరేం? జనం తిరగబడలేదు కాబట్టి, సంపంగి నగరపాలన చక్కగా ఉన్నట్లు నమ్మొచ్చు. మనవాడి తరహా పాలనలో జనం తిరగబడరని ఋజువయింది కాబట్టి, మీరిక మనవాణ్ణి దేశానికి యువరాజుగా ప్రకటించొచ్చు. ఈ దేశపౌరులు సంపంగిపౌరులకి భిన్నంగా ఉంటారని నేననుకోను" అంది రాణి.

రాణి మాటలకి అంబికేయుడు తృప్తిపడి, త్వరలోనే పుళిందుణ్ణి యువరాజుగా ప్రకటించాలనుకున్నాడు.

ఇదిలా ఉండగా ఒక సాధువు హిమాలయాలకు వెడుతూ మార్గమధ్యంలో అడవిలో విదురుడుండే ఆశ్రమం వద్ద ఆగాడు. ఆయన విదురుడి కథ విని, "దుర్మార్గం మితిమీరినప్పుడు మంచివారిని కాపాడడానికి ఏదో శక్తి మనని శాసిస్తుంది. అంబికేయుడు నిన్నిక్కడకు పంపడం, నేను నిన్నిలా కలుసువడం అంతా దైవనిర్ణయం. ప్రస్తుతం సంపంగి నగరంలో అరాజకం నెలకొని, నగరవాసుల పరిస్థితి జంతువులకన్న ఘోరంగా ఉంది. సర్వసంగపరిత్యాగిని. నా శక్తులవల్ల ఎవరికీ ప్రయోజనం లేదు. అన్యాయాన్ని సరిచేసి, అమాయకుల్ని రక్షించడానికి సరిపడ అద్భుతశక్తి నీకిస్తాను. నువ్వు సంపంగికి వెళ్లి నగరవాసుల్ని ఆదుకుని జనాల్ని కూడగట్టుకో. నేనిచ్చే శక్తి దుష్టశిక్షణకు ఉపయోగపడదు. అందుకు జనబలం

కావాలి. ఐతే.. మాట తప్పక, నిస్వార్థంగా తపస్సు కొనసాగించినంత కాలం, నీ ఆశయసాధనకు అడ్డుండదు!" అన్నాడు.

అందుకు విదురుడు వెంటనే, "స్వామీ! నాకు కర్తవ్యబోధ చేసి, నన్ను శక్తిమంతుణ్ణి చేసినందుకు మీకు కృతజ్ఞుణ్ణి. ఐతే నేనిప్పుడు సంపంగి నగరానికెలా వెళ్లేది? ఎప్పటికీ అడవిలోనే ఉండిపోయి తపస్సు చేసుకుంటానని అంబరీకుడికి మాటిచ్చాను కదా!" అన్నాడు దిగులుగా.

"మాటెందుకు తప్పాలి? ఇప్పుడు పుళిందుడి అరాజకపాలనలో, సంపంగి నగరంలో, బలవంతులు బలహీనుల్ని వేధించే జంతు సంప్రదాయం నడుస్తోంది. అలా ఆ నగరం ఇప్పుడు అడవిగా మారిపోయింది. నువ్వు తపస్సుకి ఈ అడవి నుంచి ఆ అడవికి వెడుతున్నావంతే!" అన్నాడు సాధువు.

"మీరన్నది నిజమే! ఐతే చిన్న అనుమానం. సంపంగి నగరంలో పరిస్థితులు త్వరగానే చక్కబడొచ్చని తోస్తోంది. ఆ తర్వాత మళ్లీ నేను అడవికి వెళ్లిపోవాల్సిందేనా?" అన్నాడు విదురుడు దీనంగా.

"వెర్రివాడా! నువ్వు సంపంగికి చేరగానే పుళిందుడి ఆట కట్టవుతుంది. కానీ అంబరీకుడి పుత్రవ్యామోహాన్ని నువ్వు పోగొట్టలేవు కదా! పుళిందుడు యువరాజు కావడం తథ్యం. అప్పుడు వికాస దేశం మొత్తం అడవిగా మారిపోతుంది. ఒకోసారి ఒకో ఊరెళ్లి, జనం మధ్యనే ఉంటూ, నువ్వు తపస్సు చేసుకోవచ్చు. జనం తమ బలాన్ని ఉపేక్షించి, తమ రక్షణకు కేవలం నాయకుడి మీదనే ఆధారపడినంత కాలం, వికాస దేశంలో ఎక్కడో అక్కడ జనం మధ్య నువ్వు చేసే తపస్సు అడవిలో తపస్సుగానే చెల్లుబడి ఔతూంటుంది" అని చెప్పి తన దారిన వెళ్లాడు.

విదురుడు.. తనతో ఉన్న సేవకుడు, సేవికల్ని రాజధానికి పంపేసి, తాను సంపంగి నగరం దిశగా ప్రయాణమయ్యాడు.

# వర్ష చిలకలు

తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి



✆ 9440703440

## విశిష్ట అతిథి కథ

> *"నువ్వు ఉద్యోగంలో చేరు. ఏడాది తిరగకుండా పర్మనెంటు చెయ్యిస్తాను. మాకా సులువులు తెలుసు కదా. రెండో ఏడు తిరిగేసరికి నీతో స్థలం కొనిపిస్తాను. తరవాత నీకు ఓపిక ఉన్నప్పుడు నాలుగ్గదులు వేసుకో. నా మాట మీద నమ్మకం ఉంది కదా. కలట్రుగారు ఏదో చెప్తారు. దేశం గురించి నువ్వూ, నేనూ ఏవీ చేయలేం. పైగా వాళ్ళు ఏ ఊరు వెళ్తే అక్కడి మాటలు చెప్తారు. అంతా షో!"*

సుతారంగా కంటి అద్దాలు తీసి, తెల్లటి రుమాలుతో తుడిచి, అందమైన ఆమె కళ్ళకి తగిలించుకుంది ఛటర్జీ. చల్లటి గాజుపలక మీద ఆకుపచ్చటి పెన్ తీసుకొని, తెల్లటి ఆమె వేళ్ళ మధ్య తిప్పుతూ అందామె.

"ఏవంటారు, మీకిష్టమేనా?"

విశ్వనాథం నిజానికి ఆమె ప్రశ్న సరిగ్గా వినలేదు. ఆమె చేతిలో పెన్ను ఒక్కసారి ముట్టుకోవాలనిపించిందతనికి. గది చల్లగా ఉన్నా, అతనికి కాసేపు ఉక్కా, కాసేపు చలిగానూ ఉంది. మాట్లాడాలనిపించలేదు. అలా సాయంత్రం వరకూ, ముఖ్యంగా వచ్చీ రాని తెలుగులో ఇంగ్లీషు పదాలు కలిపి, కొంచెం ఆగుతూ, తల పంకిస్తూ, నున్నటి కనుబొమ్మలు అర్థవంతంగా కదుపుతూ ఆమె మాట్లాడుతుంటే వినాలని ఉందతనికి. ఆమె మాట్లాడుతున్నంతసేపూ అతని ఒంటిమీద సన్నజాజులు పడుతున్నట్టుంది.

"యెస్?" అందామె మళ్ళీ.

విశ్వనాథం తలూపాడు. చక్కగా, తెల్లగా నవ్వుతూ 'గుడ్' అందామె. ఇంతలో బంట్రోతు టీ తెచ్చేడు. తీసుకోమన్నట్టుగా ఆమె చెయ్యి ఊపి, కుర్చీలో వెనక్కు వాలింది. ప్రస్తుతం విశ్వనాథం, ఆమె చేత్తో కప్పు సైనైడ్ ఇచ్చినా కాదనే స్థితిలో లేడు.

"I am glad you are joining them" అనుపమ మళ్ళీ అంది. తాగుతున్న కప్పు టేబుల్ మీద పెట్టి, ఫైల్లో కాయితాలు వెదికి, రెండు టైప్ చేసిన అరఠావు కాయితాలు పైకి తీసింది. చదువుతూ, తల పంకిస్తూ అంది "రైట్, మీరు ఆరో నెంబర్ అవుతారు. తమిళ్నాడు నుంచి ఒకరు జాయిన్ అయ్యారు"

తల మళ్ళీ ఊపేడు విశ్వనాథం. కింది పెదవిని పంటికింద నొక్కుతూ భృకుటి ముడిచి, ఆలోచనలో పడింది అనుపమ ఛటర్జీ. చంటిపిల్లాడు ఏడ్చినట్టు ఫోన్ మోగింది. చిరు విసుగుతో ఫోన్ అందుకుందామె. ఐదు నిమిషాలు 'ఊ, ఊ' అంటూ

ఉండిపోయింది. ఎడంచేతి వేళ్ళు టేబుల్ మీద మెత్తగా దరువు వేస్తున్నాయి. ఆ చేతివేలికి చిన్న కెంపు పొదిగిన సన్నటి ఉంగరం. సన్నటి పొడుగాటి వేళ్ళకి ఎరుపురాయి ముద్దొస్తోంది. విశ్వనాథానికి మాట పూర్తిగా పడిపోయింది.

"సరే, రమ్మని చెప్పండి." ఫోన్ పెట్టేసింది ఛటర్జీ. సూటిగా విశ్వనాథం వేపు చూస్తూ "Why don't you come to my place this evening.. say around six?" అందామె.

"సరే మేడమ్"

నమస్కారం చేసి బయటపడి, లూనా మీద రోడ్డుకి కనీసం అడుగు ఎత్తులో ఇంటికి చేరేడు విశ్వనాథం. ఇంటికి చేరడం, మామూలు థర్మామీటర్లు చూపించలేని నూటారు డిగ్రీల జ్వరంతో చేరేడతను. లోపలికి అడుగు పెట్టగానే, విశ్వనాథం తండ్రి ఎదురయ్యేడు.



"ఏమైందిరా?"

లోకంలోకి అడుగుపెట్టిన తరవాత, మొట్టమొదటి మనిషిని చూసినట్టు చూశాడు విశ్వనాథం. ఒక్కక్షణం ఆయన దేని గురించి అడుగుతున్నాడో అర్థం కాలేదు.

"ఏం లాభం లేదందా? సుబ్బారావు మాట్లాడతానన్నాడే!" విశ్వనాథం తల్లి కూడా వచ్చింది.

"వాణ్ణి కాస్త ఊపిరి తీసుకోనివ్వండి, రాగానే..."

విశ్వనాథం కుర్చీలో కూచున్నాడు. ఎదుటి కుర్చీలో తండ్రి. ఏం చెప్తాడోనని తల్లి అతని వేపే చూస్తోంది.

"సాయంకాలం రమ్మన్నారు" అన్నాడతను.

"అంటే ఇస్తాననా, ఇవ్వననా? నువ్వావిడతో సరిగ్గా మాట్లాడేవా అసలు?"

"ఆ"

"మరి సాయంత్రం ఏంటి?"

"ఏమో, ఇంటికి రమ్మన్నారు"

వెంటనే ఆయన ముఖంలో నవ్వొచ్చి పడింది. భార్య వైపు చూస్తూ అన్నారాయన "కలక్టర్ ఇంటికి రమ్మందంటే వీడికి ఇచ్చే ఉద్దేశం ఉందన్నమాట. ఏరా, నువ్వు బాగానే మాటాడేవా, సబ్ కలక్టరంటే రేపో మాపో కలక్టరౌతుంది ఏమనుకుంటున్నావో!"

విశ్వనాథం నవ్వేడు ఆమె జ్ఞాపకం వచ్చి.

"సరే. ఠంచన్‌గా ఆవిడ చెప్పిన టైముకి వెళ్ళు. చెప్పులు బయట వదిలి, లోపలికి వెళ్ళాలి."

నిజానికి ఇప్పుడే వెళ్ళి, ఆమె బంగాళా ముందున్న వేపచెట్టు కింద సాయంకాలం వరకూ కూచోవాలని ఉంది విశ్వనాథానికి. కొత్త జీవితానికి దారి చూపించిన దేవతలా తప్ప, మామూలు బెంగాలీ స్త్రీలా అతనికి కనిపించడంలేదు. ఆమె చిరునవ్వులో ఎంత హుందాతనం, వెలుగూ ఉన్నాయి! విశ్వనాథం తను చూసిన బంధువుల స్త్రీలనందర్నీ జ్ఞాపకం చేసుకొని పరిశీలించాడు. ఆవకాయబద్ద చీకడానికి తప్ప ఏ స్త్రీ మూతీ ఎందుకూ పనికిరాదనిపించిందతనికి.

"ఊ, ఇంకేవంది?

"ఏవుంది, మామూలే. నా సరిఫికెట్లు చూసింది. స్పోర్ట్స్ గురించి అడిగింది. ఏవో అవే."

"ఇచ్చే ఉద్దేశం లేకపోతే అవన్నీ ఎందుకు మాటాడుతుందిలే. కలెక్ట్రంటే ఎంత పవరుంటుందో తెలుసా? ఇంకా ఇప్పుడు నయం. దొరలున్నప్పుడు కలక్టర్లంటే మహారాజులన్నమాట! ఆ ఠీవీ, దర్జా... ఎంత భయభక్తులతో ఉండేవాళ్ళమనుకున్నావు? అగ్గగ్గలాడిపోయేవాళ్ళం. బాగా పనిచేస్తే మెచ్చుకోలూ ఉండేది. కాంప్‌బెల్ అని ఓ కలెక్ట్రుండే వాడు. వాడితో ఓసారి అన్నవరం కేంపు కెళ్ళేం. మా అమ్మ మామూలుగా పెరుగూ అన్నం, ఒక ఆకులో దోసావకాయా పొట్లం కట్టిచ్చింది. సరిగ్గా భోజనానికి కూచోబోతుండగా, అలా ఒచ్చేడ్రా దొర. దోసావకాయ చూసి 'వాటీజ్ దిస్' అన్నాడు. 'పికిల్సార్' అన్నాను నేను. కొంచెం రుచి చూపించమన్నాడు. ఇహ తరవాత ఎంత మెచ్చుకున్నాడనుకున్నావు! 'కోటీశ్వర్రావూ ఇహ దొర నిన్నొదల్డోయ్' అనేవాళ్ళు మావాళ్ళంతా!"

"ఆ దిక్కుమాలిన దోసావకాయ పురాణం కాపురానికొచ్చినప్పటునుండీ చెప్తూనే ఉన్నారు!"

"నీ మొహం, అసలెప్పుడైనా దొర మొహం చూస్తే నీకు తెలిసుండేది!"

కానీ, విశ్వనాథం కోటీశ్వర్రావుగారి మాట ఒక్కటీ వినలేదు. అతని కళ్ళముందు మాత్రం పెద్ద తులాభారం. ఒకవేపు, నూట ఇరవైరెండు కాంప్‌బెల్లులూ, మరోవేపు అనుపమ ఛటర్జీ కూచుని కనిపించేరు. కలెక్టర్లు కూచునే వేపు ఆకాశంలో ఉంది.

లుంగీ చుట్టుకొని, వరండాలో మంచం మీద పడుకొని, కళ్ళు మూసుకున్నాడు విశ్వనాథం. అనుపమ మాటలు మంత్రంలా పనిచేస్తున్నాయతని మీద.

కోటీశ్వర్రావుగారు తాలూకాఫీసులో పనిచెయ్యకపోయినా, ఆయన బాల్యస్నేహితుడి కొడుకు ప్రస్తుతం సబ్‌కలెక్టరాఫీసులో పనిచెయ్యకపోయినా, నిన్న భార్య సాధింపు భరించలేక, బజారెళ్లి అతన్ని కలవకపోయినా, విశ్వనాథం అలా నాలుగు లీటర్ల రెడ్‌వైన్ తాగినట్టు మంచానికి అతుక్కుపోయేవాడు కాదు. నిన్న బజార్నుంచి చాలా వేగంగా వచ్చేరు కోటీశ్వర్రావుగారు.

"వీడేడీ?" గుమ్మంలోంచే అడిగేరాయన.

"నాకేమైనా చెప్పి వెళ్తున్నాడా?"

"వెధవ తిరుగుళ్లూ వీడూనూ, సరే సంచి తీసుకో"

విశ్వనాథం ఎనిమిదయ్యేసరికి ఇంటికొచ్చేడు. అతను బీ.కాం. మంచి మార్కులతో పాసయ్యేడు. ఉద్యోగ ప్రయత్నాలు ప్రారంభమయ్యేయి. గత నాలుగునెలల్నుంచీ తండ్రి ప్రోత్సాహ సాధింపులతో టైపూ షార్టుహేండూ నేర్చుకుంటున్నాడు.

ఇంట్లోకి అడుగు పెడుతుండగానే ప్రారంభించేడాయన. "సబ్ కలెక్టరాఫీసులో కొన్ని తాత్కాలిక ఉద్యోగాలు భర్తీ చేస్తున్నారట. (సుబ్బారావు మనం గనుక రహస్యంగా చెప్పేడు) ఆరునెల్లనుంచి, ఏడాదివరకూ ఉంటాయి. (పర్మనెంటూ అవ్వొచ్చు)."

విశ్వనాథానికి పల్లేరుకాయ నమిలినట్టనిపించింది. ఏ బేంక్ ఉద్యోగవో, లేకపోతే హైదారాబాద్‌లో ఏదో ఒక ఉద్యోగం సంపాదించి వెళ్లిపోదామని అతని ఆశ.

"రేపు మంచిరోజే. అప్లికేషన్ రాసి సబ్ కలెక్టరు గారి దగ్గరకెళ్లు. ఎవరో ఆడకలెక్టరు, మలయాళీయో, బెంగాలీయో. కాస్త జాగ్రత్తగా, తెలివిగా మాట్లాడిరా."

తలూపి వెళ్లిపోయాడు విశ్వనాథం. మర్నాడు అప్లికేషన్ రాసి, తండ్రికి ఐదుసార్లు చదివి వినిపించి (ఐ రెమైన్ యువర్ మోస్ట్ ఓబిడియంట్ సర్వేంట్") మొత్తానికి స్వహస్తాలతో టైప్ చేసి, పదకొండు గంటలకల్లా సబ్ కలెక్టర్ ముందు హాజరయ్యాడు. తన పేరున్న చీటీ ఆమె వేళ్ల మధ్య రెపరెపలాడుతోంది. చిరునవ్వు నవ్వి, కూచోమందామె. మూడు క్షణాల తరవాత, తానెందుకు వచ్చాడో సరిగ్గా జ్ఞాపకం లేదతనికి. ఆమె జ్ఞాపకం చేసింది. అతని సర్టిఫికెట్లు చూస్తూ, బాస్కెట్‌బాల్ ఛాంపియన్షిప్ సర్టిఫికెట్ చూసి 'I see' అంది.

"బాస్కెట్ బాల్ అంటే చాలా ఇష్టం నాకు" అందామె. తరవాత జిల్లాలో పేరున్న ఆటగాళ్ల వివరాలడిగింది. "కాలేజీలో ఆడేదాన్ని."

ఆమెతో చదువుకున్నవారి కంటే ఈ ప్రపంచంలో అదృష్టవంతులెవరూ లేరనిపించిందతనికి.

"OK, lets talk. మీకీ ఉద్యోగం అవసరమా?" అని ప్రారంభించి, ఉద్యోగాల గురించీ, యువకుల ఆదర్శాల గురించీ చిరునవ్వుల నగిషీలు చెక్కిన వాక్యాలతో అనుపమ ఛటర్జీ మాట్లాడింది. విశ్వనాథం ముందొక కొత్త ప్రపంచం ఆవిష్కరించిందామె.

"ఇటువంటి చిన్నఉద్యోగంలో కూరుకుపోయేకంటే, స్టేట్ గాని, సెంట్రల్ సర్వీసెస్‌కి గాని మీరెందుకు ప్రయత్నించరు? మీలాంటి యువకులు ప్రభుత్వానికి అవసరం. నిజాయితీ, ఆదర్శాలూ గల వ్యక్తులు దేశానికి అవసరం. యూ మస్ట్ హావ్ ఏంబిషన్. జీవితానికి ఒక ఐడియల్ ఉండాలి. అందులో మీరు స్పోర్ట్స్‌మ్యాన్ కదా. స్పిరిట్ ఆఫ్ కాంపిటీషన్ జీవితంలో ఉండాలి. చిన్న ఒత్తిడికీ, కష్టాలకీ లొంగిపోతే జీవితం ఏం కావాలి? ప్లీజ్ థింక్ ఎబౌట్ థ కంట్రీ ఆల్సో! మీకు కావలసినదల్లా చొరవా, యాంబిషన్.. ఏవంటారు? కష్టపడితే మీరు సాధించగలరు. ఇట్ ఈస్ లైక్ విన్నింగ్ ఆఫ్ గేమ్. వర్క్ హార్డ్ మిస్టర్ విశ్వనాథం, యు కెన్ డూ ఈట్!"

విశ్వనాథానికి భుజాల్లోనుంచి రెక్కలు పుట్టుకొచ్చినట్లైంది. ఏవో విద్యుదయస్కాంత తరంగాలు అతన్ని భూకక్ష్య లోనుంచి వెలుపలికి లాగేసాయి. స్తోత్రం విన్న ఆంజనేయుడిలా అయిపోయాడు. ఎన్నడూ కలగనంత ఉత్తేజం కలిగిందతనికి. తండ్రిగాని, పెదనాన్నగాని, స్నేహితులు గానీ ఎవరూ ఎప్పుడూ అతనికి జీవితానికి సంబంధించిన ఈ మౌలిక అంశాల గురించి చెప్పలేదు. చిన్నప్పుడు దీపావళికి తిప్పిన ఉప్పుపొట్లం జ్ఞాపకం వచ్చిందతనికి. నిప్పురవ్వలు చిమ్ముతూ, ఒక వలయాన్ని తానే ఏర్పాటు చేసుకున్నాడు. జీవితానికి ఇన్ని రంగులున్నాయని గాని, మహత్తు ఉందనిగాని అతనికి తెలియదు. ముఖ్యంగా తన జీవితాన్ని మలచుకోవడంలో ఎవరి సహాయం అక్కర్లేదని తెలియడం గొప్ప ఆనందంగా ఉందతనికి!

"ఆఫ్ కొరస్ మీరు కాదంటే మీకీ ఉద్యోగం ఇవ్వడానికి ప్రయత్నిస్తాను. ఈట్ ఇస్ నాటే ప్రాబ్లం. కానీ, రెండ్రోజులు ఆలోచించి నిర్ణయానికి రండి. ఏ హోల్ లైఫ్ ఇస్ బిఫోర్ యు."

బలంగా తలూపేడు విశ్వనాథం.

"ఓహ్ ఐ ఫర్గాట్" అంది అనుపమ. "మంచి టైముకి వచ్చేరు. మీకో గొప్ప అవకాశం ఇవ్వగలను. సొరుగులోనుంచి ఒక ఉత్తరం తీసి ఇచ్చిందామే. కేరళ నుంచి నలుగురు యువకులు మోటార్ సైకిళ్ల మీద ఢిల్లీ వరకూ యాత్ర చేస్తున్నారు. దేశ సమైక్యతా, మతసహనం యాత్ర ఆదర్శం. తమిళనాడులో ఒక యువకుడు కలుస్తున్నాడు. ఆంధ్రదేశం నుంచి ఎవరైనా చేరితే బాగుంటుందనీ, ఎప్పుడు వెనక్కి రావాలనిపించినా వచ్చెయ్యొచ్చనీ దాని సారాంశం.

"ఏవంటారు, మీకిష్టమేనా?"

తల ఊపేడు విశ్వనాథం.

"గుడ్! ఇది గొప్ప అనుభవం. దేశాన్ని చూడ్డం, అనేకమందిని కలుసుకోవడం, కష్టసుఖాలు తెలుసుకోవడం, ఇదంతా మాటల్లో చెప్పలేని అనుభవం. మీరు జన్మలో ఈ అడ్వెంచర్‌ని మరచిపోలేరు. యు విల్ ఫీల్ యు బిలాంగ్ టు ఆ బిగ్, గ్రేట్ కంట్రీ. ఈ వ్యత్యాసాలన్నీ పైకి కనబడేవే. అయితే మీకు వెహికల్, కొంత మనీ ఏర్పాటు చేస్తాను."

మధ్యలో ఎప్పుడో కునుకు పట్టింది. చటుక్కున మెళుకువ వచ్చి చూస్తే, మూడున్నర అయింది. విశ్వనాథానికి ఒళ్ళు మండిపోయింది. ఇక ఇవాళ సాయంత్రం అవుతుందన్న నమ్మకం పోయిందతనికి. చివరికి సూర్యుడాయన దారిన ఆయన పోగానే స్నానం చేసి, చంకల్లో కొంచెం ఎక్కువ పౌడర్ వేసుకొని, రోడ్డు మీద నడిస్తే, దుమ్మూ ధూళీ పడుతుందని, రిక్షా ఎక్కి సబ్ కలెక్టర్ బంగళాకి వెళ్ళేడు విశ్వనాథం.

చీకటి పడింది. పున్నాగపూలు అనుపమ చిరునవ్వు మల్లే, కమ్మటి వాసనలు వెదజల్లుతున్నాయి. పొడవాటి వరండా చివర తెల్లబట్టల్లో బంట్రోతు. ఎక్కడో పిట్ట అరుపు తప్ప, అంతా నిశ్శబ్దంగా ఉంది. ట్యూబులైటు వెలుగులో ఫేన్ కింద ఏవో కాయితాలు చూసుకుంటుంది అనుపమ. లోపలికి రాగానే మొహం తిరిగి పడిపోయినంత పనైంది విశ్వనాథానికి. కనకాంబరం రంగు చుడీదార్, దుపట్టా.. తెలుపూ, ఎరుపూ కలిసిన పువ్వులా ఉంది అనుపమ. గ్లాసుడు చల్లటి నీళ్ళు తాగేడతను. అతను టీ తాగుతుండగా కాయితాలు చూసేసి, పక్కన పెట్టి, టీ కప్పు అందుకుందామె.

"సో?"

"నేను కూడా వెళ్తాను మేడం"

"గ్రేట్. ఐ విల్ మేక్ థ అరేంజ్మెంట్స్. మీరు మళ్ళీ ఆఫీసులో ఒచ్చేవారం కలవండి."

"యెస్ మేడం"

"ఒకె థెన్. ఐ థింక్ ఐ యం టైర్డ్!"

బయట పున్నాగచెట్టు కింద కాసేపు నిలబడి, గుండె నిండా తియ్యటి గాలి పీల్చుకొని, రోడ్డు మీదకి నడిచేడు విశ్వనాథం. తిన్నగా పార్కుకి వెళ్ళి, బెంచీ మీద పడుకొని, రెండు సిగరెట్లు కాల్చేడు. తను కష్టపడితే సబ్ కలక్టర్ కావడం ఖాయం.

విశ్వనాథం ఇంటికి చేరేసరికి 8:25 అయింది. 8:39 వరకూ కోటీశ్వర్రావుగారు దాదాపు అపస్మారక స్థితిలో కొడుకు మాటలు విన్నారు. 8:41కల్లా ఇంట్లో దాదాపు బాగా దగ్గర వాళ్లు పోయిన వాతావరణం ఏర్పడింది. 9:20 నుండి 9:28 వరకూ కోటీశ్వర్రావుగారు కొడుకుని తిట్టేరు. ('ఇంక నువ్వు బాగుపడడం కల్ల'). ఆయన రెండు మెతుకులు తిని అన్నగారింటికి వెళ్లిపోయేరు.

"ఇలా చేసుకొచ్చేవేవిరా నాయనా?" అంది విశ్వనాథం తల్లి.

"నేనేం చేసేనే? యాత్రలో వెళ్తే ఎంత మంచిదో నీకేం తెలుసు?" తల్లికి యాత్ర గురించీ, తన ఆశయాల గురించీ వివరించేడు. అంతా విని అన్నదామె.

"అవన్నీ మనకెందుకురా? ఎక్కడుంటావో, తిన్నావో తినలేదో, ఈ జొరవో ఒస్తే చూసే దిక్కుండదు. ఆ వెధవ సైకిళ్ల మీద

అంత దూరం వెళ్లకపోతేనేం? కూటికా గుడ్డగా?" ఆవిడ కళ్ళొత్తుకుంది.

"ఏదో కొంప మునిగిపోయినట్టు మాటాడతారేం? నేనేం దేశాలు పట్టి పోతున్నానా? నెలరోజుల్లో తిరిగొస్తాం."

"నీకేం నాయనా అలాగే ఉంటుంది. నాన్న పెద్దవారైపోయారు కదా, కడుపులో చల్ల కదలకుండా ఇక్కడే ఏదో చిన్నో, పెద్దో ఉద్యోగం చూసుకోవాలి గాని, ఇవేం పన్లు నాయనా? ఉట్టి కెక్కలేనమ్మ సొర్గానికెక్కిందనీ, మరీ పెద్ద పోకడలు పోకూడదు. ఆవిడకేం.. ఎన్నన్నా చెప్తుంది. ఎక్కడ ఉద్యోగం ఇవ్వాలో అని నీకు బాగా నూరిపోసింది. నీకేనా తెలియాలా? ఇంకోళ్ళ దగ్గిరైతే బాగా డబ్బు గుంజి, ఉద్యోగం వెయ్యిస్తుంది. ఆ హిందీ ముండల్ని నమ్మడానికి వీలులేదు."

"హిందీ కాదు, బెంగాలీ. అయినా ఆవిడ లంచాలు తినే బాపతు కాదు. నా మంచి గురించే చెప్పింది. ఇష్టం లేకపోతే ఉద్యోగం ఇస్తానంది."

"ఆ ముక్క అందా! మరేం, ఉద్యోగం ఇవ్వమని అడక్క ఈ తిక్కమాటలు ఎందుకురా? నన్ను ఏడిపించకు నాయనా."

"అంటే నాకేం తెలీదంటావా?"

ఆలస్యంగా వచ్చేరు కోటీశ్వర్రావుగారు. భార్యతో ఏదో గుసగుసలాడేరు.

మర్నాడంతా తండ్రీ కొడుకులేమీ మాట్లాడుకోలేదు. కోటీశ్వర్రావుగారు వేడెక్కిన ఇంజన్లా ఉన్నారు. విశ్వనాథం రెండుమెతుకులు తిని బయటకుపోయి, బాగా పొద్దు పోయే వరకూ ఇంటికి రాలేదు. అతని ఉత్సాహం చాలా వరకూ నీరుగారిపోయింది. సబ్ కలక్టర్ కావడం అంతా సులభం కాదని తేలిపోయింది. మోటార్ సైకిల్ మీద దేశాన్ని చూసి, పెద్ద విజేతలా వెనక్కి వచ్చి, అనుపమా ఛటర్జీ చిరునవ్వు గెలుచుకొని, ఐఎఎస్ రాద్దామనుకున్నాడు. మొదటిసారిగా అతనికి జీవితం మీద రుచీ, కొత్త దృక్పథం ఏర్పడ్డాయి. ఇంట్లో గొడవలెందుకో అతనికి అర్థం కావడం లేదు.

రాత్రి ఇంటికి వచ్చేసరికి వరండాలో సిగరెట్ కాలుస్తూ పెదనాన్నా, సుబ్బారావూ, తండ్రీ కనిపించేరు. క్షణంసేపు తటపటాయించేడు విశ్వనాథం. అతన్ని చూడగానే కేకేసేడు పెదనాన్న.

"ఏరోయ్, దా... దా. షికారెళ్ళి వచ్చేవేమిటి?" అడిగేడు సుబ్బారావు. చూచాయగా వ్యూహం తెలిసిపోయింది విశ్వనాథానికి!

ఆ కబుర్లూ, ఈ కబుర్లూ తప్ప అసలు విషయం ప్రస్తావించక పోవడంతో విశ్వనాథం కాస్త తేలిక పడ్డాడు. కాసేపటికి 'ఇప్పుడే వస్తానంటూ' లోపలికి వెళ్లేరు కోటీశ్వర్రావుగారు.

"ఊ ఏవంటోందయ్యా మీ బాసు?" అన్నాడు సుబ్బారావు. కాస్త ప్రాణవాయువు సోకినట్టైంది విశ్వనాథానికి. అతని మాటలన్నీ ఓపిగ్గా విన్నారిద్దరూ. మధ్యలో ఏదో అడుగుతూ, నవ్వుతూ విశ్వనాథాన్ని ఇంటి కక్ష్యలోకి తీసుకొచ్చేరు. కొత్త సిగరెట్ వెలిగిస్తూ "ఏంటో సైకిల్ యాత్ర అంటాడేమిట్రా మీ నాన్న?" అన్నాడు పెదనాన్న.

ఉత్సాహంగా చెప్పేడు విశ్వనాథం. అంతే ఉత్సాహంగా విన్నారిద్దరూ. అంతా విని పెదనాన్నడిగేడు "మరేం చేద్దామనుకుంటున్నావు?" అని.

ఆయన తన పక్షం అని అర్థమైందతనికి. వెడదామనుకుంటున్నానన్నాడు. తల ఊపి, అనునయంగా, గంభీరంగా అరగంట

మాట్లాడాడు పెదనాన్న. "నువ్వన్న దానిలో తప్పేమీ లేదు. కాస్త నాలుగు ఊళ్లూ నీ వయసులోనే తిరగాలి. కలక్టరవడం కంటే అదృష్టం ఏవుందీ! ఒరే నువ్వు కూడా నా కొడుకువే, అనుభవంతో చెప్తున్నాను. అర్ధం చేసుకో. పరుగెత్తి పాలు తాగడం కంటే, నుంచుని నీళ్ళు తాగడం నయమని మన పెద్దలెందుకు అన్నారంటావ్? కొన్ని విండానికి బావుంటాయి. ఆ సైకిల్ యాత్రలో మన ఖర్మ కాలి, ఏ ప్రమాదమో జరిగిందనుకో, మీ అమ్మ మనకి దక్కదు. నాన్నంటావా గుండె రాయి చేసుకుంటాడు. కీడెంచి మేలెంచమన్నారు దేనికైనా! అవునా?"

సుబ్బారావు అందుకున్నాడు.

"మరీ ఈ మధ్య రోడ్డు ప్రమాదాలు ఎక్కువైపోతున్నాయి. వెధవలు తాగి లారీలు తోలడం, మనుషుల్ని చంపడం. పైగా హిందూస్తానీ లారీవాడైతే మరీ ఘోరం. గుద్దెయ్యడం, వెళ్లిపోవడం. మన రాత బాగోలేకపోతే ఏం చేయగలం? పైగా నానా నీళ్లూ తాగి, అడ్డమైన తిళ్లూ తిని ఆరోగ్యం చెడితే ఇంకేమైనా ఉందా? నిన్ను ఏ గవర్నమెంట్ ఆస్పత్రిలోనే పడేసి, వాళ్ళు చక్కా పోతారు. అంటే అలా జరుగుతుందని కాదు, అయినా ఇహ టెలిగ్రాములూ, మీ నాన్న అక్కడికి పరిగెత్తి..... పాపం ఈ వయసులో ఆయన్ని క్షోభ పెట్టడం నీకేం సబబు?'

పెదనాన్న అన్నాడు. "పెద్దవాణ్ణి నే చెప్పేది జాగ్రత్తగా విని రాత్రి ఆలోచించు. మనకేం ఉందిరా? మీ నాన్నా నేనూ చిన్నతనంలోనే ఉద్యోగాల్లో ప్రవేశించి కష్టపడి సంసారాలు ఈదేం. పొలవా, పుట్రా... దేవుడుండబట్టి ఏదో చెరో కొంపా కట్టుకున్నాం. చదువులు చదివించేం. ఈ ఐఎఎస్‌లూ అవీ మంచివే, కాదన్ను. కానీ మనవెంతరా? కళ్ళలో ఒత్తులు వేసుకు చదివినా మన కర్మకాలి రాలేదనుకో, తట్టుకోగలవా? పైగా కుర్రతనం. నీకు తెలీదు. ఈ పరీక్షలన్నీ శుద్ధ మోసం. ప్రతీ పీనుగా లంచాలు మరిగి, పేపర్లమ్మేసి పాస్ చెయ్యిస్తారు. ఆ లంచాలూ ఇవ్వలేం, ఆ మోసాలూ చేయలేం."

"కష్టపడి చదువుతాను" నసిగేడు విశ్వనాధం.

"నిజమే, కానీ మన రాత ఎలా ఉందో? దాన్ని మార్చడం నీవల్లా, నావల్లా అవుతుందా? మీ నాన్నకి నువ్వంటే ప్రాణం. అందరి కంటే చిన్నవాడివి కదురా. పాపం వాడు నువ్వేదో త్వరగా ఉద్యోగంలో చేరతావనీ, ఏదో మురిసి పోతున్నాడు. చిర్రుబుర్రులాడబోకు, వాడికి నువ్వంటే ఎంత ఆపేక్షో ఆలోచించావా?"

విశ్వనాథానికి దరిదాపు కళ్ళు చెమర్చేయి. తండ్రికి తను ఏదో ద్రోహం తలపెట్టానన్న భావం మనసులో పడింది.

"ఉద్యోగంలో చేరి, ఒక నెల సెలవు పారేసి, అలా కాశీ వరకూ వెళ్ళిరా. ఎవడు కాదంటాడో చూస్తాను. నేనే ఎక్కిస్తాను రైలు. సరే పెళ్లి చేసుకొని పెళ్ళాంతో వెళ్లావో, మరీ బాగు."

"హనీమూన్" అన్నాడు సుబ్బారావు.

సిగ్గుపడ్డాడు విశ్వనాథం.

"ఒరే ఆ ఉద్యోగంలో చేరు. కాళ్ళూ కడుపులూ పట్టుకొని పర్మనెంట్ చేయించే పూచీ నాది. హాయిగా ఉన్న ఊళ్ళో ఉద్యోగం. ఏదో ఇల్లు ఉంది. మహారాజులా గడిచిపోతుంది. మన కుటుంబాల్లో కలిసిపోయే సంబంధం చూసి, పెళ్లి నే బతికుండగానే చేసేస్తాను. నువ్వు రిటైరయ్యేనాటికి కొడుకులు అంది వస్తారు. మనకి ఉన్నంతలో ఉండడం నేర్చుకోవాలి.... అదీ! రేపు

అన్నవరం వెళ్ళి స్వామివారికి జుట్టు ఇచ్చిరా. దరిద్రం వదిలిపోతుంది.'' సుబ్బారావు నవ్వుతూ అన్నాడు.

“బాగా చెప్పేరు. దేవుడు తలంచుకుంటే ఇహనేం కావాలి? విస్సూ.. నువ్వు నా చిన్నతమ్ముడిలాంటి వాడివి. దేవుడిమీద ఒట్టేసి నీకు మాటిస్తున్నాను. నువ్వు ఉద్యోగంలో చేరు. ఏడాది తిరగకుండా పర్మనెంటు చెయ్యిస్తాను. మాకా సులువులు తెలుసు కదా. రెండో ఏడు తిరిగేసరికి నీతో స్థలం కొనిపిస్తాను. తరవాత నీకు ఓపిక ఉన్నప్పుడు నాలుగ్గదులు వేసుకో. నా మాట మీద నమ్మకం ఉంది కదా. కలట్రుగారు ఏదో చెప్తారు. దేశం గురించి నువ్వూ, నేనూ ఏవీ చేయలేం. పైగా వాళ్ళు ఏ ఊరు వెళ్తే అక్కడి మాటలు చెప్తారు. అంతా షో! నీలాంటి అమాయకుడు పదిమందితో అంటాడా అనడా? ఆమెకి మంచి పేరొస్తుంది. ఇవన్నీ ఎన్ని చూశానంటావు?''

“బంగారంలాంటి మాటన్నావు రా. వాళ్లకవన్నీ ట్రెయినింగ్ లోనే చెప్పి పెడతారు. లేకపోతే ముక్కూ మొగం తెలియని నీమీద ఆమెకేవిటీ?'' అన్నాడు పెదనాన్న.

మరో గంటసేపు ఉండి, వెళ్లిపోయారిద్దరూ.

రాత్రంతా విశ్వనాథం తల్లి ముక్కు ఎగబీలుస్తూ, కళ్ళు తుడుచుకుంటూనే ఉంది.

విశ్వనాథం ఉద్యోగంలో చేరేడు.

సుబ్బారావు స్థలం కొనిపించేడు.

ఆరేళ్ళ తరవాత విశ్వనాథానికి కొంచెం పొట్ట వచ్చింది.

అప్పటికే పెళ్ళయి రెండేళ్ళు దాటింది. ఒక కూతురు.

అన్నవరం వెళ్ళి గుండు గీయించుకున్నాడు.

ఇప్పుడతను మెల్లిగా నడుస్తాడు.


ఆఫీసు పనులు మెల్లిగా చేస్తాడు.

మెల్లిగా మాట్లాడతాడు.

అతను ఉద్యోగంలో చేరిన ఏడాదే అనుపమ ఛటర్జీ బదిలీ అయి వెళ్లిపోయింది. రెండేళ్ల తరవాత ఆమె ఎవరో మలయాళీ చిత్రకారుడ్ని పెళ్లి చేసుసుకుందని తెలిసింది.

టైపిస్టుతో అన్నాడు విశ్వనాథం...''వీడెవడో బంగారుబాతులాంటి పెళ్లాన్ని సంపాదించేడ్రా'' అని!

*(ఆహ్వానం, ఏప్రిల్ 1994 సంచిక నుంచి నుంచి పునర్ముద్రణ)*



# ఒసే తువ్వాలు అందుకో

## శ్రీరంగం శ్రీనివాసరావు

**కథా మార్గదర్శి కథ**

***"ఒసే వంటయిపోతే వడ్డించు."***
***"మీ స్నానం అయిందా?"***
***'అయినట్టే.'***
***"నా వంటకూడా అయినట్టే."***
***పెడసరపు జవాబులు. స్కూలు ఫైనలుదాకా చదివానని దీని గర్వం. ఆడవాళ్ళకి చదువు అవసరమే కాదు. హానికరం. అయిదో క్లాసు దాకా చదివిస్తే చాలు.***

'ఆహా....ఏమి...నా....ఆ...ఆ.. భాగ్యము...' పాడుతూ స్నానాలగదిలో ప్రవేశించాడు. సంగీతం ప్రపంచ భాష అయితే, స్నానాల గది గానమందిరం. ప్రాక్పశ్చిమాల భేదం లేని ఆచారం స్నానాలగదిలో సంగీతం పాడడం! ఒంటి మీద నీళ్ళు పడతాయంటే గొంతుక తంత్రులు సవరిస్తుంది.

తలుపు వేసుకున్నాడు.

'ఆహా....ఏమీ...నా... ఆ.. ' సరిగ్గా సక్కుబాయిలాగే విరుపులు విసిరాడు. అంటే తుంగల చలపతిరావులాగ,

దాసరి కోటిరత్నం ఎలా పాడుతుందో వినలేదు. చచ్చి ఏ స్వర్గాన వున్నాడో చలపతిరావు. అసలు చచ్చిపోయాడో లేదో.. రామనాథశాస్త్రి అనుకుంటాను. లేదు... ఇద్దరూ.

'ఆ... భాగ్యము స్వామి కనిపించెను.'

గావంచా విప్పేశాడు.

'పండరినాథుని పాదమె దొరకెన్... పాపములన్నియు నేడే తొలగెన్...' చలివేస్తోంది. నీళ్లు ఒంటి మీద పడనంతసేపే. ధైర్యం చేసి చెంబెడు నీళ్ళు పోసుకున్నాడు. ఆ వరసని నాలుగైదు చెంబులు గబగబా దిమ్మరించుకున్నాడు. బిందెడు వేణీళ్ళు తగలెయ్యకూడదూ పెళ్ళాం ముండ! కర్రలయిపోతాయట. ఏం చేస్తోందో, వంటింట్లోంచి ఊడి పడదు.

★★★

వంటింట్లో సన్నగా, ఆడగా, వంటపొగలలో కలిసి మెలసి కంఠం.


‘తొలి నే జేసిన పూజాఫలము’

చదువుకుంటానంటే, సంగీతం నేర్చుకుంటానంటే, బలవంతం మీద ముడి వేయించారు. వద్దంటే వినక నన్ను నరకంలో తోసేరు. ఎన్నాళ్ళయినా ఇంతే. నాకిది జన్మశిక్ష. వీణ మరచిపోతున్నాను. నేర్చుకోని వంట నా నెత్తిమీద పడింది.

“ఏమేవ్. సబ్బు కనబడదేం?”

“పడమటి గూట్లో వుంటుంది”

తలుపు తీశాడు. తోశాడు. తడుసుకుంటూ వెళ్ళాడు అలాగే. సబ్బు తెచ్చుకున్నాడు. గదిలోకి వెళ్ళాడు. మళ్ళీ తలుపు వేశాడు. మరో నాలుగు చెంబుల నీళ్ళు పోసుకున్నాడు. ఈలతో పాడుతున్నాడు భాగ్యం పాట.



"షాషా.... షీషీ...షా.... షాషష....'

ఏమిటో వెధవబతుకు. స్నానం, భోజనం చెయ్యాలి. తాంబూలం, బట్టలూ, జోళ్ళు వెయ్యాలి. వెళ్ళాలి ఆఫీసుకి. టైమయిపోతోంది. వంటయిందో లేదో.. రోజూ ఇదే ఏడుపు.

వారానికి రెండు ఆదివారాలూ, నెలకి డజను ఫస్టు తారీఖులూ ఉండకూడదూ? దొరల దేశాల్లో ప్రతివారం జీతాలిస్తారు. కాని ఏం లాభం? తాగేస్తారు. దొరలకి చలి వెయ్యదూ? స్నానం చెయ్యరు. ఉన్ని దుస్తులు వేసుకుంటారు. మాసిపోయిన గడ్డం చేసుకుంటే వూలుకోటు విప్పినట్టుంటుంది.

నోట్లో నీళ్ళుపోసుకుని పుక్కిలించాడు. ముక్కులోని కెళ్ళాయి. ఉక్కిరి బిక్కిరైపోయాడు.

సుజలాం, సుఫలాం మలయజ శీతలంగానే వున్నాయి.

★★★

వంటింట్లో 'వందేమాతరం' పాట,

ఎందుకో ఈజైళ్ళకి వెళ్ళడం? ఎవరి స్వాతంత్ర్యం కోసం? ఆడదానికి అడుగుతీసి అడుగువేసే అధికారం లేదు కదా. నేనసలు పెళ్ళి చేసుకోననే అన్నాను. స్వతంత్రంగా బదుకుదామనుకున్నాను. నాలుగేళ్ళలోనే నా బదుకెంత నాశనమయి పోయిందో, రెండుమార్లు ఆసుపత్రిలో పడ్డాను. ఈ మాటయినా నిలుస్తుందో నిలవదో. వీడికేవో జబ్బులున్నాయి. ఏవో దురలవాట్లున్నాయి. ప్రతిరాత్రీ ఆలస్యంగా ఇంటికి రావడమే. ఎలా తప్పుతుంది. నాకీ ఖైదు?

.... సస్య శ్యామలాం, మాతరం... వందేమాతరం. '

★★★

వందేమాతరం పాటని ఫిలింలలో పాడనివ్వరట. స్నానాలగదుల్లో పాడుకో నిస్తారనుకుంటాను. ఇరవై ఏళ్ళ కిందటి నాన్ కోఆపరేషన్ పాటలు జ్ఞాపకం తెచ్చుకుంటున్నాడు.

'నిరాకరణ మను మిఠాయి ఇదిగో...'

'కన్వర్ట్ కన్వర్ట్ హల్లో కల్లు కస్టమర్సు ఇంటూ నాన్కోపారేష్ నను నవీన మతమునా...

ఆ రోజుల్లో అవే బాగున్నాయి. అప్పుడు వాటి అర్థం తెలిసేది కాదు. స్కూళ్లు ఎగ్గొడితే హెడ్మాస్టరు బెత్తం దెబ్బలు వడ్డించాడు.

'మరో ప్రపంచం మరో ప్రపంచం

మరో ప్రపంచం పిలిచింది...'

ఈ పాటమీద నిషేధం ఉందా? ఎవరు చెప్మా దీన్ని రాశారు. ఎవడో కమ్యూనిస్టు కాబోలు.

ఇదో వెర్రిపట్టుకుంది వీళ్ళకి. సమానత్వంట! ఎలా వస్తుంది సమానత్వం? ప్రకృతిలోనే లేదు సమానత్వం కాబట్టి కమ్యూనిజం తప్పు – మరో ప్రపంచంట? ఏమిటో అది.

వీపుకి సబ్బుపట్టించి తోముతున్నాడు. కపిలవాయి గాత్రం. రంగూన్లో పాడితే సిలోన్ వినిపించేది. రేడియో లేని రోజుల్లో. వీపు అందుకు రాకుండా ఉంది. రెండో చేతితో రాశాడు.

"మీరజాలగలడా సత్యాపతి వీపు గోకగలడా...?' పేరడీకి నవ్వొచ్చింది. అన్నీ ఇదివరకటివే. కొత్త కవిత్వం. కొత్త ప్రపంచం, కొత్త సంవత్సరం అంటారు. అంతా భ్రమ. ఇదివరకు లేని విప్పుడేమున్నాయి? ఆ సూర్యుడే. ఆ చంద్రుడే. ఇదివరకులాగే పెళ్ళాడుతున్నాం. పిల్లల్ని కంటున్నాం. పెంచుతున్నాం. చస్తున్నాం. పుడుతున్నాం. మళ్ళీ చస్తున్నాం. చస్తున్నాను.. ఈ చలితో.

"ఒసే వంటయిందా?"

★★★

'శివ దీ...క్షా.... పరురాలనురా...'

ఎక్కడెక్కడకో పోతాడు. ఏవేవో ఖర్చులు. నేను మాత్రం దమ్మిడీలతో సహా పద్దులు రాయాలి. నేనీ సంసారం చెయ్యలేను. నాకు స్వాతంత్ర్యం కావాలి. సమానత్వం కావాలి. వీణ్ని నేను ప్రేమించలేదు. ఎవణ్నీ లేదా? ఏమో, ఏమో. శర్మని? ఏమో!

"మీరు నీళ్లు పోసుకునేసరికి నా వంట ఐపోతుంది!"

★★★

అయినా పాపం ఒక్కత్తే. ఇంటి చాకిరీ అంతా చేసుకోవాలి. ఒక్కొక్క మారు చూస్తే జాలివేస్తుంది. కడుపుతో వుంది కూడాను. కడుపు తోముకుంటున్నాడు. చిన్నప్పుడు మా అమ్మ ఒళ్ళంతా తోమి కడుపు మాత్రం తోమేది కాదు. ప్రేమ ఉండదట. కడుపు ప్రేమ, కడుపువల్ల ప్రేమ, ప్రేమవల్ల కడుపు. To make love అంటాం. కడుపు చెయ్యడం అంటాం. ప్రేమ చెయ్యడం అనం. To make belly అనం. ఒక్కొక్క భాష ఒక్కొక్క తీరు. ఇంగ్లీషువాడు ఎంత కొట్టుకున్నా తెలుగుని క్షుణ్ణంగా అర్థం చేసుకోగలడూ? గెలట్టీ డిక్షనరీలో తప్పులు చూపిస్తూ భారతి కొక వ్యాసం రాస్తాను. అలాంటివి వేస్తారో, వెయ్యరో? అసలు నా మొగం నేను రాసేదేమిటి. ఆఫీసు నుండి వచ్చేసరికి నవనాళ్లూ తోడుకుపోతాయి. వెధవ ఉద్యోగం

మానేస్తే! బతకలేకపోతానూ? సంసారం ఒకటి కద! రెండు ఎందుకు కూడదూ? నేను మళ్ళీ పెళ్ళిచేసుకుంటాను. మరి ఇదో? చీరకి నిప్పంటుకుని ఇది చావకూడదూ?

విషాద వార్త నేటి ఉదయం... పేటలో శ్రీమతి...(20 ఏళ్లు) వంట చేయుచుండగా చీరకు నిప్పంటుకొనబడెను. ఆసుపత్రిలో చేర్చబడెను. అచ్చటనే ఆమె మరణించబడెను.

వెధవ ఊహలు, పాపిష్టి మనస్సు, మనలో ఇంత కుళ్ళు పెట్టుకుని లోకాన్నితిడతాము.

కుళ్లు వదలినట్టేనా? కడుపు తోముకోవడం అయింది. దిగేడు. నురగ, పీచు పరుపులో బూరుగు దూది. దిగేడు. At-tain-shun లకిడీకే మాఫిక్ తోముకుంటున్నాడు. Glass with care. ఏమిటో నానా చెత్త రాసేస్తున్నారు. ఇది రాయొచ్చు. ఇది రాయకూడదు అనే వివక్షత పోయింది. ఏమైనా అంటే ఫ్రాయిడ్ అంటారు. టైఫాయిడ్ అంటాను నేను.

ఇమాజినేషన్కు జబ్బు చేస్తేనే ఇలాంటి పేలాపనలు. నేను కన్సర్వేటివ్ని. ఉన్నదాన్ని నిలబెట్టుకోవాలంటాను. మార్పు నాకిష్టంలేదు. మర్యాదగా బతకాలంటాను. తప్పుపనులుచెయ్యకూడదు. నిజమే. కాని తప్పుపనులు చేసి బయటపడి పోవడం మరీ తప్పు!

★★★

'ప్రేమమయ మీ జీవితము, త్యాగమయ మీ శర్మ నన్ను ప్రేమిస్తున్నాడు. నన్ను ప్రేమిస్తున్న వారిని నేను ప్రేమిస్తున్నాను. శర్మతో మాత్రం బదుకు ఇంతకంటే సుఖంగా వెలుగుతుందా? నాకు పెళ్ళి అక్కర్లేదు. ఏ ఉద్యోగం చేసినా బదికిపోగలను. తిరగబడాలనుకుంటాను. ధైర్యం చాలదు. ఈ లోకంలో ఆడదై పుట్టడమంత హీనం ఇంకోటి లేదు.

★★★

'ఆడబదుకే మధురం. 'ఆహా'

నిజం. ఆడదానికి ఇల్లే కోట. ఆడదాన్ని గుమ్మం కదలనివ్వకూడదు. ఎన్ని అగచాట్లు పడైయినా, ఆడదాన్ని మొగాడే రక్షిస్తాడు. మొగాడు చెడిపోయినా ఫరవాలేదు. ఆడది చెడిపోతే ప్రపంచమే ధ్వంసమయిపోతుంది. క్షేత్రం బీజం అన్నారు.

తోముకోవడం అయిపోయింది. మళ్ళీ నాలుగైదు చెంబులు దిమ్మరించుకున్నాడు.

"ఒసే వంటయిపోతే వడ్డించు."

"మీ స్నానం అయిందా?"

'అయినట్టే.'

"నా వంటకూడా అయినట్టే."

పెడసరపు జవాబులు. స్కూలు ఫైనలుదాకా చదివానని దీని గర్వం. ఆడవాళ్ళకి చదువు అవసరమే కాదు. హానికరం. అయిదో క్లాసు దాకా చదివిస్తే చాలు.

★★★

అప్పుడే వంటింటిలోంచి వినబడింది 'తుమమేరా' అని. స్నానాల గదిలో సబ్బు నురగల్లోనూ, వంట యింట్లో తాలింపు వాసనలలోనూ కలిపి మగగొంతుకా ఆడగొంతుకా ఆలాపన సాగించాయి.

ఆఫీసుకి టైమయిపోతుంది. ఆడదానికి స్వాతంత్ర్యం ఇవ్వకూడదు.

శర్మని నేను ప్రేమిస్తున్నాను. పుట్టబోయే బిడ్డ అతనిదే అనుకుంటాను.

'తుమ మేరా'

'తుమ మేరీ'

★★★

స్నానం ముగించాడు. మొగాడు అథార్టీ చేస్తూ ఉంటూనే ఆడది అణగి మణగి ఉంటుంది. లేకపోతే ఈ ఆడవాళ్ళని పట్ట పగ్గాలుంటాయా?

ఆమె శర్మను గురించి ఆలోచిస్తోంది. అతడు తన హక్కును స్థాపించుకుంటూన్నగొంతుకతో అరిచాడు.

"ఒసే! తువ్వాలు అందుకో!"

*("ఢంకా" మాసపత్రిక ఏప్రిల్ 1947 నుంచి పునర్ముద్రణ)*



ఆసక్తి.

అర్థవంతమైన పదం.

ప్రతి ఒకొక్కరికి దేనిమీదో దానిమీద ఆసక్తి ఉంటుంది. ఏ ఆసక్తి లేని మనిషి ఈ ప్రపంచంలో మనకెక్కడా తారసపడదు.

ప్రకృతి నియమాల ననుసరించి ఋతువులు, కాలాలు మారుతున్నట్టుగా, సాంకేతికపరంగా మారుతున్న ప్రపంచంలో ఈ ఆసక్తులు కూడా మారుతూండటం శోచనీయం.

ఒకానొకప్పుడు పుస్తక పఠనమనేది ప్రతి ఒక్కరికి సర్వసాధారణమైన ఆసక్తిగా ఉండేది. తద్వారా ప్రాపంచిక, సామాజిక పరిజ్ఞానాన్ని అలవరచుకునేందుకు అవకాశాలు పుష్కలంగా లభించేవి కూడా.

అయితే ఒకప్పటి ఈ పఠనాసక్తిని, నేటి అధునిక సాంకేతికత పూర్తిగా హరిస్తోందనే చెప్పాలి. దీనివలన ప్రపంచంలోనే పుస్తకాలను చదివేవారి సంఖ్య క్షీణించింది.

సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందిన జపాన్ వంటి దేశంలో ఒక వ్యక్తి సంవత్సరానికి సగటున 40 పుస్తకాలు చదువుతూంటే, అభివృద్ధి చెందుతున్న దేశాలుగా పేరొందిన చైనా, వియత్నాం, భారత్, కొరియాలలో ఆ సంఖ్య వరుసగా 0.70, 0.80, 1.20, 7.0 పుస్తకాలుగా ఉంది.

దీనికి ముఖ్యమైన కారణాలుగా రెండిటిని పేర్కొనవచ్చు.

ప్రపంచమంతటా అత్యంత వేగంగా విస్తరిస్తున్న సోషల్ మీడియా మొదటి కారణమైతే, బాల్యం నుంచి పిల్లలకు పుస్తకాల పట్ల ఆసక్తిని కలిగించడంలో విఫలమౌతున్న తల్లిదండ్రులను రెండవ కారణంగా చెప్పొచ్చు. వారిలోనే ఆ ఆసక్తి మృగ్యమవ్వడమనేది విచారించవలసిన విషయమే.

వ్యక్తిత్వవికాసానికి తోడ్పడే పఠనాసక్తి వలసిన వసతులను చేకూర్చడంలో కూడా వారు విఫలమౌతున్నారు. ఇది గమనించి బాల్యం నుంచే పిల్లల దృష్టిని పుస్తకపఠనం వైపు మళ్లేలా కృషి చేస్తే వారు బాలవికాసానికి పూలబాటలేసిన వారవుతారు.

అయిదు సంవత్సరాలుగా తెలుగు సాహితీవనాన్ని సుసంపన్నం చేస్తూ, పాఠకులలో పఠనాసక్తిని పెంపొందిస్తున్నది “కథామంజరి”.

ఈ నిర్విరామ కృషిని సదా ప్రోత్సహిస్తూ, ఆదరిస్తున్న కథాప్రియులందరికి సవినయంగా ధన్యవాదాలు తెలుపుకుంటోంది.